3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 358 | విజయవాడ, బుధవారం 30 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 30 July 2025 | Rs




భారత చెస్‌కు ఉజ్వల భవిష్యత్తు
- విశ్వనాథన్ ఆనంద్

8

అమెరికా జోక్యంపై అదే సైలెన్స్

- ఏ నేతతోనూ చర్చించలేదని మోడీ ముక్తసరి వ్యాఖ్య
- 'ఆపరేషన్ సిందూర్'పై గొప్పలు
- కేంద్రం తీరుపై ప్రతిపక్షాల నిరసనాగ్రహం



లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధానమంత్రి మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ భద్రతాపరమైన విషయాల్లో అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ జోక్యంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎప్పటిలాగే మౌనాన్ని కొనసాగించింది. జమ్ముకాశ్మీర్‌లోని పెహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రవాద దాడి, అనంతరం సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సంబంధిత అంశాలపై పార్లమెంటులో మంగళవారం కూడా వాడీవేడి చర్చ జరిగింది. లోక్‌సభలో రెండో రోజూ చర్చ కొనసాగగా, రాజ్యసభలో చర్చ ప్రారంభం అయింది. ఈ సందర్భంగా దేశ విదేశాంగ విధానం, ఆపరేషన్ సిందూర్ సందర్భంగా కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించడం, ఉగ్రదాడి ఘటనలో ప్రభుత్వం వైఫల్యాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు నిలదీశాయి. ప్రతిపక్ష పార్టీల తరపున ఉభయ సభల ప్రతిపక్ష నేతల రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, అఖిలేష్ యాదవ్, కనిమొళి, ఎ.రాజా చర్చలో పాల్గొనగా, ప్రభుత్వం తరపున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు మాట్లాడారు.

జమ్ముకాశ్మీర్‌లోని పెహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడి, ఆ తర్వాత 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటు ఉభయ సభల్లో ప్రతిపక్షాల సభ్యులు సూటిగా ప్రశ్నల వర్షం కురిపించినా..అధికారపక్షం నుంచి సంతృప్తికర సమాధానాలు రాలేదు. ఆపరేషన్ సిందూర్ గొప్పగా చేపట్టామని, పెహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ముష్కరులందరినీ మట్టుబెట్టామన్న ముక్తాయింపులు మినహా ప్రతిపక్షాల సభ్యులు అడిగిన ప్రశ్నలకు బదులివ్వలేదు. ప్రధానంగా పాక్, భారత్ వ్యవహారాల్లో తానే జోక్యం చేసుకొని శాంతి కుదిర్చానంటూ ట్రంప్ పదేపదే ప్రస్తావించిన అంశంపై ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితర నేతలు నిలదీయగా.. ఇదే అంశంపై చర్చకు సమాధానంగా మాట్లాడిన ప్రధాని మోడీ 'ప్రపంచంలో ఏ నేతతోనూ మాట్లడింది లేదు' అని ముక్తసరిగా వ్యాఖ్యానించారు. 'ఆపరేషన్ సిందూర్'తో సైన్యం విజయాలను యావత్ దేశం సంబరాలు చేసుకుంటోందని ఆయన తెలిపారు.

అరగంటలోనే కాల్పుల విరమణ : రాహుల్ గాంధీ

పహల్గాం ఉగ్రదాడి అమానుషమని, ఈ దాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిపక్షాలు ప్రభుత్వానికి బేషరతుగా మద్దతు



మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

తెలిపాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గుర్తు చేశారు. అయితే యుద్ధం చేసే రాజకీయ సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదనే విషయం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పిన మాటలు తేటతెల్లం చేస్తున్నాయని విమర్శించారు. 'పాక్‌కు మిగతా 7లో



26 గేట్లు ఎత్తివేయడంతో సాగర్ నుంచి కృష్ణమ్మ పరవళ్లు..
వార్త 6లో..

2న రైతుల ఖాతాలకు 'అన్నదాతా..' నిధులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'అన్నదాతా సుఖీభవ' 'పిఎం కిసాన్' నిధులు అర్హులైన రైతులందరి ఖాతాల్లో ఆగస్టు 2న జమ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించి ఎవరైనా ఇకెవైసి, ఎన్‌సిపై మ్యాపింగ్ కాని వారు వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఈ పథకం అమలుకు ఇంకా మూడు రోజులు సమయం ఉన్నందున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ పథకానికి అనర్హులుగా గుర్తించిన వారికి దానికి సంబంధించిన వివరాలను తెలపాల న్నారు. తిరస్కరణకు గురైన వారి వివరాలను మరోసారి పరిశీలించాలని సూచించారు. కొంత మంది రైతులకు సంబంధించిన భూమి మ్యుటేషన్ ప్రక్రియ చేయకపోవడం, ఆధార్ సీడింగ్ సరిగా నమోదు కాకపోవడం, చనిపోయిన వారికి సంబంధించిన అంశాలపై రెవెన్యూశాఖ చర్యలు తీసుకోకపోవడంతో ఈ పథకం వర్తించలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచిం చారు. వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీరావు మాట్లాడుతూ లబ్ధిపొందాలంటే ఇ-పంట, ఇకెవైసిలో నమోదు తప్పనిసరని స్పష్టం చేశారు.

నెల్లూరులో మున్సిపల్ కార్మికుల విజయం

- టెండర్ల ప్రక్రియ రద్దు

లాఠీఛార్జికి, అరెస్టులకు భయపడకుండా పోరాడి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు విజయం సాధించారు. పారిశుధ్య పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించడానికి రాష్ట్రంలోనే తొలిసారిగా పైలెట్ ప్రాజెక్టుగా తొమ్మిదవ డివిజన్‌లో చేపట్టిన టెండర్ల ప్రక్రియను అడ్డుకొని ఆదర్శంగా నిలిచారు. టెండర్లను రద్దు చేస్తున్నట్టు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. చర్చలు సఫలం కావడంతో 15 రోజులుగా చేస్తున్న సమ్మెను కార్మికులు విరమించారు. బుధవారం నుంచి విధుల్లో చేరనున్నట్టు ప్రకటించారు. కాగా, ఈ డివిజన్ మంత్రి నారాయణ నియోజకవర్గం పరిధిలో ఉండడం గమనార్హం. వార్త..2లో

3న అచ్యుతానందన్ సంతాప సభ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎం మాజీ పోలిట్‌బ్యూరో సభ్యులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్ సంస్మరణ సభ ఆగస్టు 3వ తేదీన సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు హాజరుకానున్నారు. అలాగే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో కోరింది. విఎస్ అచ్యుతానందన్ జులై 21న అనారోగ్యంతో మృతిచెందిన విషయం విదితమే. ఆయన ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడిగా, ప్రతిపక్ష నేతగా, సిఎంగా విశేష సేవలందించారు. కామ్రేడ్ కృష్ణ పిళ్లై నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. చారిత్రాత్మక పున్నప్రవాయలర్ పోరాటంలో జైలుకు వెళ్లారు. కార్మికులు, వ్యవసాయ కార్మికుల పోరాటాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించారు. సిపిఎంను ఏర్పాటు చేసిన 32 మందిలో విఎస్ ఒకరు.

కలిసి పనిచేద్దాం

- సింగపూర్ అధ్యక్షుడితో చంద్రబాబు
- డేటా సెంటర్లకు రాష్ట్రం అనుకూలమని వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పరస్పరం లాభదాయకత ప్రాతిపదికగా కలిసి పనిచేద్దామని సింగపూర్ అధ్యక్షుడు సింగపూర్ అధ్యక్షుడు ధర్మణ్ షణ్ముగ రత్నంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా సింగపూర్ అధ్యక్షుడితో పాటు సింగపూర్ అధ్యక్షుడితో భేటీమాజీ ప్రధాని ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు.ఈ సమావేశాల్లో కలిసి పనిచేయడంపైనే ప్రధానంగా చర్చ జరిగింది. నాలెడ్జి ఎకానమీ, మౌలిక సదుపాయాల కల్పన, సెమీ కండక్టర్లు, అమరావతి అభివృద్ధి, అర్బన్ ప్లానింగ్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. బాబు ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని సింగపూర్ నేతలు చెప్పినట్లు సమాచారం. పెట్టుబడిదారులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని బాబు చెప్పారు. దీనికోసం ప్రత్యేకించి ఎకోసిస్టమ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 41 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. వారిను ద్దేశించి మాట్లాడిన చంద్రబాబు గుగూల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుందని, టిసిఎస్, కాగ్నిజెంట్ సహా వివిధ ఐటి దిగ్గజ సంస్థలు వస్తున్నా యని పేర్కొన్నారు. దేశంలో తొలి క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారను. ఇప్పటికే రాష్ట్రంలో 20కిపైగా పారిశ్రామిక పాలసీలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఎపిని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ధృడనిశ్చయంతో ఉన్నామని, దీనికి సహకారం అందించాలని ఎఐ సింగపూర్ సంస్థను సిఎం కోరారు. ఎన్‌ఐఎ ఇంజనీరింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌జి జాన్‌లీన్ విలిన్‌తోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్ర తీరంలో కాకినాడ మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులను కలుపుతూ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన జురాంగడ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్‌ను సిఎం సందర్శించారు. అసుర్బానా జురాంగ్ డిప్యూటీ డైరెక్టర్ టియో ఎంగ్ కియాట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అండీలీ ప్రాజెక్టు వివరాలు తెలిపారు. ముడిచమురు ప్రాసెసింగ్, పాలిమర్లు, ఇంధనాలు, స్పెషాలిటీ కెమికల్స్ తయారీ గురించి చెప్పారు.



సింగపూర్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌తో చంద్రబాబు..

మూడువేల హెక్టార్ల సముద్రాన్ని భూమిగా మార్చి అంతర్జాతీయ ప్రమాణాలతో కెమికల్ హబ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

భాగస్వాములవుతాం : సింగపూర్ మంత్రి టాన్సీలెంగ్ హామీ

ఎపి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం అవుతుందని, సింగపూర్ మానవ వనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీలెంగ్ ప్రకటించారు. ఎపి ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈ మేరకు చంద్రబాబునాయుడితో జరిగిన భేటీపై ఎక్స్ హ్యాండిల్‌లో ట్వీట్ చేశారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదకత రంగాల్లో పెట్టుబడులు పెడతామని చెప్పారు. ఫుడ్ ఎంపైర్, ఎవర్‌వోల్ట్ లాంటి సంస్థలు ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేశాయని పేర్కొన్నారు. టాన్సీలెంగ ప్రకటనపై సిఎం చంద్రబాబునాయుడు స్పందించారు. వివిధ రంగాల్లో రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు టాన్‌సీలెంగ్‌తో కలిసి పనిచేసిన చర్చలు ఫలప్రదం అయ్యాయని పేర్కొన్నారు.

'ఆ' బస్సుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణం

- మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నిర్దేశిత బస్సుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి ఆర్‌టిసి అధికారులకు సూచించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్నట్లు టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. జోన్ల వారీగా అధికారులకు, సిబ్బందికి ఆర్‌టిసి ఉన్నతాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కడప జోన్ సమావేశాన్ని తిరుపతిలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారక తిరుమలరావుతోపాటు మంత్రి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నిర్దేశించిన బస్సుల్లో మాత్రమే ఉండబోతోందని, దీనిపై త్వరలో సమగ్ర సూచనలు ఇస్తామని తెలిపారు.ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య 30 నుంచి 35 శాతం వరకు ఉందని, ఉచిత ప్రయాణం అమలైతే 65 శాతానికి పెరగవచ్చని అంచనా వేశారు. రద్దీకి అనుగుణంగా బస్సుల నిర్వహణను మరింత మెరుగుపర్చుకోవాలని, బస్సుల కండిషన్‌పై డిపో మేనేజర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బస్టాండ్‌లో రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ప్రయాణికులకు సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులా!

- వైసిపి పిఎసి సమావేశంలో జగన్‌మోహన్‌రెడ్డి
- జగన్ భద్రతపై పిఎసి సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల తరపున ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలమైందని, ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు. ప్రశ్నించే విపక్షం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అవినీతి, దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నాయని వీటిని ఎండగట్టాలని అన్నారు. 'రీకాలింగ్ ఆఫ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని, గ్రామస్థాయిలో వెంటనే పార్టీ కమిటీలు, బూత్ కమిటీల నిర్మాణం జరగాలని అన్నారు. గ్రామస్థాయిలో నూ పార్టీ అనుబంధ విభాగాలు, యువజన, మహిళ, విద్యార్థి, సోషల్ మీడియా, రైతు, కార్మిక విభాగాలు ఏర్పాటు కావాలన్నారు. త్వరలో ప్రత్యేక యాప్‌ను కూడా విడుదల చేస్తామని, వేధింపులకు, అన్యాయానికి గురైన వారు నేరుగా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. వీలుంటే ఆధారాలూ అప్‌డేట్ చేయాలని, అవన్నీ సర్వర్లో డిజిటల్ లైబ్రెరీలో నిక్షిప్తం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, చట్టం ముందు నిలబెడతామని అన్నారు. మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నందిగం సురేష్ వంటి వైసిపి సీనియర్ నేతలను అరెస్టు చేశారని, అనిల్‌కుమార్ యాదవ్‌ను కూడా అరెస్టు చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై పోలీసుల సమక్షంలోనే దాడి చేశారన్నారు. రచ్చబండ కార్యక్రమం తరువాత గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు.



జగన్ భద్రతపై నాయకుల ఆందోళన

ఇటీవల పర్యటనల్లో జగన్‌కు భద్రత కల్పించ కపోవడంపై నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో పర్యటలో పోలీసుల నిర్లక్ష్యాన్ని సభ్యులు ప్రస్తావించారు. ఉద్దేశపూర్వకంగా భద్రత తగ్గించిందని పేర్కొన్నారు.

ఆగస్టు 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 25నుంచి 31వ తేదీ వరకు వారం రోజుల పాటు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. సచివాలయం లోని పబ్లిసిటీ సెల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1,45,97,486 మందికి ఉచితంగా వీటిని పంపిణీ చేస్తామన్నారు. 96.05 శాతం మేర రేషన్ కార్డుల ఇకెవైసిని పూర్తి చేసి దేశంలోనే రాష్ట్రం ప్రధమ స్థానంలో నిలిచింద న్నారు. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు ఇప్పటి వరకు 16,08,612 దరఖాస్తులు రాగా, వాటిలో 15,32,758 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. 4.72శాతం దరఖాస్తులనే తిరస్కరించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా నూతనంగా 9,87,644మంది తమ పేర్లను నమోదు చేసున్నారని, వీరితో కలుపుకుని లబ్దిదారుల సంఖ్య 4,29,79,897కి చేరిందన్నారు. వీరిలో 2,68,23,200మందికి కేంద్రప్రభుత్వం, 1,61,56,697మందికి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ అందజేయనున్నట్లు తెలిపారు. భద్రత, జవాబుదారీ తనంతో పారదర్శకతతో కూడిన డెబిట్, క్రెడిట్ కార్డు తరహాలో ఈ స్మార్ట్ కార్డులను రూపొందించి నట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ పెద్దఫోటోతో పాటు సభ్యుల పేర్లు పొందుపరిచినట్లు తెలిపారు.

న్యూయార్క్‌లో కాల్పులు
పోలీసు అధికారితో సహా ఐదుగురి మృతి
6

మణిపూర్‌లో ఎస్ఐఆర్
- ఎన్నికల కమిషన్ సన్నాహాలు
6

వినియోగదారులకు స్మార్ట్ షాక్
- ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకుల ఆందోళన
2

వినియోగదారులకు స్మార్ట్ షాక్

- ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకుల ఆందోళన
- స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సదస్సులు



విశాఖలో నిర్వహించిన సదస్సులో అభివాదం చేస్తున్న ఎంవిఎస్ శర్మ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్ మీటర్ల పేరుతో ఛార్జీల బాదుడు ప్రారంభమైందని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు తెలిపారు. స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల నెత్తిన భారాలు వేయడానికి ప్రయత్నిస్తోన్న టిడిపి కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు, భారాలకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే అనర్థాలు, భారాలను వివరిస్తూ.. కరపత్రాలు పంచుతూ పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. విశాఖలోని కృష్ణా గార్డెన్స్‌లో మహిళలు నిరసన తెలిపారు. సక్రమంగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్లను తొలగించి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కార్మిక, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల్లో భాగంగానే అదాని స్మార్ట్ మీటర్లు వచ్చాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం వెంకన్నపాలెంలో సిపిఎం నాయకులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ, గోడలకు స్టిక్కర్లు అతికించారు. ఐద్వా ఆధ్వర్యంలో పరవాడ సంతలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నంద్యాలలో పట్టణ పౌరుల సంక్షేమ సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సులో పట్టణ పౌరుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బాబూరావు మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని సత్యవతి నగర్, మున్సిపల్‌కాలనీ, కుంచనపల్లి ఏరియాలో సిపిఎం నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. పెంటపాడులో నిరసన తెలిపారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం, ఏలూరు వన్‌టౌన్ బిర్లాభవన్ సెంటర్‌లో సంతకాల సేకరణ చేపట్టారు.



ప్రకాశం జిల్లా ఒంగోలులో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకున్న సిపిఎం నేతలు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అడ్డగింత

గృహాలకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించే ప్రక్రియను ప్రకాశం జిల్లా ఒంగోలు నగర పరిధిలోని సుందరయ్యనగర్ వడ్డివానికుంట వాసులు అడ్డుకున్నారు. వడ్డివానికుంటలో అదాని కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్లను బిగించేందుకు మంగళవారం ఉదయం ఆ కంపెనీ సిబ్బంది ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నాయకులు బివి.రావు, రామకష్ణదాసు తదితరులు అక్కడికి చేరుకుని ప్రజలతో చర్చించారు. ఇళ్ల యజమానుల అనుమతి లేకుండా మీటర్లు ఏర్పాటు చేయడం అక్రమమని తెలిపారు. ఎవరి అనుమతితో ఈ ప్రక్రియ జరుగుతోందని సిబ్బందిని ప్రశ్నించారు. అడ్డదారిలో స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరించారు. దీంతో అదాని కంపెనీ ప్రతినిధులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

పి4 తొలిదశ 20 లక్షల కుటుంబాలకే

- సిద్ధమైన ప్రాథమిక నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో ఎంత మందికి పి-4 ద్వారా లబ్ధి కల్పించాలన్న దానిపై ప్రభుత్వం ప్రాథమిక నివేదిక సిద్ధం చేసింది. తొలి దశలో 20 లక్షల బంగారు కుటుంబాలకు లబ్ది చేకూర్చేలా ప్రణాళికను రూపొందించారు. వీరందరికీ అవసరమైన సాయం అందించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది. అయితే మొత్తం లబ్ధిదారుల సంఖ్యపై మాత్రం ఇంకా కసరత్తు కొనసాగుతూనే ఉన్నట్లు సమాచారం. మొత్తం కుటుంబాల నుంచి వరుస స్క్రూటినీలతో కుదింపు చర్చలు తీసుకుంటున్నారు. గ్రామ సభల ద్వారా, పి-4 సర్వే ద్వారా, ఇతరత్రా మార్గాల ద్వారా ఈ స్క్రూటినీలు జరుగుతుండడం గమనార్హం.

ఇలా కుదించారు!

రాష్ట్రంలో మొత్తం రెండు కోట్ల కుటుంబాలు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే గ్రామ వార్డు సచివాలయాల లెక్కల మేరకు, పి-4 కార్యకమం అమలు ప్రారంభ సమయానికి 1.7 కోట్ల కుటుంబాలే ఉన్నట్లు ఇప్పటివరకు తేలింది. వీటి నుంచి పి-4 సర్వే కోసం 1.3 కోట్ల కుటుంబాలకు కుదించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ కుటుంబాలే సాయానికి ప్రాథమిక అర్హులుగా చెబుతున్నారు. దీనికి కూడా స్క్రూటినీ చేసి అర్హులుగా 30.1 లక్షల కుటుంబాలను ఖరారు చేయగా, గ్రామ సభ్యల నిర్వహణ ద్వారా ఈ సంఖ్యను కూడా 29.9 లక్షలకు కుదించడం గమనార్హం. ఇందులో తొలి దశగా 20 లక్షల మందికే సాయం అందించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇంకా తుది జాబితా ఖరారు కాలేదని, మరోసారి జాబితాను పరిశీలించి అప్పుడు పూర్తి కుటుంబాల వివరాలను ప్రకటించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

మొత్తం అంచనా కుటుంబాలు	**2 కోట్లు**
సచివాలయాల ద్వారా అంచనా	**1.70 కోట్లు**
పి-4 సర్వే ద్వారా గుర్తింపు	**1.30 కోట్లు**
ధృవీకరణకు తేల్చిన సంఖ్య	**30.10 లక్షలు**
ఖరారుచేసిన కుటుంబాలు	**29.90 లక్షలు**
తొలి దశ సాయానికి ఎంపిక	**20 లక్షలు**

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వేగవంతం

- ఎపి చీఫ్ సెక్రటరీ విజయానంద్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వేగంగా పూర్తి చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఎపి చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఆదేశించారు. విద్యుత్ ఫీడర్స్ విభజన, విద్యుత్ రంగం పునరుద్ధీకరణ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ పథకం అమలు తీరుపై విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం బాపట్ల కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 71,025 వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 50,108 మీటర్లు బిగించారని, లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ తీగల ఏర్పాటు, నిర్వహణ పర్యవేక్షణపై దృష్టి సారించాలన్నారు. సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. పిఎం కుసుమ పథకం కింద బాపట్ల జిల్లాలో 8,844 మంది రైతులకు సౌర విద్యుత్ పంపుసెట్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి, ఎపిసిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి, జిల్లా ఇంఛార్జ్ సంయుక్త కలెక్టర్, డిఆర్ఒ జి.గంగాధర్ గౌడ్, విద్యుత్ శాఖ డైరెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై దాడికి సిఐటియు ఖండన

- నిరసనల్లో పాల్గొనాలని పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై జరిగిన దాడిని సిఐటియు రాష్ట్రకమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆచరణలోకి తెస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య పనుల వర్క్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిని వ్యతిరేకిస్తూ నెల్లూరు మున్సిపల్ కార్మికులు గత 16 రోజులుగా చేస్తున్న సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని తెలిపారు. మహిళలపై మగ పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని, భౌతిక దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఇదే ప్రభుత్వం ఉండగా వర్క్ కాంట్రాక్ట్‌ను అమలు చేయడాన్ని మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తూ సుదీర్ఘకాలం పోరాడటంతో వర్క్ కాంట్రాక్ట్ అమలు కాలేదని తెలిపారు. కార్మికుల వేతనాలకు, పీఎఫ్, ఇఎస్ఐలకు భద్రత లభించిందని పేర్కొన్నారు. నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే ఒక ఏజెన్సీని నిర్వహించి దాని ద్వారా వేతనాలు, పీఎఫ్, ఇఎస్ఐ ల చెల్లింపులను గ్యారంటీ చేయడం వల్ల ఈ భద్రత లభించిందని వివరించారు.

కార్మికులు సాధించుకున్న ఈ పద్ధతిని మరలా రద్దు చేసి పాలక పార్టీ కార్యకర్తలకు కాంట్రాక్ట్ లభించే విధంగా పనులను వర్క్ కాంట్రాక్ట్‌కు ఇవ్వడం వల్ల కార్మికులకు సరైన సమయానికి వేతనాలు కూడా లభించక ఇబ్బందిపడతారని తెలిపారు. గతంలో ఈ అనుభవం ఉందని, అందుకనే నెల్లూరులో ప్రారంభించిన వర్క్ కాంట్రాక్ట్ పద్ధతిని కార్మికులు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారని వెల్లడించారు. ఈ పద్ధతిని రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వ నిర్ణయమని, దీనికి వ్యతిరేకంగా మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాపిత పోరాటానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. కార్మికులపై జరిగిన దాడిని మున్సిపల్ కార్మికులు శుక్రవారం వరకూ నిరసన ప్రదర్శనలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నిరసన ప్రదర్శనల్లో సిఐటియు కమిటీలు, యూనియన్లు పాల్గొని మున్సిపల్ కార్మికులకు మద్దతుగా నిలవాలని కోరారు.

ప్రదర్శనలు, రోడ్డు షోలకు అనుమతుల్లేవు

- మాజీ సిఎం జగన్ పర్యటనపై పోలీసుల ఆంక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరులో 30 యాక్ట్ అమలులో ఉందని, ర్యాలీలు, ప్రదర్శనలు, రోడ్డు షో వంటివి నిర్వహించాలంటే పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి ఎ.ఆర్ దామోదర్ హెచ్చరించారు. ఈ నెల 31న మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరులో పర్యటించనున్న నేపథ్యంలో ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. దామోదర్ మాట్లాడుతూ.. కారాగారంలోని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అయ్యేందుకు, అనంతరం కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిసేందుకే వైసిపి నాయకులు, శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు పోలీసు శాఖ అనుమతి ఇచ్చిందన్నారు. జగన్ పర్యటన సందర్భంగా ఎటువంటి జనసమీకరణ చేయడం లేదని, రోడ్డు షో నిర్వహించడం లేదని పోలీసు శాఖకు చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. హెలిప్యాడ్ వద్ద జగన్‌ను కలిసేందుకు పది మందికే అనుమతి ఇచ్చామని తెలిపారు. జైలు శాఖ నియమ నిబంధనల మేరకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌ను కలిసేందుకు కారాగారంలోకి ముగ్గురికి మాత్రమే అనుమతి ఉందన్నారు. అందుకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాకాణిని కలిసిన అనంతరం రోడ్డు మార్గంలో సుజాతమ్మ కాలనీలోని నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి చేరుకునేందుకు పది వాహనాల కాన్వాయ్ , పోలీసు శాఖ నుంచి అనుమతి ఉన్న మరో మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని చెప్పారు. చట్టాన్ని ఎవరైనా అతిక్రమించి ర్యాలీలు, ప్రదర్శనలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య, నగర, రూరల్ డిఎస్‌పిలు హిమబిందు, ఘట్టమనేని శ్రీనివాసులున్నారు.

హంద్రీనీవా కాలువ పనులను అడ్డుకున్న రైతులు

- నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించండి

ప్రజాశక్తి- గుడిపల్లి (చిత్తూరు జిల్లా)

భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం అందించకుండానే గుత్తేదారులు పనులు చేస్తుండటంతో హంద్రీనీవా కాలువ పనులను చిత్తూరు జిల్లా గుడిపల్లి మండలం సిరిగిరిపల్లి, ఒంటిపల్లి రైతులు అడ్డుకున్నారు. రైతులు మాట్లాడుతూ... తాము అభివృద్ధికి ఆటంకం కాదని హంద్రీనీవా కాలువ ద్వారా నీరు వస్తే తమకూ సంతోషమేనని అన్నారు. 2016 సంవత్సరంలో హంద్రీనీవా కాలువ పనుల నిర్మాణం కోసం సిరిగిరి పల్లి, ఒంటిపల్లికి చెందిన 13 మందికి చెందిన రైతుల భూములను తీసుకోవడం జరిగిందని, గత తొమ్మిది సంవత్సరాలుగా తమకు నష్టపరిహారం ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న హెచ్ఎన్ఎస్ డిఇ...రైతులతో మాట్లాడారు. వెంటనే నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తొమ్మిదేళ్లుగా నష్టపరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నామని, తమకు నష్టపరిహారం అందిన తర్వాతే పనులు చేయాలని రైతులు తేల్చి చెప్పారు. దీంతో గుత్తేదారు పనులను నిలిపివేశారు.

జిఎస్ఎల్‌వి ఎఫ్-16 కౌంట్‌డౌన్

- నేడు ప్రయోగం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం నుంచి బుధవారం సాయంత్రం 5.40 గంటలకు నింగిలోకి నిస్సార్ శాటిలైటు జిఎస్ఎల్‌వి ఎఫ్ - 16 ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు నింగిలోకి పంప నున్నారు. నాసా, ఇస్రో సంయుక్తంగా చేపట్టిన 2392 కిలోల బరువు కలిగిన నిస్సార్ శాటిలైటు 747 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య అనువర్తన కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. భూకక్ష్యలోకి చేరిన 40 రోజుల తరువాత పరిశీలనను ఈ శాటిలైట్ మొదలు పెట్టనుంది. భూమిపై విపత్తులు, ఇతర మార్పులను సూక్ష్మ పరిశీలనతో పాటు అత్యంత సూక్ష్మమైన ఛాయాచిత్రాలను నిశితంగా పరిశీలించి ఇస్రోకు స్పష్టమైన సమాచారాన్ని అందించనుంది. మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ మొదలైంది. ఇది నిరంతరా యంగా 27.30 గంటలపాటు సాగిన అనంతరం బుధవారం సాయంత్రం ఐదు గంటల 40 నిమిషా లకు నింగిలోకి దూసుకు పోనుంది. ఈ ఏర్పాట్లను ఇస్రో ఛైర్మన్ నారాయణ పర్యవేక్షిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి అమెరికన్ (నాసా) శాస్త్రవేత్తలు ఇస్రోకు చేరుకున్నారు. ఈ ప్రయోగం విజయవంతం కావాలని శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయాల్లో ఇస్రో శాస్త్రవేత్తలు పూజలు నిర్వహించారు.

శ్రీవారి మెట్టు మార్గంలో ఏనుగుల కలకలం

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి)

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురం నుంచి తిరుమలకు వెళ్లే శ్రీవారి మెట్టు మార్గంలో ఏనుగుల సంచారం కలకలం సృష్టించాయి. సుమారు 15 నుంచి 17 ఏనుగులు పంప్‌హౌస్ వద్ద పంట పొలాలను ధ్వంసం చేశాయి. దీంతో వినాయకస్వామి చెక్ పాయింట్ దగ్గర శ్రీవారి యాత్రికులను గంటపాటు నిలిపివేశారు. అటవీ, టిటిడి ఫారెస్ట్, విజిలెన్స్ అధికారుల సమన్వయంతో ఏనుగులను అడవిలోకి తరలించారు. పరిసర ప్రాంతాల్లోని రైతులు అప్ర మత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీలను అడ్డుకున్న స్పీకర్

ప్రజాశక్తి - కోటవురట్ల (అనకాపల్లి)

అధిక లోడుతో రాకపోకలు సాగిస్తున్న లారీలను అసెంబ్లీ స్పీకర్, నర్సీపట్నం ఎమ్మెల్యే సిహెచ్.అయ్యన్నపాత్రుడు మంగళవారం అడ్డుకున్నారు. భారీ వాహనాలతో అనకాపల్లి - తాళ్లపాలెం - నర్సీపట్నం మధ్యనున్న వంతెనలు బలహీనపడుతున్న విషయమై కొద్ది రోజుల క్రితం ఆయన ఆయా వంతెనలను పరిశీలించారు. ఆ మార్గాల్లో అధిక లోడుతో వాహనాలు వెళ్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ నిబంధనలు అతిక్రమించి లారీలు ప్రయాణిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాకవరపాలెం మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో భారీ లోడుతో వెళ్తున్న వాహనాలు కనిపించాయి. వెంటనే ఆయన రంగంలోకి దిగారు. రాజుపేట సమీపంలో భారీ వాహనాలను నిలువరించారు. వాటి ధ్రువపత్రాలను పరిశీలించారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను స్థానిక పోలీసులకు అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాళ్లపాలెం వంతెన ఇప్పటికే శిథిలమైందన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ ఉన్నారు.

కరేడు గిరిజన మహిళలకు బెయిల్

ప్రజాశక్తి-ఉలవపాడు

నెల్లూరు జిల్లా కరేడు గిరిజన మహిళలకు బెయిల్ మంజూరైంది. ఇండోసోల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడిన ముగ్గురు గిరిజన మహిళలను శనివారం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం కరేడు ఉద్యమాన్ని నీరుగార్చడానికి శనివారం అర్ధరాత్రి ముగ్గురు గిరిజన మహిళలపై కేసు నమోదు చేసింది. మహిళలకు అండగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. అజయ్‌కుమార్, నాయకులు జివిబి కుమార్ నిలిచారు. మరుసటి రోజు రాజకీయాలకు అతీతంగా కరేడు రైతులు పెద్ద ఎత్తున ఉలవపాడు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు కేసు తీవ్రతను తగ్గించారు. ఈ కేసులో గిరిజన మహిళలకు సిపిఎం, వైసిపి, బిసివై, కాంగ్రెస్, సిపిఐతో పాటు వామపక్షాలు అండగా నిలిచాయి. బెయిల్ కోసం సిపిఎం నేతలు, బిసివై పార్టీ అధ్యక్షులు కృషి చేశారు. దీంతో మంగళవారం వారికి బెయిల్ మంజూరైంది. ఒంగోలు జైలులో ఉన్న మహిళలను బుధవారం విడుదల చేసే అవకాశం ఉంది.



రైతులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

'సోలార్' కోసం బలవంతపు భూసేకరణ

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సోలార్ ప్లాంట్ పేరుతో రైతుల నుంచి బలవంతపు భూసేకరణ ఆపాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్ కోసం భూములు కోల్పోతున్న వైఎస్‌ఆర్ కడప జిల్లా జమ్మలమడుగులోని కల్వటాల, గోవిందపల్లె, పాపాయపల్లె గ్రామాల్లో మంగళవారం రైతు సంఘం నాయకులు పర్యటించారు. భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్లాంట్ కోసం భూములు ఇవ్వకపోతే అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. రైతుల అనుమతి లేకుండా రాత్రి సమయాల్లో బలవంతంగా గుంతలు తీసి స్తంభాలు ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. సోలార్ ఆదాయంలో 20 శాతం బాధిత కుటుంబాలకు ఇవ్వాలని, భూములు కోల్పోయిన బాధితులకు ఉద్యోగ అవకాశాలు, 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోలార్ ప్రాజెక్టు కోసం ఎన్నో ఏళ్ల నుండి వస్తున్న రస్తాలను మూసివేయడం తగదని, వెంటనే వాటిని తిరిగి పునఃప్రారంభించాలని కోరారు. బాధిత రైతులందరికీ న్యాయమైన నష్టపరిహారం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలకు శ్రీకారం చూడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ పాల్గొన్నారు.

ఫేస్ యాప్ రద్దు చేయండి

- 'అంగన్‌వాడీ' సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని, సెంటర్ల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వడంతో పాటు ఒక్క యాప్ మాత్రమే నిర్వహించాలని పలు అంగన్‌వాడీ సంఘాలు డిమాండ్ చేశాయి. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఎపి అంగన్‌వాడీ, ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్స్(సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు) సంఘాల నేతలు మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 4న ప్రభుత్వం ఇచ్చిన మొబైల్స్‌ని రాష్ట్ర వ్యాప్తంగా ఐసిడిఎస్ కార్యాలయాల్లో అప్పజెప్తామని తెలిపారు. ఐసిడిఎస్ లక్ష్యం పేద గర్భిణీలు , బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారం, ఆరోగ్యం, విద్య అందించడమేనన్నారు. అంగన్‌వాడీలకు 2022లో ఫోన్‌లు ఇచ్చారని వాటిలో 90శాతం ఫోన్లు చెడిపోయాయన్నారు. యాప్‌ల నిర్వహణకు కావాల్సిన నెట్ స్పీడ్ ఇవ్వలేదని, ఎలా అప్‌లోడ్ చేయాలనే అంశంపై శిక్షణ కూడా ఇవ్వలేదన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య ఉందని, లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, సరుకుల పంపిణీ, మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరగాలని అధికారులు పెట్టే వత్తిడితో ప్రీస్కూలు దెబ్బతింటోందన్నారు. లబ్ధిదారులకు గతంలో మాదిరిగానే సంతకం పెట్టించుకుని సరుకులు ఇవ్వాలని, అంగన్‌వాడీలు, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మినీ టీచర్స్ జిఒ వెంటనే ఇచ్చి అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అందరికీ వర్తింపజేయాలని, మినిట్స్ కాపీ ప్రకారం (స్ట్రైక్ పీరియడ్‌లో) టిఎ, డిఎ నెలకి ఒకటి చొప్పున ఒప్పందం ప్రకారం చెల్లించాలన్నారు. ప్రధాన మంత్రి మాతృవందన యోజన పథకం అంగన్‌వాడీ సెంటర్లకు అప్పజెప్పరాదని యూనియన్ నేతలు కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్‌కు వేతనాలు రూ.26 వేలు వేతనాలు ఇవ్వాలన్నారు. గ్రాట్యూటీ జీఓను సవరించి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసిన వారికి 1972 చట్టం ప్రకారం అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావమ్మ, ఉపాధ్యక్షురాలు ఎన్‌సిహెచ్ సుప్రజ, ఎస్ వాణిశ్రీ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, సిహెచ్ విజయదుర్గ, ఎపి ప్రగతిశీల అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఆర్ జ్యోతిలు పాల్గొన్నారు.

నెల్లూరులో మున్సిపల్ కార్మికుల విజయం

- టెండర్ల ప్రక్రియ రద్దు
- నేటి నుంచి విధుల్లోకి కార్మికులు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య కార్మికుల సమ్మె విజయవంతమైంది. రాష్ట్రంలోనే తొలిసారిగా పైలెట్ ప్రాజెక్టుగా మున్సిపల్ పారిశుధ్య పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించడానికి టెండర్లు పిలిచింది. అందులో భాగంగా మంత్రి నారాయణ నియోజకవర్గం నుంచి ప్రారంభించాలని భావించింది. కార్పొరేషన్‌లో తొమ్మిదవ డివిజన్‌లో పారిశుధ్య పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించడానికి టెండర్లు పిలవడంతో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెలోకి దిగారు. 1250 మంది కార్మికులు 15 రోజులుగా ధర్నాలు, ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. కార్మికుల సమ్మెకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్వయంగా పాల్గొని మద్దతు తెలిపారు. కార్మికులు సమ్మెను విరమించకపోవడంతో పోటీ కార్మికులను కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దించారు. దీనిని నిరసించిన కార్మికులను అక్రమంగా అరెస్ట్ చేశారు. తమ నాయకులు, కార్యకర్తలను విడుదల చేయాలని అడిగినందుకు పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. పలువురు కార్మికులపై కేసులు నమోదు చేశారు. దీంతో మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. ఈ నేపథ్యంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు నందన్‌తో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నరసయ్య, గౌరవ అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావుతో చర్చలు జరిపారు. తొమ్మిదవ డివిజన్‌లో పారిశుధ్య పనులను కాంట్రాక్టరుకు అప్పగించే టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. మంత్రి నారాయణ వచ్చిన తరువాత పైలెట్ ప్రాజెక్టు విషయమై చర్చిద్దామని, సమ్మె కాలంలో కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు చెల్లిస్తామని, పోలీసులు పెట్టిన కేసులను తొలగిస్తామని, 60 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు వారి కుటుంబంలోని వారికి ఉద్యోగం కల్పిస్తామని, ఆప్కాస్‌లోనే కార్మికులు పనిచేస్తారని, జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చర్చలు సఫలం కావడంతో కార్మికులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం నుంచి విధుల్లో చేరుతామని తెలిపారు.



కార్మిక నాయకులతో చర్చలు జరుపుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ నందన్

లాఠీఛార్జీని ఖండిస్తూ నిరసనలు

నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జీ చేయడాన్ని ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో విజయనగరం అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరించాల్సిన పాలకవర్గం, పోలీస్ నిర్బంధాన్ని ప్రయోగించి, అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, అనంతపురం, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. కర్నూలు గడియారం ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు రాష్ట్రపతి రోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు.

మూలపేటలో శాటిలైట్ షిప్‌యార్డు

- భూమి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన
- హిందుస్తాన్ షిప్‌యార్డు సిఎమ్‌డి హేమంత్ ఖత్రి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

హిందుస్తాన్ షిప్‌యార్డు (హెచ్ఎస్ఎల్) విస్తరణలో భాగంగా శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు సమీపంలో శాటిలైట్ షిప్‌యార్డును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి 150 నుంచి 200 ఎకరాల భూమి కోసం ప్రతిపాదన చేశామని హిందుస్తాన్ షిప్‌యార్డు సిఎమ్‌డి డాక్టర్ హేమంత్ ఖత్రి తెలిపారు. రాష్ట్రంలోని కాకినాడ పోర్టు వద్దనైనా భూమిని తాము స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. విశాఖలోని షిప్‌యార్డులో బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో కలిసి మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాగల రెండేళ్లలో రూ.3 వేల కోట్ల టర్నోవర్‌ను సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సబ్ మెరైన్‌ల రీఫిట్, రిపేర్లలో నాణ్యత, సకాలంలో డెలివరీలో దేశంలోని షిప్‌యార్డుల్లో నెంబర్ వన్‌గా ఉన్నామన్నారు. 2017లో సింధుకీర్తి సబ్‌మెరైన్ విశాఖకు వస్తే 2021 జులైలో దీన్ని విజయవంతంగా పూర్తి చేసి పంపామన్నారు. దేశంలోని రక్షణ రంగానికి, నేవీ, పోర్టు, ఒఎన్‌జిసి, డిసిఐకి అవసరమైన నౌకలు, ఫ్లీట్ సపోర్టు షిప్‌లు, టగ్‌లను నిర్మించడంలో హెచ్ఎస్ఎల్ విశేష కృషి చేసిందన్నారు. విశాఖ షిప్‌యార్డుకు విదేశాలతో వ్యాపార లావాదేవీల విషయంలో సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. వియత్నాం సహా అనేక దేశాలతో సబ్‌మెరైన్ల రిపేర్లు, రీఫిట్‌ల విషయమై ఎంఒయులు చేశామని చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో 25 సబ్‌మెరైన్లను రీఫిట్ చేసినట్లు వెల్లడించారు. లాక్‌డౌన్ కాలంలోనూ పనుల నిర్వహణను ఆపకుండా చేయడంతో 2025 నాటికి 'మినీరత్న' హోదాను షిప్‌యార్డు సాధించిందని తెలిపారు. దేశంలోని మిగతా షిప్‌యార్డుల కంటే జీరో విజిలెన్స్, జీరో డిసిప్లిన్ కేసులు నమోదైన నౌకానిర్మాణ కేంద్రంగా విశాఖ ఘనత సాధించిందన్నారు. విశాఖలో హెలికాప్టర్లు ల్యాండింగ్ అయ్యేందుకు వీలుగా వచ్చే ఏడాది 250 మీటర్ల పొడవైన ల్యాండింగ్ ప్లాట్ ఫాంలు, డాక్‌ల నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హేమంత్ ఖత్రి

బలమైన ప్రగతి బాటలో ప్రయాణం

గడచిన నాలుగేళ్లలో విశాఖ షిప్‌యార్డు బలమైన కేంద్రంగా అవతరించిందని, 40 ఏళ్లలో ఎప్పుడూలేని టర్నోవర్, ఆదాయం సమకూర్చుకుందని హేమంత్ ఖత్రి తెలిపారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.403 కోట్ల ఆదాయం ఉండగా 2024-2025లో రూ.1783 కోట్ల ఆదాయానికి చేరుకుందన్నారు. 2020-2021లో లాభం కేవలం రూ.51 కోట్లు ఉండగా 2024-25లో రూ.284 కోట్లు ఆర్జించామని చెప్పారు. రాగల కాలంలో రూ.9 వేల కోట్లు రిపేర్లు, రీఫిట్ ఆర్డర్లు రాబోతున్నాయని వెల్లడించారు.

భద్రాచలం వద్ద తగ్గిన గోదావరి నీటి మట్టం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి 10 గంటలకు భద్రాచలం వద్ద 36.5 అడుగుల నీటిమట్టం ఉండగా మంగళవారం సాయంత్రానికి 36.3గా నమోదైంది. కొద్ది రోజులుగా తగ్గుతూ, పెరుగుతూ వస్తున్న గోదావరి ముంపు మండలాల వాసుల్లో భయాందోళన కలిగిస్తూనే ఉంది. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. యడవల్లి వద్ద ఎద్దు వాగు కాజ్‌వే నాలుగు రోజులుగా మునిగి ఉండడంతో సుమారు 20 గ్రాముల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మంగళవారం సాయంత్రంనాటికి పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గింది. పోలవరం ప్రాజెక్టు వద్ద 6,70,355 లక్షల క్యూసెక్కుల గోదావరి నీటిని జలవనరుల శాఖ అధికారులు స్పిల్ వే నుంచి దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అల్లూరి జిల్లా విఆర్.పురం, శ్రీరామగిరి, రామవరం, అడివి వెంకన్నగూడెం, చొప్పల్లి, ధర్మతాల గూడెం, వడ్డిగూడెం కాలనీ వాసులు వరదొస్తే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు ఇప్పటికే సిద్ధమయ్యారు. ఎత్తైన ప్రదేశాలు, గుట్టలపై గుడారాలు, పాకలు ఏర్పాటు చేసుకున్నారు.

పిఆర్‌సి ఊసే లేదు

- ఉద్యోగుల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?
- ఎపి రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు

ప్రజాశక్తి- విజయనగరం కంటోన్మెంట్

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగులను పట్టించుకోవడం లేదని ఎపి రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు విమర్శించారు. విజయనగరంలో మంగళవారం జరిగిన రెవెన్యూ ఉద్యోగుల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, టిడిపి కూటమి ప్రభుత్వం వస్తే సమస్యలు తీరుతాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలిందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఒక్కసారైనా సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు.

చంద్రబాబు నాయుడు మంచి పిఆర్‌సి ఇస్తామని చెప్పారని, ఏడాదైనా పిఆర్‌సి కమిషన్ ఊసేలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ ఇవ్వకపోవడం వల్ల ప్రతి ఉద్యోగి సంవత్సరానికి లక్ష నుంచి లక్షన్నర రూపాయల వరకు ఆదాయం కోల్పోతున్నారని తెలిపారు. ప్రభుత్వోద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలు ఉందని ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించారని తెలిపారు. సిపిఎస్‌పై ప్రభుత్వం నుంచి ఇంతవరకు ప్రకటన లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను చిన్నచూపు చూస్తే ఏం జరుగుతుందో గతంలో విజయవాడలో జరిగిన మహాధర్నా నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డుపై టిఎన్‌యుఎస్ హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిర్వహించిన అతిపెద్ద పేరెంట్ టీచర్ మీటింగ్(మెగా పిటిఎం) నిర్వహించిన కార్యక్రమం గిన్నిస్ ప్రపంచ రికార్డును నెలకొల్పడం పట్ల టిఎన్‌యుఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెగా పిటిఎంలో 1.5 కోట్ల మంది హాజరయ్యేలా చేసి ప్రపంచం మొత్తం రాష్ట్రంవైపు చూసేలా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేశారని తెలిపారు. మంత్రి లోకేష్‌కు, విద్యాశాఖ అధికారులకు అభినందనలు తెలిపారు.

మైక్రో ఫైనాన్స్ ఆగడాలు అరికట్టేందుకు

చట్టాలను పటిష్ట పరచాలి

- రుణ యాప్‌లను చట్టం పరిధిలోకి తేవాలి
- ఐద్వా పబ్లిక్ హియరింగ్‌లో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మైక్రో ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల ఆగడాలను అరికట్టేందుకు చట్టాల్లో ఉన్న లోపాలను సరిద్ది వాటిని పటిష్టంగా అమలు చేయాలని, లోన్ యాప్‌లను చట్టం పరిధిలోకి తేవాలని ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొన్న పలువురు వక్తలు డిమాండ్ చేశారు. 'మైక్రోఫైనాన్స్ – పొదపులు – అప్పులు – పీడన' అనే అంశంపై ఈ బహిరంగ విచారణ జరిగింది ఈ కార్యక్రమానికి జ్యూరీ సభ్యులుగా హాజరైన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి టి.రజని మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకువచ్చిన మైక్రో ఫైనాన్స్ ఇనిస్టిట్యూషన్స్ యాక్ట్‌లో వడ్డీ రేట్లు, కాల పరిమితిపై సరైన స్పష్టత లేదన్నారు. దీంతో ఈ చట్టం వల్ల ప్రజలకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదని చెప్పారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టాల్లో లోపాలను సవరించి పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తన సర్వీసులో ఈ చట్టం కింద ఒక్క కేసు కూడా నమోదు కాలేదని చెప్పారు. ఎఎన్‌యు మాజీ వైస్‌ఛాన్సలర్ కె.వియన్నారావు మాట్లాడుతూ, లోన్ యాప్‌లను చట్ట పరిధిలోకి తీసుకువచ్చి, నియంత్రణ చేయాలన్నారు. కుటుంబం అనుమతి లేకుండా చేసే అప్పులకు ఇతర కుటుంబ సభ్యులను చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత కోసం అవగాహన కల్పించాలన్నారు. ఐలూ నాయకులు, సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 2007 సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఏ సమయంలో పడితే ఆ సమయంలో రుణాల వసూళ్లకు వెళ్లకూడదన్నారు. వసూళ్లకు వెళ్లిన సమయంలో వాడే భాష సక్రమంగా ఉండాలన్నారు. కోర్టుల్లో చెక్ బౌన్స్ కేసులు 43 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యలపై ఎక్కడ అవసరమైనా ఐలు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందని ప్రకటించారు. ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ, మైక్రో ఫైనాన్స్ అప్పులపై యుద్ధం మొదలు పెట్టకపోతే పేదలకు రక్షణ లేదన్నారు. సరళీకరణ విధానాల ఫలితంగా జాతీయ బ్యాంకుల స్థానంలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని తెలిపారు. అదాని, అంబానీ, ఇతర కంపెనీలు జనం నుంచి డబ్బు గుంజుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఇందుకు మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఒక సాధనంగా వాడుకుంటున్నారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలు అప్పుల్లో కూరుకుపోవడానికి కారణం ప్రభుత్వ విధానాలేనన్నారు. త్వరలో రేపల్లెలో బహిరంగా విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. మైక్రో ఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల వేదింపులపై పోరాడేందుకు సిద్ధం కావాలన్నారు. తొలుత స్థానికంగా అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం, సామాజిక మాధ్యమాలను వినియోగించుకుని సమస్యలపై పోస్టులు చేయాలని సూచించారు.. మెరిస్ స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన సర్వే వివరాలు వెల్లడించారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు బ్యాంక్‌ల వల్ల ఎదురవుతున్న సమస్యలపై ఎస్ఎల్‌బిసి ఛీఫ్ మేనేజర్ గౌతమ్ సమాధానాలు ఇచ్చారు. ఆయన దృష్టికి తీసుకువెళ్లిన సమస్యలను నమోదు చేసుకుని పరిష్కారానికి ఆయా బ్యాంక్‌లకు సూచిస్తానని తెలిపారు. అధిక సంఖ్యలో మహిళలు కుటుంబ పోషణ కోసం రుణాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ పద్మా, జమున తదితరులు ప్రసంగించారు. ఈ బహిరంగ విచారణలో వివిధ జిల్లాల నుంచి హాజరైన బాధితులు మైక్రో ఫైనాన్స్, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు, వడ్డీ వ్యాపారుల వల్ల తాము ఎదుర్కొంటున్న సమస్యలు జ్యూరీకి తెలియజేశారు. ఐద్వా నాయకులు కె.శ్రీదేవి, డి.శ్రీనివాసకుమారి, జి.అమల శ్రీ, శ్యామల, వరలక్ష్మి, ముంతాజ్, రజని అరుణ, ఉమశ్రీ తదితరులు పాల్గొన్నారు.




బహిరంగ విచారణలో మాట్లాడుతున్న ఎస్ఎల్‌బిసి చీఫ్ మేనేజర్ గౌతమ్

వడ్డెర రాష్ట్ర అధ్యక్షులుగా వెంకటయ్య

- నూతనంగా ఎన్నికైన కమిటీ
- ముగిసిన మహాసభ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి


అధ్యక్షులు వెంకటయ్య


కార్యదర్శి దయాకర్

ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా చల్లా వెంకటయ్య, గుంజి దయాకర్ ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు నగరంలోని సుంద రరామిరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రథమ రాష్ట్ర మహాసభ సోమవారం ముగిసింది. అంతకుముందు కార్యదర్శి నివేదికను గుంజి దయాకర్ ప్రవేశపెట్టారు.

ఈ నివేదికపై అన్ని జిల్లాల నుంచి వచ్చిన 150 మంది ప్రతినిధులు చర్చించి, ఆమోదించారు. ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగా వడ్డెర్లకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, ప్రతి వడ్డెర కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని, రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వడం ద్వారా వలసలను అరికట్టాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని ప్రతినిధుల సభ తీర్మానించింది. క్వారీలు, గ్రావెల్, ఎర్రమట్టి కొండలపైన 50 శాతం హక్కు కల్పించాలని, క్వారీలలో పనిచేస్తున్న వృత్తిదారులకు సీనరీస్ ఛార్జీలు మినహాయించాలని, వడ్డెర సొసైటీలకు కాంట్రాక్ట్ వర్కులు ఇఎండి లేకుండా అనుమతించాలని, 20 శాతం వర్కులను వడ్డెర సొసైటీలకు ఇచ్చి వడ్డెర యువతకు జీవనోపాధి కల్పించాలని, వడ్డెర కార్పొరేషన్ బడ్జెట్‌లో రూ. 1000 కోట్లు నిధులు కేటాయించి విధి విధానాలు ప్రకటించి ఆ నిధులను వడ్డెరుల సంక్షేమానికి ఖర్చు చేయాలని తీర్మానించింది.

నూతన కమిటీ ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ వడ్డేర వృత్తిదారుల సంఘం కోశాధికారిగా చంద్రగిరి శివ నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, మోహన్, సహాయ కార్యదర్శిగా తన్నీరు శ్రీరాములు, డేరంగుల పద్మనాభ రాజు ఎన్నుకోబడ్డారు.

కమిటీ సభ్యులుగా కోటకొండ వెంకటేష్ , బత్తుల రత్నయ్య, మల్లీ నాగార్జున్ తమ్మిశెట్టి, నాగ గండికోట శంకర్, విరగదండ్ల రమణ, బత్తుల గంగయ్య ఎంపికయ్యారు.

గిరిజన మహిళలపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం

ప్రజాశక్తి- ఉలవపాడు (నెల్లూరు జిల్లా)


మిరియం శ్రీనివాసులు


గిరిజన మహిళలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం టిడిపి నాయకులకు తగదని 139 బిసి కులాల జెఎసి రాష్ట్ర చైర్మన్, కరేడు రైతు ఉద్యమ నాయకుడు మిరియం శ్రీనివాసులు అన్నారు. పోలీస్ యంత్రాంగం మొత్తం ఇండోసోల్ పరిశ్రమకు పూర్తి స్థాయిలో వత్తాసు పలుకుతూ రైతులపై, రైతు కూలీలపై అక్రమంగా కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందని తెలిపారు. అలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తం చేసే విధంగా కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. గ్రామంలోకి ఎవరూ రావొద్దంటూ పోలీసులు ప్రకటించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పోలీసులు రాజ్యాంగం ప్రకారం వ్యవహరించాలి తప్ప, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం తగదన్నారు. రైతులపై, గిరిజన మహిళలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అక్కాచెల్లెళ్లు ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్: వివాహం చేయలేదని మనస్తాపానికి గురైన అక్కాచెల్లెళ్లు ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నారు. ఆస్పత్రిలోచికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాయచోటి పట్టణం బోస్‌నగర్ పూజారిబండ వీధిలో నివసిస్తున్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఫాతిమా (22), అఫ్రీన్ (18) ఉన్నారు. జీవనోపాధి నిమిత్తం తండ్రి కువైట్‌కు వెళ్లి వచ్చారు. తమకు పెళ్లి సంబంధాలు చూడడం లేదని అక్కాచెల్లెల్లు ఇద్దరూ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్కాచెల్లెలు ఇద్దరూ ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నారు. ఇంట్లో నుంచి కేకలు, మంటలు, దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఇంటి తలుపులు బద్దలు కొట్టి మంటలను ఆర్పేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న అక్కాచెల్లెలు ఇద్దరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాయచోటి కోర్టు జడ్జి ఆసుపత్రికి చేరుకుని వారి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ఫాతిమా మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అఫ్రీన్ మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శంఖు, చక్రాలను అందిస్తున్న దాతలు

శ్రీవారికి బంగారు శంఖు, చక్రాలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారికి బంగారు శంఖు, చక్రాలను విరాళంగా అందించారు. చెన్నైకు చెందిన సుదర్శన్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ సుమారు రూ.2.40 కోట్లు విలువైన దాదాపు రెండున్నర కేజీల బంగారు శంఖు, చక్రాలను విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరికి శంఖు, చక్రాలను అందజేశారు.

జింకల బెడద

- ఏటా పంటలు నష్టపోతున్న రైతులు
- ప్రతిపాదనలకే జింకల పార్కు పరిమితం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి


పొలాల్లో గుంపులుగా ఉన్న జింకలు

జింకల పార్కు ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో, పంటలకు జింకల బెడద తప్పడం లేదు. ఏటా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కంది పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం విత్తనాలను, మొలకలు వచ్చిన, చిగురించిన పంటలను జింకలు తినేస్తున్నాయి. ఆదోని, ఆలూరు, ఆస్పరి, పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి, హాలహర్వి, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, గూడూరు, కల్లూరు, ఓర్వకల్లు, మిడుతూరు మండలాల్లోని నల్లరేగడి భూముల్లో జింకల సంచారం ఎక్కువగా ఉంది. ఒక్కో మందకు 15 నుంచి 20 జింకలు సంచరిస్తూ పొలాల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయి. అటవీ శాఖాధికారుల సర్వేలో తొమ్మిది వేలకుపైగా జింకలు ఉన్నట్లు గుర్తించారు. ఇవి గత ఖరీఫ్‌లో 25 వేల ఎకరాల్లోపైగా పంటలను నాశనం చేసినట్లు, సుమారు రూ.వంద కోట్ల మేర అన్నదాతలకు నష్టం వాటిల్లినట్లు అంచనా. ఏటా ఇదే పరిస్థితి ఎదుర్కోవాల్సి రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. 2014లో కర్నూలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై స్పందిస్తూ, జింకల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆలూరు నియోజకవర్గం హోళగుంద మండలం దేవరగట్టు ప్రాంతంలో జింకల పార్కు ఏర్పాటుకు 250 ఎకరాల భూమిని సర్వే చేశారు. పార్కు నిర్మాణానికి రూ.14.72 కోట్లు, ఐదేళ్లపాటు దీని నిర్వహణకు రూ.29.65 కోట్లు మొత్తం రూ.44.37 కోట్లు అవసరమని, తుంగభద్ర రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలోని 35, 36, 37 బీట్ కంపార్ట్‌మెంట్‌లో 12 అడుగుల ఎత్తులో కంచె వేయాలని అటవీ శాఖాధికారులు 2016లో ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం స్పందించలేదు. దీంతో, 2018లో మరోసారి ప్రతిపాదనలు పంపారు. కాలయాపన జరిగినందున రూ.53.26 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయినా, ఫలితం లేకపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కూడా జింకల పార్కుపై దృష్టి సారించలేదు. అప్పటి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం కూడా పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా అచరణకు నోచుకోలేదు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో ఇప్పుడైనా పార్కును ఏర్పాటు చేసి తమ పంటలను జింకల బారినుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రాత్రి, పగలు కాపలా కాస్తున్నాం

నాకున్న నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాను. గుంపులు గుంపులుగా జింకలు వచ్చి పంటను మొలక దశలోనే తినేస్తున్నాయి. పంటను తొక్కేస్తున్నాయి. రాత్రి, పగలు కాపలా కాస్తున్నాం.

– రంగస్వామి, రైతు పెద్దహరివాణం, ఆదోని మండలం

పంటలను కాపాడాలి



ప్రభుత్వం, జిల్లా అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని రైతుల పంటలను కాపాడాలి. దీనిపై అనేకసార్లు జిల్లా అధికార యంత్రాంగానికి వినతిపత్రాలు ఇచ్చాం. ఆందోళనలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. అయినా, ఫలితం లేకుండా ఉంది.

– జి.రామకృష్ణ, రైతు సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి.

పరిహారం అందించేందుకు చర్యలు

ప్రస్తుతం తుంగభద్ర ప్రాంతంలో జింకలు తినేందుకు ప్రత్యేకంగా పంటలు పండిస్తున్నాం. జింకల వల్ల పంటలు నష్టపోయిన రైతులు మండల వ్యవసాయ అధికారి ద్వారా ధ్రువీకరణ పత్రం తీసుకుని అందజేస్తే అటవీ శాఖ ద్వారా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– తేజస్విని, ఫారెస్ట్ రేంజ్ అధికారి

అక్రమ కార్యకలాపాలకు తావివ్వం

- ఖైదీల్లో పరివర్తనకు ప్రత్యేక చర్యలు : జైళ్ల శాఖ డిజి

ప్రజాశక్తి - కడప

జైలులో ఎలాంటి అక్రమ కార్యకలాపాలకూ తావు లేకుండా చూస్తామని జైళ్ల శాఖ డిజి అంజనీకుమార్ పేర్కొన్నారు. ఖైదీల్లో పరివర్తనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. మంగళవారం కడప సెంట్రల్ జైలును ఆయన సందర్శించి అధికారులతో మాట్లాడి, విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో అంజనీకుమార్ మాట్లాడుతూ.. మహిళా ఖైదీలకు స్కిల్ డెవలప్‌మెంట్, స్కిల్ ఇంప్రూవ్‌మెంట్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. నెలరోజుల్లో స్కిల్ డెవలప్‌మెంట్‌ను ప్రారంభిస్తామని, స్పోర్ట్స్ విభాగంలోనూ ఖైదీలకు అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందుకు తగిన చర్యలు ఇప్పటికే మొదలయ్యాయని తెలిపారు. మదనపల్లి సక్సస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టిఒటి కోర్సును తీసుకువస్తున్నామని చెప్పారు. శిక్ష అనంతరం ఖైదీలు సమాజంలో గౌరవం, ఉపాధి పొందేలా ఈ ట్రైనింగ్ ఇస్తారని చెప్పారు. ఇది త్వరలో అన్ని జిల్లా కేంద్ర కారాగాల్లో మొదలవుతోందన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో పది నుంచి 15 మంది యోగా ట్రైనర్లను ఆరునెలల్లో తయారు చేసే లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. ఖైదీల విచారణకు ఇ-ములాకత్ ద్వారా మెజిస్ట్రేట్‌ల ముందు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికే 90 శాతం ఖైదీలను ఇ-ములాకత్ ద్వారా మెజిస్ట్రేట్ ముందు హాజరపరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న డిజి అంజనీ కుమార్

రాయలసీమ డిక్లరేషన్ అమలు చేస్తాం

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాయలసీమ డిక్లరేషన్ అమలు చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తెలిపారు. కర్నూలు నగరంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఉదయం కర్నూలు క్లబ్ క్యాంటీన్ వద్ద ఛాయ్ పే చర్చలో భాగంగా స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఎ క్యాంప్ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి మౌర్యా ఇన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మౌర్యా ఇన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం పంచాయతీ నిధులను దారి మళ్లించిందని, టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాకా నేరుగా పంచాయతీలకు నిధులు వస్తున్నాయని తెలిపారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాల్సి ఉందని, రాయలసీమపై ప్రత్యేక ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని బిజెపి కోరిందని తెలిపారు. తుంగభద్ర ఎల్ఎల్‌సి నుంచి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా 70 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందన్నారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఐటి పరిశ్రమలో ఇక కోతలే..!

- సాంప్రదాయ నైపుణ్యాలకు కాలం చెల్లుతోంది
- కొత్తగా స్కిల్స్ పెంచుకోవాల్సిందే
- నాస్కామ్ హెచ్చరిక



న్యూఢిల్లీ : భారత ఐటి రంగంలో మరిన్ని ఉద్వాసనలు చోటు చేసుకోనున్నాయని ఐటి సేవల కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నాస్కామ్ అంచనా వేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమలో పెను మార్పులు వస్తున్నాయని పేర్కొంది. ఈ దశలో రాబోయే నెలల్లో మరిన్ని ఉద్యోగ కోతలు జరిగే అవకాశం ఉందని నాస్కామ్ మంగళవారం ఓ రిపోర్ట్‌లో హెచ్చరించింది. దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ప్రపంచ వ్యాప్తంగా 2 శాతానికి సమానమయ్యే 12,000 మందిపై వేటు వేస్తోన్న నేపథ్యంలో నాస్కామ్ ప్రకటనకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఐటి పరిశ్రమకు ఇది ఓ మలుపు సమయని పేర్కొంది. "ప్రపంచవ్యాప్తంగా క్లయింట్‌లు ఐటి సేవల నుండి వేగవంతమైన, సౌలభ్యమైన, ఆవిష్కరణాత్మక ఫలితాలను డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఐటి కంపెనీలు కృత్రిమ మేధా (ఎఐ), ఆటోమేషన్‌పై దృష్టి పెడుతున్నారు. కొన్ని సాంప్రదాయ నైపుణ్యాలకు కాలం చెల్లుతోంది. ఉద్యోగులు కెరీర్ మార్పులు లేదా నైపుణ్య అభివృద్ధి దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. టిసిఎస్ ఇటీవల 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించడం ఈ ధోరణికి ఉదాహరణ. ఇతర ఐటి కంపెనీలు కూడా ఇలాంటి చర్యలు చేపట్టే అవకాశం ఉంది." అని నాస్కామ్ తెలిపింది. ఎఐ ప్రధానంగా మారుతోన్న నేపథ్యంలో నిర్దిష్ట నైపుణ్యాలు, అత్యంత ప్రత్యేక నైపుణ్యాల కోసం నియామకాలపె కంపెనీలు దృష్టి సారిస్తాయని నాస్కామ్ పేర్కొంది. ఈ మార్పులు స్వల్పకాలిక ఉద్యోగ నష్టాలకు దారితీసినప్పటికీ, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించబడుతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. ఆటో పరిశ్రమ ఎఐ, ఆటోమేషన్ ద్వారా గణనీయమైన మార్పులకు లోనవుతోంది. ఇది స్వల్పకాలంలో ఉద్యోగ కోతలకు దారితీసినప్పటికీ, నిరంతర అధ్యయనం, నైపుణ్యాభివృద్ధి ద్వారా కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించబడుతాయని.. ఈ క్రమంలో ఐటి నిపుణులు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తమ స్కిల్స్‌ను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని నాస్కామ్ సూచించింది.

టిసిఎస్‌లో సీనియర్ నియామకాలు నిలిపివేత..

దేశంలోనే అతిపెద్ద టెక్నాలజీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) సీనియర్ల నియామకాలను నిలిపేసినట్లు తెలుస్తోంది. దీంతో పాటు వార్షిక వేతనాల పెంపును ఆపేసినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకొందని సమాచారం. ఇప్పటికే 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు టిసిఎస్ సిఇఒ కె కృతివాసన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

బజాజ్ ఫిన్‌సర్వ్ నుంచి ఈక్విటీ సేవింగ్స్ ఫండ్

ముంబయి : మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థ బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి కొత్తగా ఈక్విటీ సేవింగ్స్ ఫండ్‌ను ప్రారంభించింది.

ఈ ఓపెన్ ఎండ్ హైబ్రిడ్ పథకంలోని నిధులను ఈక్విటీ, ఆర్బిట్రేజ్, డెట్‌లో పెట్టుబడిగా పెట్టనున్నట్లు పేర్కొంది. ఈ ఎన్‌ఎఫ్ఒ ఆగస్టు 11 వరకు తెరిచి ఉంటుందని వెల్లడించింది. స్థిర ఆదాయం, తక్కువ రిస్కుతో ఈక్విటీ ఎక్స్‌పోజర్ కోరుకునేవారికి ఈ ఫండ్ అనుకూలంగా ఉంటుందని ఆ సంస్థ ప్రతినిధి గణేష్ మోహన్ పేర్కొన్నారు. ఇందులో కనీస పెట్టుబడిని రూ.500గా నిర్ణయించింది.

బ్యాంకుల్లో మురుగుతోన్న రూ.67 వేల కోట్ల డిపాజిట్లు

న్యూఢిల్లీ : బ్యాంక్‌ల్లో కాల వ్యవధి ముగిసిపోయినప్పటికీ ఖాతాదారులు వెనక్కి తీసుకోని (అన్‌క్లెయిమ్డ్) డిపాజిట్లు భారీగా పేరుకుపోతున్నాయి.

ఈ ఏడాది జూన్ చివరికి రూ.67,003 కోట్లకు చేరాయి. ఇందులో ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రూ.58,330 కోట్లు ఉండగా.. ప్రయివేటు బ్యాంక్‌ల్లో రూ.8,673.72 కోట్లు చొప్పున నమోదయ్యాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు తెలిపారు. పిఎస్‌బిల్లో ఒక్క స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లోనే అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.19,330 కోట్లుగా ఉన్నాయి. తర్వాత పిఎన్‌బిలో రూ.6,910 కోట్లు, కెనరా బ్యాంక్‌లో రూ.6,278 కోట్లు చొప్పున ఉన్నాయి. ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంకుల్లో రూ.2,063 కోట్లు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లున్నాయన్నారు.

రూపీ డీలా

న్యూఢిల్లీ : అమెరికా టారీఫ్ చర్చలకు తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ మరింత పడిపోయింది.

మరోవైపు ఇటీవల స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్‌ఐఐలు తరలిపోవడంతో మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 12 పైసలు పతనమై 86.82కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్సేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 86.92 కనిష్టాన్ని తాకింది. ముడి చమురు బ్యారెల్ ధర 0.46 శాతం పెరిగి 70.36 వద్ద ముగిసింది.

సంపాదకీయం

'దివ్య' విజయం

అంతర్జాతీయ చదరంగం వేదికపై సరికొత్త చరితకు 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ నాంది పలకడం అభినందనీయం. గతంలో ఎన్నడూ క్వార్టర్ ఫైనల్ దశను దాటని ఫిడే మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నీలో భారత్ దిగ్గజ క్రీడాకారిణి కోనేరు హంపి, దివ్య ఫైనల్‌కు చేరడం ద్వారా ముందుగానే మన దేశానికి పతకం ఖాయం చేయడం సువర్ణాధ్యాయమే. హేమాహేమీలు తలపడ్డ టోర్నీలో ఫేవరెట్‌గా కాదుకదా గట్టి పోటీదారుగా కూడా కూడా ఎవరూ పరిగణించని, కనీసం గ్రాండ్ మాస్టర్ హోదా కూడా లేని దివ్య విజేతగా నిలవడం ద్వారా చదరంగంలో అసాధారణ ప్రతిభావంతురాలిగా తనను తాను నిరూపించుకున్నారు. ప్రపంచ కప్ గెలవడం, గ్రాండ్ మాస్టర్ హోదా దక్కడం, క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించడం ద్వారా ప్రపంచ ఛాంపియన్‌గా పోటీపడే అర్హతను పిన్న వయసులోనే దివ్య దక్కించుకోవడం భారత చదరంగం భవితకు శుభపరిణామం. ఇండియా నుంచి గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకున్న 88వ ప్లేయర్‌గా, నాలుగో అమ్మాయిగా ఆమె నిలిచారు. అంతకుముందు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి మాత్రమే ఈ ఘనతను సాధించారు.


2002లోనే గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకుని, అనేక టైటిళ్లతో, అపార అనుభవంతో ఆడుతూ గత ఏడాదే ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్ సాధించిన తెలుగమ్మాయి కోనేరు హంపిదే విజయమని అనుకున్నారంతా! దూకుడు, ప్రశాంతత, సరికొత్త వ్యూహాలతో కీలకమైన ఫైనల్‌లో టై బ్రేకర్‌లో విజయం ద్వారా అందరి అంచనాలనూ దివ్య తలకిందులు చేసింది. ఇదేమీ గాలివాటు విజయం కాదు. దివ్య ఐదేళ్ల నుంచి 'పావులు' కదుపుతూ నేటికి ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదిగింది. గత ఏడాది ప్రపంచ అండర్ 20 టోర్నీలోనూ, 2023లో ఆసియా కాంటినెంటల్ ఛాంపియన్‌గాను, 2022లో ఇండియన్ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత కాంస్యం, 2021లో మహిళా గ్రాండ్ మాస్టర్ టైటిల్, 2020లో ఆన్‌లైన్ ఒలింపియాడ్‌లో స్వర్ణం ద్వారా ఇంతింతై వటుడింతే అన్నట్టుగా ఎదిగింది. 46 దేశాలకు చెందిన 107 మంది అత్యుత్తమ క్రీడాకారిణులు, టాప్ 20లోని 17 మంది తలపడి నిలబడటం ముదావహం.

ప్రస్తుత చదరంగంలో ఏకంగా ఐదు టైటిల్స్‌తో ప్రపంచంపై భారత్ ఆధిపత్యం కొనసాగిస్తోంది. ప్రపంచ ఛాంపియన్‌గా గుకేశ్, పురుషుల, మహిళల ఒలింపియాడ్‌లలో విజయాలు, ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేతగా హంపి, తాజా గెలుపుతో దివ్య సత్తా చాటారు. చదరంగం పుట్టినిల్లుగా చెప్పుకుంటున్న భారత్‌కు ఆ గుర్తింపును తీసుకొచ్చిన ఘనత విశ్వనాథన్ ఆనంద్‌కు దక్కుతుంది. అప్పటివరకూ ఉన్న విదేశీ క్రీడాకారుల హవాకు ఆయన బ్రేకులు వేశారు. ఆ తరువాత చెస్‌పై ఆసక్తితో ఎందరో క్రీడాకారులు ఈ రంగంలోకి అడుగుపెట్టారు. హంపి లాంటి క్రీడాకారులు మహిళల చెస్‌లో సత్తా చాటారు. ఇదంతా సంతోషదాయకమే అయినా, నేటికీ మహిళల సంఖ్య తక్కువగానే ఉంది. వారికి టోర్నీలు నిర్వహించే పరిస్థితి కూడా తక్కువే. క్రికెట్ మాదిరిగా చదరంగాన్ని ప్రోత్సహించే వాతావరణమేమీ లేదు. ఇదేమీ కార్పొరేట్లకు కాసులు కురిపించదు కదా! శిక్షణ తీసుకునేందుకు, టోర్నమెంట్లకు వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేక అర్ధాంతరంగా ఆగిపోతున్న చిచ్చర పిడుగులెందరో! విజేతలను ప్రశంసించడంలో, భారీ నజరానాలివ్వడంలో పోటీపడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు... ప్రోత్సాహాన్ని అందించడంలోనూ ముందుండాలి. ఆ నమ్మకం కలిగినప్పుడే పిల్లల ఆసక్తికి అనుగుణంగా వారిని క్రీడల్లో ప్రోత్సహిస్తే.. వారి భవిష్యత్, దేశం భవిష్యత్ బాగుంటుందనే భరోసా తల్లిదండ్రులకు ఉంటుంది. అప్పుడే క్రీడల పట్ల మరింతగా ప్రోత్సహించే వాతావరణం సాకారమవుతుంది. వచ్చే ఏడాది జరగనున్న ఫిడే క్యాండిడేట్స్ టోర్నీలోనూ దివ్య విజేతగా నిలవాలని కోరుకుందాం!


మహనీయుల మాట



విప్లవంలో ఎదురుదెబ్బలు తిన్నప్పుడూ,
శత్రువు విజయం సాధించినప్పుడూ...
స్థిమితం కోల్పోకుండా,
కుదుపులకు గురికాకుండా వున్నవాడు...
విప్లవం వెనుకపట్టు పట్టినప్పుడు...
బెదిరిపోకుండా,
నిరాశకు గురికాకుండా వున్నవాడు
నిజమైన విప్లవకారుడు.
- జోసెఫ్ స్టాలిన్



విద్యుత్ స్మార్ట్ బాదుడు



మీటర్లు లేకుండానే సర్దుబాటు ఛార్జీల భారం విపరీతంగా ఉంది. మీటర్లు కూడా తోడైతే ఇక బాదుడుకు అంతే ఉండదు. అందుకే మీటర్లను అడ్డుకోవాలి. అనుమతి లేకుండా పెడితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. చెత్త పన్ను చెల్లించకుండా జనం ఉద్యమించడంతో రద్దయింది. రైతుల పంపుసెట్లకు మీటర్లపై పోరాడటంతో తాత్కాలికంగా ఆగింది. పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ ఇంకా అనేక రాష్ట్రాల్లో మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు వెనక్కి తగ్గక తప్పలేదు. మన రాష్ట్రంలోనూ ఉద్యమం తీవ్రతరం చేద్దాం. సర్దుబాటు చార్జీల విధానం రద్దు కావాలి. అదనపు వసూళ్లు ఆపివేయాలి. మిగులును వినియోగదారులకు బదలాయించాలి. చార్జీలు తగ్గించాలి. స్మార్ట్ మీటర్లు ఒప్పందాలు రద్దు చేయాలి. మీటర్ల బిగింపు ఆపాలి. పెట్టిన మీటర్లు తొలగించాలి.

విశ్లేషణ



సిహెచ్. బాబూరావు

కరెంటు చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. బిల్లులు పెరిగి జనం గగ్గోలు పెడుతున్నారు. చార్జీలు పెంచలేదని, ఆ పాపం మాది కాదని కూటమి నేతలు నమ్మబలుకుతున్నారు. రాబోయే కాలంలో పెంచేది లేదని, ప్రస్తుతం ట్రూ డౌన్ ద్వారా రూ.450 కోట్ల తగ్గిస్తున్నట్లు ప్రచార ఆర్భాటం చేస్తున్నారు. నిజాలు ఏమిటో తెలుసుకుందాం.

మరింత పెరిగిన బాదుడు

సాంకేతికంగా వచ్చిన మార్పులతో కరెంటు చార్జీలు తగ్గించవచ్చు. ఒకనాడు రూ.12 ఉన్న సోలార్ విద్యుత్ నేడు 2 రూపాయలకే లభిస్తోంది. అయినా బిల్లులు పెంచుతూనే పోతున్నారు. కరెంటు బిల్లు చూస్తే వాస్తవాలు పూర్తిగా అర్థం కావు. ప్రతి నెలా వాడిన కరెంటుపై యూనిట్‌కు రూ.1.90 పైసల నుండి రూ.10 వరకు వసూలు చేస్తున్నారు. ఇది అసలు చార్జి. ఇక కొసరు చార్జీలు ఎన్నో. ఫిక్స్‌డ్ చార్జి, కస్టమర్ చార్జి వసూళ్లు సాగుతున్నాయి. సర్ చార్జీలు, పెనాల్టీలు వేస్తున్నారు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జి (ఎఫ్.పి.పి.సి.ఎ) లతో పెద్ద మోసం జరుగుతోంది. ఏ వస్తువుకైనా, ఏ సర్వీసుకైనా వాడుకున్న సంవత్సరం, ఐదేళ్ల తర్వాత మళ్లీ, మళ్లీ చార్జీలు వసూలు చేయటం విడ్డూరం. నాడు టిడిపి ప్రభుత్వం విద్యుత్‌పై సర్దుబాటు చార్జీల విధానాన్ని పెట్టింది. తరువాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కొనసాగించాయి. 2014 నుండి 19 వరకు వాడుకున్న కరెంటుపై 36 నెలల నుండి రూ.3 వేల కోట్ల ట్రూఅప్ చార్జీలు వసూలు చేస్తూనే ఉన్నారు. 2022-23, 23-24 సంవత్సరంలో వాడుకున్న కరెంటుపై రూ.15,485 కోట్ల అదనంగా సర్దుబాటు చార్జీలను కూటమి ప్రభుత్వ హయాంలో మోపారు. ప్రతి నెల, గత నెలలో వాడుకున్న కరెంటుపై సర్దుబాటు చార్జీలు వసూలు చేసుకోవచ్చని మోడీ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీని అవకాశంగా తీసుకొని వైసిపి పాలనలో ప్రతి నెలా 40 పైసలు అదనంగా సర్దుబాటు చార్జీల బాదుడు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేయకపోగా కొనసాగిస్తున్నది. ఈ సంవత్సరం లోనే రూ. 2787 కోట్ల చేశారు. ఇలా 4 రకాల సర్దుబాటు చార్జీల బాదుడు సాగుతోంది. ఖర్చులు పెరిగి లోటు వస్తే ప్రభుత్వం భరించాలి తప్ప, బిల్లు కట్టిన దానిపై మళ్లీ, మళ్లీ సర్దుబాటు చార్జీలు వేయటం అక్రమం. ఈ అడ్డగోలు వసూళ్లు ఇంకానా.. ఇకపై సాగకూడదు. ఈ విధానమే రద్దు కావాలి.

కరెంటు బిల్లుపై కూడా విద్యుత్ సుంకం (ఎలక్ట్రిసిటీ డ్యూటీ) వసూలు చేస్తూ ప్రభుత్వాలు ఖజానా నింపుకుంటున్నాయి. ప్రతి యూనిట్ వాడకంపైన 6 పైసలు సుంకం విధిస్తున్నారు. వైసిపి సర్కార్ వ్యాపారం, పరిశ్రమలపై దీనిని 6 పైసల నుండి 100 పైసల (రూపాయి)కి పెంచింది. హైకోర్టు ఈ పెంపు చెల్లదని తీర్పు ఇచ్చింది. కూటమి దీనిని రద్దు చేయకపోగా, చట్టబద్ధత కల్పించి యథేచ్ఛగా రూపాయి వసూలు చేస్తోంది. అదనపు లోడ్ పేరుతో డెవలప్‌మెంట్ చార్జీలు, బిల్లుపై అదనపు డిపాజిట్లు, కొత్త కనెక్షన్లకు డిపాజిట్ల పెంపు... ఇలా పలు రూపాలలో ప్రజలను పీడించి వసూలు చేస్తున్నారు.

విద్యుత్ ప్రత్యక్ష భారాలే కాదు, పరోక్ష భారాలు ఎన్నో ఉన్నాయి. కూల్ డ్రింక్, వాటర్ బాటిల్, పాల ప్యాకెట్ ఏది కొన్నా, ఫ్రిజ్‌లో ఉంచినందుకు రూ.2 అదనపు భారం పడుతోంది. విద్యుత్ చార్జీలు పెంచగానే రైలు చార్జీలు పెంచుతున్నారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లో కరెంటు ఖర్చు పెరిగి ఇంటి పన్నులు పెంచుతున్నారు. ఇలా ఎడా..పెడా.. విద్యుత్ భారాలు సాగుతున్నాయి. కొన్ని పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఈ భారాలతో మూతపడుతున్నాయి. ఉపాధి దెబ్బ తింటున్నది. అభివృద్ధి కుంటుపడుతున్నది.

కూటమి ప్రభుత్వంలోనూ ఊరట ఏమీ లేదు. మరింతగా భారాలు పెరిగాయి. 2019-24 సంవత్సరాల్లో ముందుగానే అధిక, అదనపు వసూళ్లు చేయటం వల్ల విద్యుత్ సంస్థల్లో మిగులు ఏర్పడింది. 2024-25 సంవత్సరంలో తూర్పు (ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్) పంపిణీ సంస్థకు 1200 కోట్ల రూపాయలు మిగులు వచ్చింది. ఈ మిగులును దారి మళ్ళించి, సంవత్సర ఖర్చుల్లో కలిపేసి ప్రజల కళ్ళు గప్పుతున్నారు. దానిని వినియోగదారులకు బదలాయించి, చార్జీలు తగ్గించాలి. లెక్కలేవీ చూడకుండానే ముందుగానే సర్దుబాటు చార్జీలు అధికంగా వసూలు చేయటం మరో దగా. అంకెల మాయాజాలం సాగిస్తున్నారు. ఆషాఢం రిబేట్ లాగా ముందుగా వేల కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీలు వసూలు చేసి రూ.450 కోట్లు తగ్గిస్తున్నట్లు నాటకం ఆడుతున్నారు. ఇదంతా పచ్చి మోసం. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటి వరకు వసూలు చేసిన అదనపు చార్జీలు ప్రజలకు తిరిగిఇవ్వాలి. సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి. రాబోయే బిల్లులలోనైనా వీటిని తగ్గించాలి.

దోపిడి, అవినీతి, కుమ్మక్కు

విద్యుత్ శాఖలో ఖర్చులు ఎందుకు పెరుగుతున్నాయి? భారాలు ఎందుకు పెంచుతున్నారు? సంస్కరణల పేరుతో పాలకులు తెచ్చిన విధానాలే దీనికి కారణం. విద్యుత్ ఉత్పత్తి క్రమంగా బడా కంపెనీల చేతిలోకి వెళ్ళింది. బడా సంస్థలతో ప్రభుత్వాలు అక్రమ ఒప్పందాలు చేసుకున్నాయి. తాజాగా 25 సంవత్సరాల పాటు ఏడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ సరఫరా చేసే ఒప్పందం కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకి ద్వారా అదానితో వైసిపి ప్రభుత్వం చేసుకున్నది. రూ.1750 కోట్ల లంచాలు తీసుకుని ఒప్పందం చేసుకున్నట్లు అమెరికా కోర్టులలో సాక్ష్యాధారాలతో విచారణ జరుగుతోంది. ఈ ఒప్పందం వల్ల భవిష్యత్తు తరాలపై రూ. లక్షా ఇరవై వేల కోట్ల భారం పడుతుందని చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. ఈ ఒప్పందం చెల్లదని నేటి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నాడు హైకోర్టులో కేసు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడిచినా ఈ ఒప్పందం రద్దు చేయలేదు. కనీసం విచారణ కూడా చేయటం లేదు. ఒప్పందం రద్దు సాధ్యం కాదని తేల్చేసింది. ఎవరి అవినీతిని ఎవరు కాపాడుతున్నారు? ఎవరు, ఎవరితో కుమ్మక్కవుతున్నారు? ఇదే కాదు. స్వదేశీ, విదేశీ బొగ్గు కార్పొరేట్ల చేతిలో ఉంది. పోర్టులు, రవాణాలోనూ దోచుకుంటున్నారు. విద్యుత్ స్వల్పకాలిక కొనుగోళ్లలో వేలాది కోట్ల రూపాయల కుంభకోణాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ బినామీ సంస్థగా చెప్పిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ నాడు, నేడు విద్యుత్ రంగాన్ని శాసిస్తున్నది. ట్రాన్స్‌ఫార్మర్లు మొదలు మొత్తం మెటీరియల్ కొనుగోలులో వేల కోట్లు దోచుకున్నారు. వ్యవసాయ స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు వారికే దక్కింది. ఆ షిర్డీ సాయి సంస్థకు చెందిన ఇండో సోల్ కంపెనీకి ఉలవపాడు, కరేడు వద్ద 8 వేల ఎకరాల భూములను కూటమి ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా లాక్కొని వీరికి కట్టబెట్టింది. ఈ సంస్థ ఎన్నికలలో టిడిపికి రూ.30 కోట్ల బాండ్ల రూపంలో ముడుపులు ఇచ్చింది. అదాని, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్, కార్పొరేట్ కంపెనీల అవినీతి, దోపిడీలో బిజెపి, టిడిపి, వైసిపి, జనసేనలకు ఏమీ తేడా లేదు. అందరూ దోషులే. అందరి విధానాలు ఒక్కటే. పాలకులు, కార్పొరేట్లు, ఉన్నతాధికారులు కుమ్మక్కు అయ్యి విద్యుత్ రంగాన్ని నాశనం చేస్తున్నారు. ప్రజలపై భారాలు పెంచుతున్నారు.

అదాని స్మార్ట్ బాంబ్

అదాని ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లతో దోపిడీలో మరో నూతన అంకం ప్రారంభమయ్యింది. రాష్ట్రంలోని రెండు కోట్ల వినియోగదారులకు బాగున్న పాత మీటర్లు తొలగించి, అదాని స్మార్ట్‌మీటర్లు దశలవారీగా బిగిస్తున్నారు. ఇది మీటర్ మార్పు మాత్రమే కాదు. విధానం మార్పు. విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు ఇది తొలి మెట్టు. 10 సంవత్సరాల పాటు నిర్వహణ అదానికి అప్పగిస్తున్నారు. మీటర్ పెట్టడమంటే, రాబోయే కాలమంతా అదానీ ద్వారా విద్యుత్ సరఫరాకి అంగీకరించినట్లే. తొలి దశలో 41 లక్షల మీటర్లు పెడుతున్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రమాదం లేదని, ఉచితమని, కేంద్రం సహాయం చేస్తున్నదని, అన్ని ఇళ్లకు పెట్టబోమని, సమాచారం గంటగంటకి పంపుతామని, బిల్లులు ఎక్కువ రావని, పారదర్శకత ఉంటుందని అధికారులతో ప్రభుత్వం ప్రకటనలు చేపిస్తోంది. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులకు సమాధానం చెప్పే ధైర్యంలేక అధికారులతో ఇటువంటి అబద్ధపు ప్రకటనలు చేయిస్తున్నారు. నష్టం లేకపోతే ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని లోకేష్, కూటమి నేతలు ఎందుకు పిలుపునిచ్చారు? మీటర్ల ఒప్పందం అక్రమం, రద్దు చేయాలని టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హైకోర్టులో ఎందుకు కేసు వేశారు. నాడు తప్పు, నేడు ఒప్పు ఎలా అయింది. మీటర్లలో తేడా వచ్చిందా? కాదు, కూటమి పాలకులలో మార్పు వచ్చింది? ఈ మోసపూరిత ప్రకటనలు నమ్మకండి. వాస్తవాలు గమనించండి. సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలి. సింగిల్ ఫేస్ మీటర్‌కు రూ.9 వేలు, త్రీ ఫేస్ మీటర్‌కు రూ.17 వేలు 93 వాయిదాలలో వినియోగదారులే చెల్లించాలి. గంటగంటకు రీడింగ్ తీస్తారు. పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు. చలికాలం ఒక రేటు, వేసవి కాలం ఒక రేటు చెల్లించాలి. ఇప్పటికే "టైం ఆఫ్ ది డే" విధానం ప్రకారం కొన్ని సంస్థలకు వేరువేరు రేట్లు వసూళ్లు ప్రారంభించారు. ఈ మీటర్ల వలన మన ఇల్లు, సంస్థ, కుటుంబం మొత్తంపై అదానీ సంస్థ డిజిటల్ నిఘా ఉంటుంది. వ్యక్తిగత గోప్యతకు ప్రమాదమని ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రీపెయిడ్ పద్ధతి, మీటర్ ఖర్చు ఒకేసారి చెల్లించాలి లేదా నెల అద్దె వసూలు అనుమతిస్తూ, విద్యుత్ నియంత్రణ మండలి నిబంధనలు మార్చి, కూటమి సర్కార్ ఈ సంవత్సరం ఫిబ్రవరి 25న 921, 923 నంబర్ గెజిట్‌లు విడుదల చేసిన మాట నిజం కాదా? రెండు కోట్ల మీటర్లకు రూ.25 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. కేంద్రం ఎంత ఇస్తోంది. అయినా కేంద్రం ఇచ్చే సొమ్ము మోడీ జేబులోదా? జనం సొమ్ము కాదా? బాగున్న మీటర్లు వృథాగా ఎందుకు పడేయాలి? కొత్త మీటర్లు ఎందుకు పెట్టాలి? చిన్న సంస్థలు, పరిశ్రమలకు స్మార్ట్‌మీటర్ బిగించిన తర్వాత రెండు రెట్లు నుండి పది రెట్లు వరకు బిల్లు పెరిగిందని గగ్గోలు పెడుతున్నా, ప్రభుత్వానికి వినపడటం లేదా? 24 గంటలలో దీనిపై విచారణ చేసి, నివేదిక తెప్పిస్తామని విద్యుత్ శాఖ మంత్రి చేసిన ప్రకటన ఏమైంది ?

వైర్‌లెస్ టెక్నాలజీ ద్వారా గుజరాత్, ఢిల్లీలో ఉన్న అదానీ కార్యాలయంతో మన మీటరుతో అనుసంధానం జరుగుతుంది. జవాబుదారీతనం ఉండదు. ఇప్పటి వరకు వైసిపి, కూటమి ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాల వివరాలు బయట పెట్టలేదు. ఎందుకు ఈ గోప్యత? అనుమతి లేకుండా మీటర్లు బిగించే హక్కు ప్రభుత్వానికి ఉందా? ఇది ప్రజాస్వామ్యమా? చట్టబద్ధమా? అదాని, కార్పొరేట్ కంపెనీల మోసాలు జగద్వితమే. అటువంటి కంపెనీ చేతిలో మన భవిష్యత్తు భద్రమా? ప్రజల అంగీకారం లేకుండా మీటర్లు పెట్టబోమని మంత్రి ప్రకటించారు. అయినా ఈ ప్రజల కళ్ళు గప్పి మోసపూరిత పద్ధతులలో నయానా భయానా మీటర్లు పెడుతున్నారు. కొన్నిచోట్ల గోడలు దూకి మరీ, మరికొన్ని చోట్ల పాత మీటర్ చెడిపోయిందనీ అబద్ధాలు చెప్పి మీటర్లు పెడుతున్నారు. ముందు కార్యాలయాల వరకే అని నమ్మించారు. ఆ తర్వాత షాపులు, పరిశ్రమలకే పరిమితం అన్నారు. ఇప్పుడు కొన్ని ఇళ్ళకే అంటున్నారు. పేదల కాలనీలలో కూడా పలు చోట్ల మీటర్లు బిగించారు. పార్టీలకతీతంగా జనమంతా మేలుకోవాలి. మీటర్లు లేకుండానే సర్దుబాటు చార్జీల భారం విపరీతంగా ఉంది. మీటర్లు కూడా తోడైతే ఇక బాదుడుకు అంతే ఉండదు. అందుకే మీటర్లను అడ్డుకోవాలి. అనుమతి లేకుండా పెడితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. చెత్త పన్ను చెల్లించకుండా జనం ఉద్యమించడంతో రద్దయింది. రైతుల పంపుసెట్లకు మీటర్లపై పోరాడటంతో తాత్కాలికంగా ఆగింది. పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ ఇంకా అనేక రాష్ట్రాల్లో మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు వెనక్కి తగ్గక తప్పలేదు. మన రాష్ట్రంలోనూ ఉద్యమం తీవ్రతరం చేద్దాం. సర్దుబాటు చార్జీల విధానం రద్దు కావాలి. అదనపు వసూళ్లు ఆపివేయాలి. మిగులును వినియోగదారులకు బదలాయించాలి. చార్జీలు తగ్గించాలి. స్మార్ట్ మీటర్లు ఒప్పందాలు రద్దు చేయాలి. మీటర్ల బిగింపు ఆపాలి. పెట్టిన మీటర్లు తొలగించాలి. ఆగస్టు 5వ తేదీన ప్రజా వేదిక ఆధ్వర్యంలో భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనలో భాగస్వాములం అవుదాం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

సమస్య

ఈ మరణాలను ఆపేదెలా ?

"నేర్చుకోవడంలో ఆనందం పోయి, ర్యాంకులు, ఫలితాలు, నిరంతర పోటీ ఆందోళనగా మారిపోయింది" అని న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మద్దతు ఇవ్వడానికి, ఆత్మహత్యలను నివారించడానికి దేశంలో సమగ్రమైన, అమలు చేయదగిన చట్టపరమైన నియంత్రణలు లేవని కోర్టు లోతుగా విశ్లేషించింది. విద్యార్థుల ఆత్మహత్యలను ఆపడానికి 15 ముఖ్యమైన సూత్రాలతో కూడిన ఒక ప్రణాళికను ప్రకటించింది. విద్య అంటే కేవలం చదువు మాత్రమే కాదు, పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ఈ తీర్పు తేటతెల్లం చేసింది.



కళాశాలల్లో, కోచింగ్ సెంటర్లలో మార్కుల కోసం, ర్యాంకుల కోసం జరిగే తీవ్రమైన పోటీలో ఎంతో మంది యువత తమ చిరునవ్వులు పోగొట్టుకుంటున్నారు. వారి మనసులలో పేరుకుపోయిన ఒత్తిడి, బయటకు చెప్పుకోలేని బాధ, చివరికి ప్రాణాలు తీసుకోవడానికి దారితీస్తోంది. ఈ భయంకరమైన పరిస్థితిని గుర్తించిన సుప్రీంకోర్టు 25 జులై 2025న కీలకమైన తీర్పు ఇచ్చింది. "నేర్చుకోవడంలో ఆనందం పోయి, ర్యాంకులు, ఫలితాలు, నిరంతర పోటీ ఆందోళనగా మారిపోయింది" అని న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మద్దతు ఇవ్వడానికి, ఆత్మహత్యలను నివారించడానికి దేశంలో సమగ్రమైన, అమలు చేయదగిన చట్టపరమైన నియంత్రణలు లేవని కోర్టు లోతుగా విశ్లేషించింది. విద్యార్థుల ఆత్మహత్యలను ఆపడానికి 15 ముఖ్యమైన సూత్రాలతో కూడిన ఒక ప్రణాళికను ప్రకటించింది. విద్య అంటే కేవలం చదువు మాత్రమే కాదు, పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ఈ తీర్పు తేటతెల్లం చేసింది.

గణాంకాలు చెప్పే కఠిన వాస్తవం

జాతీయ నేర గణాంక సంస్థ 2022 నాటి "యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇన్ ఇండియా" నివేదిక మన దేశంలో ఆత్మహత్య చేసుకున్న వారిలో 7.6 శాతం మంది విద్యార్థులే అని పేర్కొంది. 2022లో సుమారు 13,044 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. వీరిలో 2,248 మంది కేవలం పరీక్షలలో ఫెయిల్ అవడం వల్లే చనిపోయారని స్పష్టం చేసింది. 2001లో 5,425 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా 2022 నాటికి ఈ సంఖ్య 13,044కి చేరింది. నియంత్రణ లేని కోచింగ్ పరిశ్రమ యువత జీవితాలను ఎలా ప్రమాదంలో పడేస్తుందో విశ్లేషిస్తుంది.

సుప్రీంకోర్టు జోక్యం ఎందుకు?

ఈ తీర్పునకు తక్షణ కారణం, తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై సుక్దేవ్ సాహా చేసిన పోరాటం. విశాఖపట్నంలోని ఒక కోచింగ్ సెంటర్‌లో నీట్ కోసం చదువుతున్న అతని పదిహేడేళ్ల కుమార్తె 2023 జులై 14న హాస్టల్ పైకప్పు నుండి పడిపోయి అనుమానాస్పదంగా మరణించింది. ఈ సంఘటనపై పోలీసులు సరిగా విచారించడం లేదని, కోచింగ్ సెంటర్ యాజమాన్యం నిజాలను దాచిపెడుతోందని ఆరోపిస్తూ సాహా హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో చివరికి సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ కేసును విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం...ఆ ఒక్క సంఘటనను కేవలం వ్యక్తిగత విషాదంగా చూడకుండా అది దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక సంక్షోభానికి, వ్యవస్థాగత లోపానికి నిదర్శనంగా విశ్లేషించింది. పోలీసు దర్యాప్తులో "లోతైన లోపాలు" ఉన్నాయని, "కీలక ఆధారాలను దాచిపెట్టే అవకాశం" ఉందని గమనించి సిబిఐ విచారణకు ఆదేశించడం ద్వారా వ్యవస్థల మధ్య జవాబుదారీతనం లేకపోవడంపైనా కోర్టు పరోక్షంగా దృష్టి సారించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, జీవించే హక్కు పరిధిలో మానసిక ఆరోగ్యం ఒక అంతర్భాగమని కోర్టు స్పష్టం చేసింది. ఈ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అందుకే ఈ ఆదేశాలను జారీ చేయాల్సి వచ్చిందని పేర్కొంది.

సంస్థలే జవాబుదారీ వహించాలి

విద్యార్థుల సమస్యలను విద్యా సంస్థలు పట్టించుకోకపోయినా, ఆ నిర్లక్ష్యం ఆత్మహత్యకు దారితీస్తే, ఆ సంస్థలే బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు గట్టిగా హెచ్చరించింది. ఈ తీర్పు విద్యార్థుల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడటానికి ఒక బహుళ-రంగ విధాన ఆవశ్యకతను ప్రతిబింబిస్తుంది. అన్ని విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు ఒకే రకమైన మానసిక ఆరోగ్య విధానాన్ని పాటించాలి.

దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్యానికి ఒక ప్రామాణిక విధానాన్ని ఏర్పాటు చేయాలి. వంద మందికి పైగా విద్యార్థులున్న ప్రతి విద్యా సంస్థలో కనీసం ఒక అర్హత కలిగిన కౌన్సెలర్, సైకాలజిస్టును తప్పనిసరిగా నియమించాలి. చిన్న సంస్థలు తగినంత మంది కౌన్సెలర్‌లు ఉండేలా చూసుకోవాలి. పరీక్షా సమయాల్లో విద్యార్థి బృందాలకు మెంటార్‌లను కేటాయించాలి. మానసిక ఆరోగ్య సేవలు, స్థానిక ఆసుపత్రులు, ఆత్మహత్య నివారణ హెల్ప్‌లైన్‌లకు తక్షణ రెఫరల్ కోసం అన్ని విద్యా సంస్థలు ప్రోటోకాల్‌లను ఏర్పాటు చేయాలి. ఇది అత్యవసర పరిస్థితుల్లో త్వరగా చర్యలు తీసుకోవడానికి సహాయపడుతుంది. టెలీ-మానస్, ఆత్మహత్యల నివారణ హెల్ప్‌లైన్ నంబర్‌లను హాస్టళ్లు, తరగతి గదులు, సాధారణ ప్రాంతాలు, వెబ్‌సైట్‌లలో పెద్ద అక్షరాలతో ప్రముఖంగా ప్రదర్శించాలి. బోధన, బోధనేతర సిబ్బంది అందరూ కనీసం సంవత్సరానికి రెండుసార్లు ధృవీకరించబడిన మానసిక ఆరోగ్య నిపుణులచే శిక్షణ పొందాలి. ఈ శిక్షణలో మానసిక ప్రథమ చికిత్స, ఆత్మహత్య సంకేతాలను గుర్తించడం, స్వీయ-హానిని ఎదుర్కోవడం, రెఫరల్ విధానాలు ఉండాలి. ఉపాధ్యాయులు, వార్డెన్లు మొదలైనవారు విద్యార్థులలో మానసిక క్షోభను గుర్తించి, సరిగ్గా స్పందించడానికి ఇది కీలకం. తల్లిదండ్రులు, సంరక్షకులను నిరంతరం అవగాహనా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. విద్యార్థులపై అనవసరమైన విద్యా ఒత్తిడిని తగ్గించి ఇంట్లో సహాయక వాతావరణాన్ని ప్రోత్సహించడం ఈ సెషన్ల లక్ష్యం. లైంగిక వేధింపులు, ర్యాగింగ్, కులం, వర్గం, లింగం, లైంగిక ధోరణి, వైకల్యం, మతం లేదా జాతి ఆధారిత బెదిరింపులకు సంబంధించిన సంఘటనలను నివేదించడానికి, పరిష్కరించడానికి, నివారించడానికి పటిష్టమైన, గోప్యమైన అందుబాటులో ఉండే సమగ్ర ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదుదారులు లేదా విజిల్ బ్లోయర్‌లపై ప్రతీకార చర్యలకు "జీరో-టాలరెన్స్ విధానం" ఉండాలి. ఇటువంటి కేసులలో మానసిక ఆరోగ్య నిపుణులకు తక్షణ రెఫరల్ తప్పనిసరి. ఫిర్యాదులపై సకాలంలో లేదా తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైతే ప్రత్యేకించి అటువంటి నిర్లక్ష్యం విద్యార్థి ఆత్మహత్యకు లేదా స్వీయ-హానికి దారితీస్తే, అది "సంస్థాగత దోషం'గా పరిగణించబడుతుంది. ఇది నిర్వాహకులను నియంత్రణ మ చట్టపరమైన పరిణామాలకు బాధ్యులను చేస్తుంది. అన్ని హాస్టళ్ల ట్యాంపర్-ప్రూఫ్ సీలింగ్ ఫ్యాన్‌లు, భద్రతా పరికరాలను అమర్చాలి. అలాగే ఆత్మహత్యా యత్నాలను నిరోధించడానికి పైకప్పులు, బాల్కనీలు ఇతర ప్రమాదకర ప్రాంతాలకు ప్రవేశాన్ని నియంత్రించాలి. అకడమిక్ పని తీరు ఆధారంగా విద్యార్థుల బ్యాచ్‌లను వేరుచేయడం, బహిరంగంగా అవమానించడం, విద్యార్థి సామర్థ్యానికి అనుగుణంగా లేని విద్యా లక్ష్యాలను విధించడం వంటివి కోచింగ్ సెంటర్లు, విద్యా సంస్థలు చేయకూడదు. ఇది ఒత్తిడిని తగ్గించి, విద్యార్థులపై అనవసరమైన భారాన్ని తొలగించడానికి సహాయ పడుతుంది. విద్యా సంస్థలలో మానసిక ఆరోగ్యం శ్రేయస్సు పద్ధతులపై వార్షిక బాహ్య నిపుణులతో నిర్వహించాలి. ఆత్మహత్యా యత్నాన్ని జిల్లా అధికారులకు అధికారికంగా నివేదించాలి. సంస్థలు అంతర్గత విచారణలు నిర్వహించి, నివారణ చర్యలను నమోదు చేయాలి, ఇది పారదర్శకతను పెంచుతుంది. బాధ్యతను నిర్ధారిస్తుంది. విద్యార్థుల ఆత్మహత్యలు, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన డేటాను సేకరించడానికి, విశ్లేషించడానికి ఒక జాతీయ డేటా బేస్‌ను ఏర్పాటు చేయాలని పరోక్షంగా ఈ తీర్పు సూచిస్తుంది. చివరగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు రెండు నెలల్లోగా ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నమోదు, నియంత్రణ, పర్యవేక్షణకు నిబంధనలను నోటిఫై చేయాలి, ఈ నిబంధనలు విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్య రక్షణలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది కోచింగ్ సెంటర్ల అదుపులేని వృద్ధిని, వాటిలో నెలకొన్న ఒత్తిడిని పరిష్కరించడానికి ఒక కీలకమైన చట్టపరమైన చర్య.

ఈ మార్గదర్శకాల విజయం వాటిని ఎంత పకడ్బందీగా అమలు చేస్తారనే దానిపై ఆధారపడి ఉంటుంది. వార్షిక తనిఖీలు జవాబుదారీతనాన్ని పెంచుతాయి. కేవలం మార్కుల వెనుక పరిగెత్తే ధోరణిని వదిలిపెట్టి, పిల్లల సమగ్ర అభివృద్ధికి, మానసిక స్థితిస్థాపకతను ప్రోత్సహించే విద్య వైపు మన సమాజం మళ్లినప్పుడే సాధ్యమవుతుంది.

- జనక మోహన రావు దుంగ
సెల్ : 8247045230

జనవాక్యం

ఉపాధ్యాయులపై పి-4 భారం వద్దు

ప్రజల ఆర్థిక అసమానతలను తొలగించడం కోసరమనే సాకుతో రాష్ట్ర ప్రభుత్వం పి-4 అనే కొత్త అంశాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా మార్గదర్శులుగా పి 4 లో రిజిస్టర్ అవ్వొచ్చని ప్రభుత్వం చెప్పింది. కానీ అధికారులు ఉపాధ్యాయులను మార్గ దర్శకులుగా రిజిస్టర్ కావాలని మెసేజులు, సర్క్యులర్లను పంపుతూ ఒత్తిడి చేస్తున్నారు. ఉపాధ్యాయులు తమ ఇష్ట పూర్వకంగా రిజిస్టర్ అయితే ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ ఇప్పటికే అనేక బోధనేతర పనులు, ఉపాధ్యాయుల కొరత ఉన్న సమయంలో పి-4 కార్యక్రమంలో బలవతంగా ఉపాధ్యాయులను ప్రభుత్వం రిజిస్టర్ చేయించడం సరికాదు. ప్రభుత్వం ఉపాధ్యాయలతో చేయిస్తున్న రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

- వాసిలి సురేష్,
నెల్లూరు జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

'స్మార్ట్ మీటర్ల'పై రెండునాల్కల ధోరణి

• కె. రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
స్మార్ట్ మీటర్ల వ్యవహారంలో ప్రభుత్వం రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన టిడిపి నాయకులు, మీటర్లను ఎవరైనా ఏర్పాటు చేస్తే పగలగొట్టాలని పిలుపునిచ్చారన్నారు. వినియోగదారులు ఎవరూ స్మార్ట్ మీటర్లు కావాలని అడగనప్పుడు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల భారం మోపేది లేదని ఎన్నికల ముందు చెప్పి, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15వేల కోట్ల భారం ట్రూప్ చార్జీల పేరుతో ప్రజలపై వేసిందని తెలిపారు. దీనికితోడు అదానితో ఒప్పందం అమలు చేయడం వల్ల వచ్చే 20 ఏళ్లలో ప్రజలపై రూ. 1.25 లక్షల కోట్ల భారం పడుతుందని తెలిపారు.

ప్రైవేట్ కోరల్లో ప్రజారోగ్యం

• ప్రజారోగ్య వేదిక సదస్సులో రాష్ట్ర కన్వీనర్ కామేశ్వరరావు


సదస్సులో మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ టి.కామేశ్వరరావు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్
రాష్ట్రంలో కొత్తగా వచ్చే వైద్య కళాశాలలన్నీ పిపిపి (పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్) విధానంలో నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావడంతో ప్రజారోగ్యం కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ టి.కామేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ఈశ్వర రెసిడెన్సీలో మంగళవారం ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామేశ్వరరావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ అభివృద్ధి కార్యక్రమమైనా ప్రభుత్వం పిపిపి పద్ధతిలోనే చేపట్టడం ప్రమాదకరమన్నారు. ఎంతో అభివృద్ధి చెందిన స్విట్జర్లాండ్ దేశంలో ఆస్పత్రులన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే నడుస్తాయని గుర్తు చేశారు. అభివృద్ధి విషయంలో స్విట్జర్లాండ్‌ను, సింగపూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్కడ వైద్య విధానాలను మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు.

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయడంతోపాటు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాల్సి ఉందని, వీటిని కూడా పిపిపి పద్ధతిలోనే చేపడతామని ప్రభుత్వం చెప్పడం వైద్య రంగాన్ని పూర్తిగా ప్రయివేటుపరం చేయడమే అవుతుందన్నారు.

సమాజంలో అనుభవజ్ఞులైన డాక్టర్లు, విద్యావంతులు, విశ్రాంతి ఉద్యోగులను సమీకరించి ప్రభుత్వం ఇలా ప్రతిదానికీ పిపిపి పద్ధతిని అవలంభించడం తప్పా ఒప్పా అనే అంశంపై ప్రజాభిప్రాయం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈసదస్సులో సీనియర్ వైద్యులు డాక్టర్ సురేష్ చంద్ర రెడ్డి, డాక్టర్ శాస్త్రి, డాక్టర్ రావి శ్రీనివాసరావు, డాక్టర్ ప్రసాదరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య వేదిక కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీనివాసరావు, శ్రీధర్

సదస్సు అనంతరం ప్రజారోగ్య వేదిక కృష్ణాజిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా రావి శ్రీనివాసరావు, వి.శ్రీధర్, కమిటీ సభ్యులుగా ప్రముఖ వైద్యులు సురేష్ చంద్రారెడ్డి, కె.శాస్త్రి, ప్రేమ్, అల్లాడి శ్రీనివాస్, హరిచరన్, కె.రాజారావు, వై.వి.ఎస్.కనకరాజు, ఎస్.కాశిమ్మ, కె.లక్ష్మీలను ఎన్నుకున్నారు.

అధికారులకు పి4 పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్ : సమాజంలో అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చి బంగారు కుటుంబాలుగా మార్చాలన్న ప్రభుత్వ ఆలోచనలో భాగంగా ప్రకటించిన పి4 ప్రాజెక్టు అమలులో అధికారులు పాట్లు పడుతున్నారు. పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులు కానరాకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. విజయనగరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో 631మంది మార్గదర్శులను గుర్తించినట్టు అధికారులు చెబుతున్నారు. పి4 కోసం వారిని ఒప్పించేందుకు అధికారులకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. 'మీరేం చేస్తారో తెలీదు, కచ్చితంగా మార్గదర్శులు (దాతలు) వెతికి, వారిని ఒప్పించాల్సిందే'నని ఒత్తిడి చేయడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరో వైపు అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులను కూడా దత్తత తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో వారిలో వ్యతిరేకత ప్రారంభమైంది. సూపర్ సిక్స్‌లో భాగమైన తల్లికి వందనం, ఉచిత గ్యాస్ వంటి పథకాలు ఇప్పటికే అర్హులకు సైతం అందలేదనే విమర్శలు ఉన్నాయి. మహిళలకు ఉచిత బస్సు ఇప్పటికీ పట్టాలెక్కలేదు. మిగిలిన మూడు పథకాలు అమలు చేయలేని ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ చర్చను పక్కదారి పట్టించేందుకు పి 4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) అనే విధానాన్ని తెరపైకి తీసుకొచ్చిందనే చర్చ ప్రజలు, ఉద్యోగుల్లో జరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సాధికారత కల్పించి, వారి ఆర్థికస్థితి మెరుగు పరుస్తామని పి4ను తీసుకొచ్చింది. మార్గదర్శుల పేరుతో దాతలను వెతికి వారితో ఖర్చు పెట్టించి ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ప్రభుత్వం చెబుతుండటం ప్రతిఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అధికారులపై ప్రభుత్వం ఒత్తిడితో పి4 కింద మార్గదర్శులుగా ప్రభుత్వం కొందరిని ఒప్పించింది.

రాజధానిలో యాన్యుటీ పేచీలు

తనిఖీ పేరుతో కౌలు నిలిపివేత

• 11 ఏళ్ల తరువాత

11 వేలమంది వెరిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాజధానిలో యాన్యుటీ(భూములిచ్చిన రైతులకు ఇచ్చే వార్షిక కౌలు) చెల్లింపులో 11 ఏళ్ల తరువాత సిఆర్‌డిఎ పేచీలు పెట్టింది. మరణధృవీకరణలు చెల్లవని, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇస్తేనే చెల్లింపులు చేస్తామని ఇప్పుడు మెలిక పెట్టారు. దీంతో సుమారు 11,868 మందికి అండర్ ప్రాసెస్ అని చెబుతూ యాన్యుటీ నిలిపేశారు. అలాగే భూములు కుటుంబ సభ్యుల మధ్య వాటాలు పంచుకుని మ్యుటేషన్ అయిన తరువాత వాస్తవ ఓనర్‌కే యాన్యుటీ వేస్తామని చెప్పి వారసులకూ నిలిపేశారు. దీనిపై రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే కౌలు ఆలస్యంగా వేస్తున్నారని, 11 ఏళ్ల తరువాత ఇప్పుడు కొత్తగా ఈ సమస్య ఎందుకొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం చనిపోయిన వ్యక్తులకు సంబంధించి మరణధృవీకరణపత్రం గ్రామాల్లోని కాంపిటెంట్ అథారిటీ అధికారులకు సమర్పిస్తే కౌలు వేశారని, నాలుగేళ్ల తరువాత ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అడగడం ఏమిటని ప్రశ్నించారు. గత నాలుగేళ్లుగా లేని సమస్య ఇప్పుడు ఎందుకొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఇవ్వాల్సిన కౌలు బకాయిల్లో ఈ ఏడాది బకాయిలు రెండు విడతలుగా రైతుల ఖాతాల్లో జమచేస్తామని సిఆర్‌డిఎ అధికారులు ప్రకటించారు.

తొలిదశలో 21,560 మందికి బకాయిలు వేయగా బ్యాంకు వివరాలు సరిగా లేవని 725 మందికి పెండింగ్ పెట్టారు. మిగిలిన 11,868 మందికి రెండోదశలో యాన్యుటీ చెల్లిస్తామని పేర్కొన్నారు. రెండోదశ కోసం ఎదురు చూస్తున్న సమయంలో వేర్వేరు కారణాలతో చెల్లింపులు నిలిపినట్లు పేర్కొన్నారు. వీరిలో ఎక్కువమంది భూములిచ్చిన వాస్తవ యజమాని చనిపోయిన అతని తాలూకా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వలేదనే కారణాన్ని సిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు. ముందే చెప్పి ఉంటే ఇచ్చేవాళ్లమని, నాలుగేళ్ల తరువాత ఈ పేచీ ఎందుకు పెట్టారో చెప్పాలని రైతులు కోరుతున్నారు.

కుటుంబ సభ్యుల మధ్య భాగస్వామ్యవాటాలు పంచుకున్న వారికి సంబంధించిన ఖాతాలకూ డబ్బులు జమ చేయడం లేదని అధికారులు తెలిపారు. వీరితోపాటు భూములు కొనుగోలు చేసిన వారు వాస్తవ యజమాని నుండి సంబంధిత ధృవీకరణ పత్రం ఇవ్వలేదని, అందువల్లే నిలిపేశామని తెలిపారు. వాస్తవంగా ఇలా కొనుగోలు చేసిన వారికి గత ఆరేళ్లుగా యాన్యుటీ వేస్తూనే ఉన్నారు. ఈ ఏడాదే పేచీ పెట్టారు. విచారణ పూర్తయిన అనంతరం లబ్దిదారులను పరిశీలించి అందరికీ కౌలు చెల్లిస్తామని సిఆర్‌డిఎ కార్యాలయం అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసిపి కుట్ర

• సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసిపి కుట్రలు చేస్తోందని సీడాప్ చైర్మన్ జి దీపక్ రెడ్డి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి ప్రయత్నిస్తుంటే వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి భయం పట్టుకుందని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి కోసం చేస్తున్న ప్రయత్నాల్ని జగన్ అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఇతర దేశాలవారికి కంపెనీల పేరుతో భూములిచ్చేస్తున్నారంటూ జగన్, అతని బృందం దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి అనేక కంపెనీలను తరిమేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదన్నారు.

ఓవల్ క్యూరేటర్‌పై గంభీర్ సీరియస్



ఓవల్: చివరి టెస్ట్ ఓవల్ వేదికగా గురువారం నుంచి ప్రారంభం కానుంది. చివరి, ఐదో టెస్ట్‌ను గెలుపుతో ముగించి సిరీస్‌ను సమం చేస్తామని టీమిండియా కోచ్ గౌతం గంభీర్ పేర్కొన్నాడు. ఈ క్రమంలో భారత జట్టును నెట్స్‌లో ఎక్కువ సమయం గడిపేలా జాగ్రత్త తీసుకున్నాడు. ఈ క్రమంలో భారత క్రికెటర్లు నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా ఓవల్ పిచ్ క్యూరేటర్ అభ్యంతరం తెలిపాడు. దాంతో, హెడ్‌కోచ్ గౌతం గంభీర్ అతడితో వాగ్వాదానికి దిగాడు. మీరు ఎక్కువసేపు ఇక్కడ సాధన చేయడానికి వీల్లేదని, మీకు అనుమతి ఇచ్చింది కొంత వరకేగా అని పేర్కొనగా.. 'నువ్వు కేవలం మైదానం సిబ్బంది మాత్రమే. మేము ఇక్కడే ప్రాక్టీస్ చేసుకుంటాం. మేము ఏం చేయాలో నువ్వు చెప్పనక్కర్లేదు. మాకు అన్నీ తెలుసు' అని అతడితో తెగేసి చెప్పాడు. గంభీర్ ఒక్కసారిగా అలా అనేసరికి ఫోర్టిస్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. బ్యాటింగ్ కోచ్ అతడికి సర్ది చెప్పాడు.

గెలిచి తీరాల్సిందే.. గంభీర్

భారత్, ఇంగ్లండ్‌ల మధ్య జూలై 31 గురువారం చివరిదైన ఐదో టెస్టు జరుగనుంది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 2-1తో ముందంజలో ఉండగా.. మాంచెస్టర్‌లో డ్రాతో ముగించిన భారతజట్టు రెట్టించిన ఉత్సాహంతో ఈ టెస్ట్‌కు సిద్ధమౌతోంది. ఈ టెస్ట్‌ను డ్రా చేసుకున్నా స్టోక్స్ సేన విజేతగా నిలుస్తుంది. కాబట్టి ఏవిధంగా చూసినా ఓవల్ టెస్టు గిల్ బృందానికి చావోరేవో లాంటిదే. కుడి పాదం వేలి గాయంతో వైస్ కెప్టెన్ పంత్ దూరమవ్వడం కొంత ఇబ్బందికరమే. అతడి స్థానంలో ఎవరిని తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది. అయితే.. నాలుగో టెస్టుకు విశ్రాంతితీసుకున్న ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్‌లు కోలుకోవడంతో భారత బౌలింగ్ యూనిట్ మరింత బలంగా మారనుంది.

కోల్‌కతా నైట్‌రైడర్స్ హెడ్‌కోచ్

చంద్రకాంత్ పండిట్ రాజీనామా

కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్‌రైడర్స్ హెడ్‌కోచ్ చంద్రకాంత్ పండిట్ ఆ ఫ్రాంచైజీకి గుడ్‌బై చెప్పాడు. మూడేళ్లుగా కోచ్‌గా కొనసాగుతున్న పండిట్ మంగళవారం ట్విటర్ వేదికగా తన నిర్ణయాన్ని వెల్లడించాడు. ఆయన నిర్ణయాన్ని గౌరవిస్తూ.. ఫ్రాంచైజీ కూడా ఆమోదం తెలిపింది. 'థాంక్యూ చందు సర్' అంటూ కోల్‌కతా యాజమాన్యం ఎక్స్ వేదికగా వీడ్కోలు పోస్ట్ పెట్టింది. 'కోల్‌కతాకు కోచ్‌గా విశేష సేవలందించిన చంద్రకాంత్ కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని అనుకుంటున్నాడు. ఈ మూడేళ్ల సమయంలో మీ అమూల్యమైన సేవలకు ధన్యవాదాలు. కోల్‌కతాను మూడోసారి ఐపిఎల్ విజేతగా నిలిపిన ఘనత మీది. అంతేకాదు మీ క్రమశిక్షణ తో, నాయకత్వ నైపుణ్యంతో జట్టును పటిష్టంగా మార్చారు. మీ భవిష్యత్తుకు ఆల్ ది బెస్ట్' అని కోల్‌కతా ఫ్రాంచైజీ ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే.. హఠాత్తుగా చంద్రకాంత్ వైదొలగడానికి గల కారణాలు తెలియరాలేదు. భారత జట్టు మాజీ వికెట్ కీపర్ అయిన చంద్రకాంత్ 2022లో కోల్‌కతా కోచ్‌గా ఎంపికయ్యాడు. న్యూజిలాండ్ వెటరన్ బ్రెండన్ మెకల్లమ్ వారసుడిగా బాధ్యతలు తీసుకున్న ఆయన.. పదిహేడో సీజన్‌లో జట్టును ఛాంపియన్‌గా నిలిపాడు. మెంటార్ గౌతం గంభీర్ సహకారంతో కేకేఆర్‌కు మూడోసారి ఐపిఎల్ ట్రోఫీ అందించాడు చంద్రకాంత్. అతడి కోచింగ్‌లో కోల్‌కతా 42 మ్యాచుల్లో 22 విజయాలు సాధించింది.

గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించండి..
పట్టాలు ఇవ్వండి

● రౌండ్ టేబుల్‌లో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల సమస్యలు పరిష్కరించి, పట్టాలు మంజూరు చేయాలని ఏపి గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గిరిజన సమస్యలపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఏపి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భూములు, ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన ముంపు ప్రాంత గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన పోలవరం పునరావాస కాలనీల్లో ఎటువంటి సౌకర్యాలు లేవన్నారు. అంకంపాలెం గ్రామంలో వెయ్యి ఎకరాల భూమి అక్రమంగా లీజుకి ఇచ్చి అనుభవిస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలు 5వ షెడ్యూల్‌లో ఉండటంతో గిరిజనులకు కొంత రక్షణ ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు పోరాట ఫలితంగా స్వయం పాలన హక్కులు వచ్చాయన్నారు. అనంతగిరి మండలంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజనులకు మామిడిపండ్లు, చెప్పులు వంటి బహుమతులు ఇచ్చి, అదానికి భూములు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. చట్టాలపై అవగాహన లేకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు గిరిజనేతరులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. షెడ్యూల్ ఏరియాలో గిరిజనులను, గిరిజనేతరులు దోచుకుంటున్నారని అనేక చట్టాలున్నా వాటిని అధికారులు అమలు చేయడం లేదన్నారు. అందుకే పోరాటం చేయాల్సిన అవశ్యకత నెలకొందని తెలిపారు. ఏపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు మాట్లాడుతూ.. గిరిజనుల పంట భూముల్లో ఇ-క్రాప్ నమోదు చేసి పంట నష్టపరిహారం అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతి జెఏసి నాయకులు బాలకోటయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించడంలో విఫలం అవుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ..నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న 500 గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ.. గిరిజన సమస్యల పరిష్కారానికి వారు చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటించారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఎఐకెఎమ్ నాయకులు వెంకటరెడ్డి, రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు నాగేంద్రనాథ్ ప్రసంగించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు సాగు చేస్తున్న కొండపోడు భూములకు 10 ఎకరాల వరకూ హక్కు పత్రాలు ఇవ్వవలసి ఉన్నా కేవలం ఎకరం, అర ఎకరానికే ఇచ్చి గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎల్‌టిఆర్ భూములు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో సేకరించకూడదని, 1/70 చట్టం ప్రకారం గిరిజనులకే పట్టాలు మంజూరు చేయాలని, ఎల్‌టిఆర్ భూముల విషయంలో పోలీసుల జోక్యం లేకుండా రెవెన్యూ, ఐటిడిఎ అధికారులే సమస్యలు పరిష్కరించాలని, గిరిజనేతరులు భూ స్వాముల ఆక్రమణలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని ఇప్పటి వరకూ అనుభవించిన ఫలసాయాన్ని రాబట్టాలని, కోర్టు కేసుల్లో ఉన్న గిరిజనులకు న్యాయ సహాయం అందించాలని కోరుతూ తీర్మానాలు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎ.రవి ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ సహా ఇద్దరు అరెస్ట్

● రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా సిబిఐ పట్టివేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలో ఆదాయపు పన్ను (ఇన్‌కమ్ ట్యాక్స్) ఇన్‌స్పెక్టర్ బి.రామచంద్ర రావు, మధ్యవర్తిగా వ్యవహరించిన రాజు అలియాస్ రాజారత్నమ్‌లను కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) మంగళవారం అరెస్ట్ చేసింది. ఆదాయపు పన్ను తనిఖీ నిర్వహించకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుని నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా సిబిఐ అధికారులు పట్టుకున్నారు. ఆదాయపు పన్ను కమిషనరు కార్యాలయంలో పనిచేస్తున్న ఒక అధికారి, ఏలూరులోని రామచంద్రరావుపేటలో మొబైల్ సర్వీస్ షాపును నిర్వహిస్తున్న వ్యక్తికి (ఫిర్యాదుదారుడు) ఆదాయపుపన్ను శాఖ నుంచి తనకు వ్యతిరేకంగా వచ్చిన పిటీషన్లపై నోటీసులు, ఆదాయపు పన్ను దాడులు నిర్వహించకుండా ఉండేందుకు మధ్యవర్తి ద్వారా సంప్రదించారు. ఇందుకోసం రూ.5 లక్షలు డిమాండ్ చేశారని, చివరికి రూ.1.20 లక్షలు (ఆఫీసరుకు లక్ష, మధ్యవర్తికి రూ.20వేలు) చెల్లించాలని ఒత్తిడి చేశారని సిబిఐ అధికారులు తెలిపారు. నిందితులను సిబిఐ కేసుల ప్రత్యేక కోర్టు జడ్జి ఎదుట హాజరుపరుస్తామని చెప్పారు.

మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్లు ఏర్పాటు చేయండి

● విముక్తి, హెల్ప్ సంస్థల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అధికారికంగా మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్లను తక్షణమే ఏర్పాటు చేయాలని, అన్ని యూనిట్లలో పూర్తి స్థాయిలో కేసులు విచారణ జరిగేలా ప్రభుత్వం చూడాలని విముక్తి, హెల్ప్ సంస్థలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా మంగళవారం విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో విముక్తి, హెల్ప్, యాట్‌సెక్, ఆంధ్రప్రదేశ్ చాప్టర్, ఆర్ హెడ్స్, గైడ్ స్వచ్ఛందసంస్థలు మీడియా సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా అక్రమ రవాణా బాధిత మహిళల విముక్తి సంఘ రాష్ట్ర సమాఖ్య అధ్యక్షురాలు అపూర్వ మాట్లాడుతూ బాధితుల రక్షణ , వారి సంక్షేమమే కేంద్రంగా అమలు చేసే విధానంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలన్నారు.. విముక్తి రాష్ట్ర నాయకులు లక్ష్మీ, శాంతి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను నడిపించే అన్ని రకాల అక్రమ వ్యాపారాలను ధ్వంసం చేయాలని, అక్రమ లాభాలను అడ్డగించి న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు నేరస్తులకు శిక్షలు పడి తీరాలన్నారు. ఈ సమావేశంలో హెల్ప్ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్, ప్రాజెక్టు మేనేజరు వి.భాస్కర్, ఆర్ హెడ్స్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.రామకృష్ణ, గైడ్ స ంస్థ మేనేజరు సుజాత, మున్నీ, అనూష పాల్గొన్నారు.

సాగర్ 26 గేట్లు ఎత్తివేత

18 ఏళ్ల తర్వాత జులైలో నీటి విడుదల ఇదే ప్రథమం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం వస్తుండడంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా తయారైంది. దీంతో, 26 గేట్ల క్లస్టర్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జునసాగర్ జలాశయం పూర్తిగా నిండడం, నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 586.60 అడుగులకు చేరుకుంది. నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 302 టిఎంసిలుగా నమోదైంది. నల్లగొండ జిల్లాలోని ఈ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను తెలంగాణ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్ధిష్ట షెడ్యూలు కు ముందే సాగర్ ఎడమ కాలువకు సాగు నీటిని విడుదల చేశామని తెలిపారు. ప్రస్తుతం విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా విడుదలవుతున్న నీటితోపాటు అదనంగా మరో మూడు వేల క్యూసెక్కుల నీటిని ఎడమ కాలువ ఆయకట్టుకు విడుదల చేస్తున్నామన్నారు.

శ్రీశైలం ఏడు గేట్ల ద్వారా నీటి విడుదల

జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద ఉధృతి క్రమంగా పెరుగుతుండడంతో శ్రీశైలం జలాశయం ఏడు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 1,90,099 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి జూరాల నుండి 1,46,459 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,22,326 క్యూసెక్కులతో కలిపి జలాశయానికి మొత్తం 2,68,785 క్యూసెక్కుల నీరు చేరింది. జలాశయం నీటిమట్టం 882.90 అడుగులుగా, నీటి నిల్వ సామర్థ్యం 203.8907 టిఎంసిలుగా నమోదైంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు 31 వేలు, హంద్రీ-నీవా సుజల స్రవంతికి 2,818, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 38,924 నీటితో 17.065 మిలియన్ యూనిట్ల విద్యుత్తును, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 30,871 క్యూసెక్కుల నీటితో 15.638 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా, ఏడు గేట్ల ద్వారా దిగువ నాగార్జునసాగర్‌కు 2,55,811 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

తుంగభద్ర డ్యాముకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో, నదికి 1,20,488 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌కు ఉన్న 33 గేట్లలో కొన్ని గేట్లు బలహీనంగా ఉండడంతో 27 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాములో 76 టిఎంసిల నీరు ఉంది. అధిక వర్షాల వల్ల మరో రెండు, మూడు రోజులు వరద ఇలాగే కొనసాగ వచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజీకి పోటెత్తిన వరద

నాగార్జునసాగర్ నుంచి పులిచింతలకు 2,18,473 క్యూసెక్కుల నీరు వస్తోంది. పులిచింతల నుంచి దిగువకు 65,513 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో, ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తింది. 13,071 క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయానికి 70 వేల క్యూసెక్కుల ప్రవాహం వచ్చే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు.

ఈ ఏడాది పుష్కలంగా 'సాగర్' నీరు : మంత్రి నిమ్మల

ఈ ఏడాది నాగార్జున సాగర్ ముందే నిండడం వల్ల ఆయకట్టు రైతులకు నీరు పుష్కలంగా అందుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల నేపథ్యంలో ఆయన స్పందించారు. కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి నాగార్జునసాగర్ ఆయకట్టుకు క్రాఫ్ హాలిడే ప్రకటించారన్నారు. వరద నీటిని వృథాగా సముద్రంలోకి వదలకుండా పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ఎప్పటికప్పుడు ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు.

హంద్రీనీవాపై సమీక్ష

రాయలసీమలోని హంద్రీనీవా ఫేజ్-2లో 3,850 క్యూసెక్కులు తరలించేందుకు ప్రధాన కాలువ వెడల్పు, లైనింగ్ పనులు పూర్తి కావొచ్చాయని మంత్రి తెలిపారు. ఈ కాలువ కృష్ణా జలాలతో నిండుగా ప్రవహిస్తుంటే రాయలసీమ ప్రజలు హారతులు పడుతున్నారన్నారు. పుంగూరు, కుప్పం బ్రాంచీ కెనాల్ పనుల పురోగతి సమీక్షించారు. సకాలంలో స్పందించనందుకు ఇద్దరు ఇఇలకు మెమోలు జారీ చేయాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. వెలిగొండ టన్నెల్స్ లైనింగ్, బెంచింగ్ పనులు ఆలస్యం కాకుండా 2026 జూన్ కల్లా పూర్తయ్యేలా పనులు చేయాలని, ఫీడర్ కెనాల్, లైనింగ్, రిటైనింగ్‌వాల్ పనులకు వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు.

భారత జాతీయ రహదారుల ప్రాధికరణ సంస్థ
(రోడ్డు రవాణా & జాతీయ రహదారులు మంత్రిత్వశాఖ)
ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్, విజయవాడ

ఆఫీసు ప్రెమిసెస్ లీజ్ కొరకు ఆఫర్/ప్రతిపాదన కోరుతూ ప్రకటన

సూచిక : 13025/NHAI/PIU/V/2025-26 **తేదీ: 28.07.2025**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ క్రింద తెలిపిన వసతి కొరకు నేషనల్ హై వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, PIU, విజయవాడ వారిచే ఆఫర్లు కోరబడుచున్నవి.

వ.నెం.	పని పేరు	బిడ్ డాక్యుమెంట్ ఖరీదు (రూ)
1	NHAI, PIU, విజయవాడ వారికి రాబోయే 12 నెలల కాలంనకు అద్దె పద్ధతి పైన కనీసం 2500 కార్పెట్ ఏరియా కలిగిన వసతి సువిశాలమైన వాహనాల పార్కింగ్ స్థలంతో కావలెను.	2000.00

బిడ్ డాక్యుమెంట్లు వెబ్‌సైట్ **www.nhai.org** నందు **06.08.2025 (సా.గం.5.00 వరకు)** లభిస్తాయి. మార్పులు/చేర్పులు వంటి ఏవైన ఉంటే వెబ్‌సైట్ **https://nhai.org** నందు ఉంచబడతాయి. ఫిజికల్ రూపంలో డాక్యుమెంట్లు దాఖలు చేయుటకు ఆఖరు తేదీ మరియు సమయం **07.08.2025న మ.గం.2.00 వరకు.** టెక్నికల్ బిడ్ తెరచు తేదీ మరియు సమయం **07.08.2025న సా.గం.4.00.**

ప్రాజెక్టు డైరెక్టర్

NHAI, PIU-విజయవాడ, ప్లాట్ నెం.74, వనమాలీ బిల్డింగ్, NAC కళ్యాణ వేదిక ప్రక్కన, కమర్షియల్ ట్యాక్సస్ కాలనీ, గురునానక్ నగర్ రోడ్, విజయవాడ-520 008, ఫోన్ 0866-2483910, 2474496.

కేవలం రోడ్లు మాత్రమే కాదు, జాతిని నిర్మిస్తోంది

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

● ఎపిఎన్‌జిజిఒ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగులు అసంతృప్తిగా ఉన్నారని, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఎపిఎన్‌జిజిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. గుంటూరులోని ఎన్‌జిజిఒ సంఘం సాంస్కృతిక సమావేశ భవనం పునర్నిర్మాణ మొదటి అంతస్తును ఎమ్మెల్సీ అలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, డి.వి.రమణ తదితరులు మంగళవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో విద్యాసాగర్ మాట్లాడుతూ.. 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు, డిఎ బకాయిలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ తదితర విషయాల్లో జాప్యంతో ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. 25 నెలలుగా పిఆర్‌సి కమిషన్ ఏర్పాటులో జాప్యం జరిగిందన్నారు. ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు ఉన్నాయంటున్న ప్రభుత్వం.. ఆర్థికేతర అంశమైన కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణను ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. అవుట్‌సోర్సింగ్, సచివాలయ ఉద్యోగులు, పోలీసులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటన్నింటిపై ఎపిఎన్‌జిఒ కృషి చేస్తుందని తెలిపారు.

మణిపూర్‌లో ఎస్ఐఆర్

● ఎన్నికల కమిషన్ సన్నాహాలు

ఇంఫాల్ : బీహార్‌లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై ఎన్ని విమర్శలు వస్తున్నా కేంద్ర ఎన్నికల కమిషన్ వెనక్కి తగ్గడం లేదు. పైగా ఈ ఎస్ఐఆర్‌ను మణిపూర్‌లో నిర్వహించానికి ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఎస్ఐఆర్ కోసం మణిపూర్‌లోని బూత్ లెవల్ ఆఫీసర్ల (బిఎల్ఓలకు) శిక్షణా తరగతులను ఈ నెల 25 నుంచి ప్రారంభించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని మణిపూర్ జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ రామానంద నోంగ్మెయికాపమ్ మీడియాకు వెల్లడించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ (ఇసిఐ) నుంచి అధికారికంగా, అనధికారికంగా వచ్చిన సమాచారం ప్రకారమే వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 'ఇతర రాష్ట్రాలతో జరుగుతున్న ఎస్ఐఆర్‌కు అనుగుణంగానే ఇక్కడా నిర్వహి స్తున్నాం. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలనే ఇసిఐ ప్రతిపాదన ప్రకారం రాష్ట్రంలోనూ సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. అయితే మణిపూర్‌లో ఎస్ఐఆర్‌కు నిర్ధిష్టమైన తేదీలను ఇసిఐ వెల్లడించలేదని చెప్పారు. రాజకీయ పార్టీలకు ఇచ్చిన సమాచారం ప్రకారం వచ్చే ఏడాది జనవరి 1 (1-1-2026) ఓటర్ల జాబితా ప్రకారం మణిపూర్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించనున్నారు.

న్యూయార్క్‌లో కాల్పులు

● పోలీసు అధికారితో సహా ఐదుగురి మృతి



కాల్పులు చోటుచేసుకున్న మన్‌హట్టన్ ప్రాంతంలో తుపాకీతో తిరుగుతున్న అనుమానితుడు (సిసి టివి ఫుటేజీ)

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన కాల్పుల్లో పోలీసు అధికారితో సహా ఐదుగురు మరణించారు. పలు కార్యాలయాలు వున్న మన్‌హట్టన్‌లో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. సెంట్రల్ మన్‌హట్టన్‌లో సోమవారం ఈ దారుణం చోటుచేసుకుంది. బుల్లెట్ ప్రూఫ్ ధరించిన ఒక దుండగుడు ఏఆర్- రైఫిల్‌తో పార్క్ అవెన్యూ భవనంలోకి ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సిసిటివిలో రికార్డ్ అయ్యాయి. ఈ ఘటనలో న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారితో సహ ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల శబ్దాలతో ప్రజలు ప్రాణభయంతో భవనం నుండి పరుగులు తీశారు. కాల్పులు జరిపిన తర్వాత దుండగుడు తనని తాను కాల్చుకున్నట్టుగా తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని పరిశీలిస్తున్నారు. దుండగుడిని లాస్‌వెగాస్‌కు చెందిన షేన్ తమురా (27)గా గుర్తించారు. దుండగుడి వద్ద ఉన్న రైఫిల్‌కు లైసెన్స్ ఉందని, అయితే, దాని గడువు ముగిసిందని గుర్తించారు. కాగా ఈ కాల్పులను న్యూయార్క్ మేయర్ ఎరిక్ ఆడమ్స్ తీవ్రంగా ఖండించారు.

వైసిపి ఎమ్మెల్సీలపై కేసులో తదుపరి చర్యలు నిలిపివేత

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డిలకు మంగళవారం హైకోర్టులో వెసులుబాటు లభించింది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి గుంటూరు మిర్చియార్డ్‌కు వెళ్లారంటూ నమోదైన కేసులో తదుపరి చర్యలను హైకోర్టు నిలిపివేసింది. తదుపరి విచారణను నెల రోజులకు వాయిదా వేస్తూ జస్టిస్ వై. లక్ష్మణరావు మంగళవారం మధ్యంతర ఆదేశాలను జారీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిర్చియార్డ్ పర్యటన సందర్భంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారన్న ఎన్నికల అధికారి ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ వాదనలతో హైకోర్టు ప్రాథమికంగా అంగీకరించి వారిపై కేసులో తదుపరి చర్యలను నిలిపివేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

కొడాలి నానికి హైకోర్టులో ఊరట

ప్రజాశక్తి-అమరావతి

పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నమోదైన కేసులో వైసిపి నాయకులు, మాజీ మంత్రి కొడాలి నానికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో తదుపరి చర్యలు నిలుపుదల చేయాలని మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు జారీ చేసింది. తదుపరి విచారణ నెల రోజులకు వాయిదా వేస్తూ జస్టిస్ వై. లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. తనపై మచిలీపట్నం పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలంటూ పిటిషన్ వేసిన కొడాలి నాని తరపున లాయర్ శశిధర్‌రెడ్డి వాదిస్తూ కేసులోని సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవన్నారు. పోలీసుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీలోత్పల్ ప్రతివాదన చేస్తూ కేసులోని సెక్షన్లు పిటిషనర్‌కు వర్తిస్తాయని చెప్పారు. నాని తెలుగులో పోలీసులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఇంగ్లిషులోకి అనువాదం చేసేందుకు గడువు కావాలని కోరడంతో విచారణ వాయిదా పడింది. అప్పటి వరకు కేసులోని తదుపరి చర్యలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

వైసిపి నాయకుడు ప్రకాష్‌రెడ్డికి హైకోర్టులో వెసులుబాటు

ప్రజాశక్తి-అమరావతి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని నమోదైన కేసులో వైసిపి నాయకుడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి హైకోర్టులో వెసులుబాటు లభించింది. రామగిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో రెండువారాల పాటు తొందరపాటు చర్యలు తీసుకోరాదని పోలీసుల్ని హైకోర్టు ఆదేశించింది.

సివిల్ వివాదంలో పోలీసులకు పనేంటి?

● రాజీ చేసుకోవాలని ఒత్తిడి ఎలా చేస్తారు? : హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

సివిల్ వివాదం కేసు రాజీ చేసుకోవాలని పోలీసులు వేధించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బెదిరించి కేసును రాజీ చేసుకోవాలని పోలీసులు ఒత్తిడి చేయడం ఏమిటని ప్రశ్నించింది. పోలీసులు ఏం చేస్తున్నారో కోర్టుకు తెలియదని అనుకోవద్దని చెప్పింది. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేయకుండా తీరుబడిగా మీకు ఇష్టం వచ్చినప్పుడు నమోదు చేయడం ఏమిటని నిలదీసింది. పోలీసులకు కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. పిటిషనర్ పఠాన్ కరీంసా వ్యవహారంలో జోక్యం చేసుకోరాదని, జోక్యం చేసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల ఎస్ఎహెచ్ఒను హెచ్చరించింది. పోలీసుల నిర్బంధంలో ఉన్న వైసిపి కార్యకర్త పఠాన్ కరీంసా కోర్టులో హాజరైన విషయాన్ని రికార్డుల్లో నమోదు చేసింది. ఆయన భార్య పఠాన్ సైదా బీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మూసేస్తున్నట్లు జస్టిస్ రావు రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతి డివిజన్ బెంచ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తన భర్తను పోలీసులు నిర్బంధించి కోర్టులో హాజరుపర్చలేదంటూ సైదా బీ పిటిషన్ వేశారు. కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు పోలీసులు పఠాన్ కరీంసాను హైకోర్టులో మంగళవారం హాజరుపర్చారు. కరీంసా తరపు న్యాయవాది సూరపరెడ్డి గౌతమి వాదిస్తూ, పిటిషనర్ సివిల్ వివాదంలో పిడుగురాళ్ల ఎస్‌హెచ్ఓ జోక్యం చేసుకుంటున్నారని చెప్పారు. కరీం సా కల్పించుకుని ఎస్‌హెచ్ఓ దురుసుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. దీంతో హైకోర్టు పోలీసుల తీరును తప్పుపట్టింది.

यूनियन बैंक ऑफ़ इंडिया Union Bank of India
(A Govt. of India Undertaking)

అసెట్ రికవరీ బ్రాంచ్
249/3ఆర్‌టి, 1వ అంతస్తు, మెయిన్ రోడ్, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-500038, తెలంగాణ.
మెయిల్ ఐడి: ubin0556009@unionbankofindia.bank

అమ్మకంకు సంబంధించి రుణగ్రహీతకు సమాచార ప్రకటన (30 రోజుల ప్రకటన)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2)/ 8(6).

Date: 23-07-2025

టు,

రుణగ్రహీత:	పార్టనర్ మరియు తాకట్టుదారు & హామీదారు
మెసర్స్ శ్రీ శివాణి ఎంటర్‌ప్రైజెస్, ప్లాట్ నం.144/ఎ, వెంకటరమణ కాలనీ, కెపిహెచ్‌బి కాలనీ, హైదరాబాద్-500072. & **మెసర్స్ శ్రీ శివాణి ఎంటర్‌ప్రైజెస్,** ప్లాట్ నం.108/ఎ, 136/ఎ, సాయి జ్యోతి నిలయం, వెంకటరమణ కాలనీ, గోకుల్ ప్లాట్స్, కెపిహెచ్‌బి 9వ ఫేజ్ దగ్గర, హైదరాబాద్-500072.	**శ్రీ జాగర్లమూడి కోటయ్య చౌదరి,** ప్లాట్ నం.144/ఎ, వెంకటరమణ కాలనీ, గోకుల్ ప్లాట్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072. **శ్రీమతి జాగర్లమూడి శైలజా,** భర్త శ్రీ జాగర్లమూడి కోటయ్య చౌదరి, ప్లాట్ నం.144/ఎ, వెంకటరమణ కాలనీ, గోకుల్ ప్లాట్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072.

సర్/మేడం,

విషయం: ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002, క్రింద, బ్యాంక్ కు బకాయి వున్న మొత్తాల రియలైజేషన్ కొరకు శ్రీమతి జాగర్లమూడి శైలజా, భర్త శ్రీ జాగర్లమూడి కోటయ్య చౌదరిల కు చెందిన ఆస్తుల అమ్మకం.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కూకట్‌పల్లి బ్రాంచి, హైదరాబాద్ (తగినట్లు ఖాతా అనునది, అసెట్ రికవరీ బ్రాంచి, 249/3ఆర్‌టి, 1వ అంతస్తు, మెయిన్ రోడ్, ఎస్ఆర్ నగర్, హైదరాబాద్-500038, తెలంగాణకు బదిలీచేయబడినది), ది సెక్యూర్డ్ క్రెడిటర్, ఇందులోని నిర్ణీత సమయంలోగా బకాయిలను చెల్లించవలసిందిగా కోరుతూ, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద, తేది: 04.02.2017 నాటి డిమాండ్ నోటీసు జారీచేయుటకు కారణమైనది. నిర్ణీత సమయంలోగా సదరు నోటీసు అనుసరించి మీరు చెల్లించుటలో విఫలంచెందినందున, అధీకృత అధికారి, సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ అసెట్స్‌ను **08.05.2017 స్వాధీనంచేసుకున్నారు.**

సెక్యూర్డ్ అసెట్‌ను స్వాధీనంచేసుకున్నప్పటికీ, మీరు బ్యాంకుకు బకాయి మొత్తాలను చెల్లించలేదు, ఇట్టి స్థితిలో, ఈ నోటీసును మీరు స్వీకరించిన తేది నుండి **30 రోజుల తరువాత ఆన్‌లైన్ విధానం ద్వారా బహిరంగ ఇ-వేలం** నిర్వహించుట ద్వారా దిగువ పేర్కొనబడిన ఆస్తిని విక్రయించుటకు ఆవశ్యకత ఏర్పడింది. ఇ-వేలం తేదీ& సమయంను ఆస్తి యొక్క రిజర్వు ధరతోపాటు, ఏదైతే ఇ-వేలం నిర్వహించు తేదీ& సమయం, సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడుతాయి.

కావున, అమ్మకపు ప్రకటన ప్రచురణ తేదికి ముందు బ్యాంకుచే వెచ్చించిన వ్యయాలు, తగిన వడ్డీలు, ఖర్చులు, చార్జీలుతోపాటు బ్యాంకుకు బకాయి మొత్తాలను అనగా., 30.06.2025 నాటికి గల మొత్తం రూ.3,59,45,258.98 పై.లు (రూపాయలు మూడు కోట్ల యాభై తొమ్మిది లక్షల నలభై ఐదు వేల రెండు వందల యాభై ఎనిమిది మరియు తొంభై ఎనిమిది పైసలు మాత్రమే) మీరు చెల్లించినట్లైతే, ఆస్తి అమ్మకం కొరకు ఏదేని తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు చట్టం యొక్క సెక్షన్ 13(8)లో చూపినట్లుగా మీరు ఆస్తిని విడిపించుకోవచ్చును.

ఆస్తి యొక్క షెడ్యూలు: విక్రయించబడు స్థిరాస్తుల వివరణ:

ఆస్తి: విక్రయించబడు స్థిరాస్తుల వివరణ:

ఆస్తి 1: శ్రీమతి జాగర్లమూడి శైలజాకు చెందిన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, కొరెటిపాడు గ్రామం వద్ద 250.66చ.గ.లు లేదా 209.58చ.మీ.ల విస్తీర్ణంతో డోర్ నం.166/ఎ1 (కొత్త నం.166/1ఎ)తో ఒపెన్ ప్లాట్ మొత్తం మరియు సరిహద్దులు: సేల్ డీడ్ ప్రకారం సరిహద్దులు: ఉత్తరం: డ్రైనేజి కాలువ, దక్షిణం: మాదల సుందరమ్మకు చెందిన ఆస్తి, తూర్పు: రోడ్డు, పడమర: బొట్టె గీత కృష్ణా రావుకు చెందిన ఆస్తి, సేల్ డీడ్ నం. 4524/2005, తేది: 31.03.2025, ఎస్ఆర్ఓ: గుంటూరు.

ఆస్తి 2: శ్రీమతి జాగర్లమూడి శైలజాకు చెందిన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, కొరెటిపాడు గ్రామం వద్ద 249.22చ.గ.లు లేదా 208.38చ.మీ.ల విస్తీర్ణంతో డోర్ నం.166/ఎ1 (కొత్త నం.166/1ఎ)తో ఒపెన్ ప్లాట్ మొత్తం మరియు సరిహద్దులు: సేల్ డీడ్ ప్రకారం సరిహద్దులు: ఉత్తరం: కోవెలమూడి రవీంద్రకు చెందిన ఆస్తి, దక్షిణం: బలతోతి భారతిదేవి చెందిన ఆస్తి, తూర్పు: వెలమ అరుణకు చెందిన ఆస్తి, పడమర: 25' వెడల్పు రోడ్డు. సేల్ డీడ్ నం: 4523/2005, తేది: 31.03.2025, ఎస్ఆర్ఓ: గుంటూరు.

గూగుల్ కొ-ఆర్డినేట్స్: 16.322109, 80.440408.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 23.07.2025

సం/- చీఫ్ మేనేజర్, & అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)
CIN : L65110TN2014PLC097792
రిజిష్టర్డు ఆఫీసు: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హర్రింగ్టన్ రోడ్, చెట్‌పెట్, చెన్నై-600031. TEL: +91 44 4564 4000 | FAX: +91 44 4564 4022.
IDFC FIRST Bank

అనుబంధం IV (రూల్ 8(1))
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, తేది:**05-10-2024** నాటి డిమాండ్ నోటీసు జారీచేసి రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు: **1) శ్రీ లక్ష్మీ గణేష్ కాటన్ ట్రేడర్స్, 2) ఆంజనేయులు బచ్చనబోయిన, 3) రామచంద్రరావు బచ్చనబోయిన, 4) బచ్చనబోయిన వెంకటేశ్వరరావు, 5) బి వెంకట శివ కుమారి** వారిని సదరు డిమాండ్ నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **05.10.2024** నాటికి **రూ.1,27,12,191.00/- (రూపాయలు ఒకకోటి ఇరవైఏడు లక్షల పన్నెండువేల ఒకవంద తొంభైఒకటి మాత్రమే)** లను తిరిగి చెల్లించవలసిందిగా కోరినారు.

రుణగ్రహీతలు మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ప్రకటన ఇవ్వడమేమనగా క్రింది సంతకందారు, సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే చట్టంలోని సెక్షన్13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **22 జూలై, 2025**న **భౌతికంగా స్వాధీనంలోకి** తీసుకున్నారు.

ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏ విధంగానూ లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)** వారికి **రూ.1,27,12,191.00/- (రూపాయలు ఒకకోటి ఇరవైఏడు లక్షల పన్నెండువేల ఒకవంద తొంభై ఒకటి మాత్రమే)** మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు లోబడి వుంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలను రుణగ్రహీతలు శ్రద్ధ వహించగలరు.

స్థిరాస్తులకు సంబంధించిన వివరణ:

ఐటం నెం.1: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు ఉప జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని జునంచుందూరు గ్రామంలో, చౌడవరం గ్రామం, ఆంధ్రప్రదేశ్-522017 పరిధిలోని డి.నెం.323/3బి (వార్డ్ నెం.59) సైట్‌లో విక్రేత హక్కు పొందాడు మరియు ఆర్‌సిసి డాబా ఇల్లు దీని అసెస్‌మెంట్ నెం.1021193714, డోర్ నెం.110-1-603 కలిగిన ఆస్తి మొత్తం భాగం. **సరిహద్దులుగా: తూర్పు:** మున్సిపల్ రోడ్-40'6", **పడమర:** మున్సిపల్ రోడ్- 40'6", **ఉత్తరం:** తొగట మల్లిఖార్జునే రావు యొక్క షీటెడ్ ఇల్లు-45'6", **దక్షిణం:** మున్సిపల్ రోడ్-45'6". ఈ సరిహద్దుల లోపల 205 చదరపు గజాల లేదా 171 చదరపు మీటర్ల స్థలం విస్తీర్ణంలో ఉన్న 910 చ.అ.అ ఆర్‌సిసి డాబా ఇల్లు,అన్ని ఇతర సౌకర్యాలతో సహా.

ఐటం నెం.2: నల్లపాడు గ్రామం, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, నల్లపాడు సబ్-రిజిస్ట్రీ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522005 పరిధిలోని హట్ దీని డోర్ నెం.3-6, అసెస్ట్ నెం.355, కానీ పన్ను రసీదు ప్రకారం అసెస్ట్ నెం.1021127684, డి.నెం.422/సి తోపాటుగా సైట్ యొక్క ఎక 0.06-1/2 సెంట్లు లేదా 314.5 చ.గ.లు (262.95 చ.మీ.ల) విస్తీర్ణపు ఆస్తి మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** యాగల వెంకటేశ్వర్లు, బచ్చనబోయిన శివయ్య, నారబోయిన అప్పయ్య ఆస్తి, **పడమర:** జనపురపు వీరయ్య ఆస్తి, **ఉత్తరం:** వడ్డుల సుబ్బారెడ్డి ఆస్తి, **దక్షిణం:** బజార్. దానిపై ఉన్న అన్ని భవనాలు మరియు నిర్మాణాలు మరియు భూమికి అనుసంధానించబడిన లేదా భూమికి అనుసంధానించబడు ఏదైనా శాశ్వతంగా అనుసంధానించబడిన అన్ని ప్లాంట్ మరియు యంత్రాలతో కలిపి.

తేది : 22 జూలై, 2025
ప్రదేశం: గుంటూరు
రుణ ఖాతా నెం : 10061328403

సం/- అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఫారము -6ఎ
Gazette. No. 34/KST/ 2025 Dt : 08-07-2025
చట్టంనెం. 30/2013 లోనిసెక్షన్ 11(1) మరియు రూలు 19 (1) క్రింద
ప్రాథమిక ప్రకటన

ఆర్.సి.నెం.ఎల్7.606/2024 **తేది. 08.07.2025**

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరిచిన ఉంగుటూరు మండలము కొయ్యగురపాడు గ్రామములో ఉన్న భూములను ప్రజాహితకార్యక్రమముల నిమిత్తము, అనగా బుడమేరు విస్తరణ మరియు ఆధునీకరణ కొరకు అవసరమై వున్నదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, భూమి అవసరమైనట్లుగా కృష్ణాజిల్లా, కలెక్టరు గారు చట్టములోని విభాగము 3 (ఇ) ప్రొవిజన్ మరియు ఆంధ్రప్రదేశ్ భూసేకరణ పునరావాస మరియు పునర్నిర్మాణము రూల్స్ 2014 లోని నిబంధన 2(1)(బి) క్రింద అను గుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన కలెక్టరు వారు భావించి నందున భూసేకరణ పునరావాస మరియు పునర్నిర్మాణములో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కుచట్టం 2013 లోని విభాగం11(1) లో ఉన్న నిబంధనల మేరకు ఈ విషయము గురించి అందుకు సంబంధించిన వారందరికీ ఎరుక నిమిత్తం ఇందుమూలముగా నోటీసుఇవ్వడమైనది.

సదరు భూసేకరణ వలన 12 భూయజమానులు మాత్రమే ప్రభావితము కాగలరు. నిర్వాసితులు లేరు. ప్రభావితము అగుటకు గల కారణములు దిగువ ఇవ్వడమైనవి.

చట్టంలోని సెక్షన్ 43 (1) మేరకు ప్రభావిత వ్యక్తుల సహాయ పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెం. 1 రెవిన్యూ (భూ.సే) శాఖ తేది. 02.01.2015 నందు ఇవ్వబడిన ప్రకటన ద్వారా సంయుక్త కలెక్టరు గారు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ నియమించబడినారు.

చట్టములోని సెక్షన్లోని 3(ఇ) మరియు రూల్స్ 2014 లోని రూలు 2(1)(బి) ద్వారా లభ్యమైన అధికారముల మేరకు **కృష్ణాజిల్లా కలెక్టరు వారు ఇందుమూలముగా భూసేకరణ అధికారి/రెవిన్యూ డివిజనల్ అధికారి, గుడివాడ** వారి సిబ్బందికి, పనివారికి కలెక్టరు యొక్క విధులు నిర్వహించుటకు అధికారము ఇస్తున్నారు.

చట్టములోని సెక్షన్ 12 మరియు 20 కి లోబడి సర్వే నిర్వహించుటకు రెవిన్యూ డివిజన్ అధికారి మరియు భూసేకరణ అధికారి, గుడివాడ వారిని అనుమతించుచూ సదరు సర్వే నందు భూయజమానులు ప్రత్యక్షంగా గానీ, అధీకృత ప్రతినిధి ద్వారా గానీ ఈ ప్రకటన జారీచేయబడిన 60 దినములలో హాజరుకావాలని తెలియచేయడమైనది. లేని యెడల వారి పరోక్షమున సర్వే నిర్వహించబడును.

భూసేకరణచట్టం 2013 లోని విభాగం11 (4) ప్రకారం జిల్లా కలెక్టరు గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ భూముల పై ఎటువంటి లావాదేవీలు అనగా అమ్మకం, కొనుగోలు చేయుట లేక ఋణములు తీసుకొనుట ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి ఎవ్వరు చేయకూడదని తెలియచేయడమైనది.

విభాగము 15(1) ననుసరించి ఈ భూసేకరణ పై ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఆసక్తి గల వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించిన 60 దినములలోగా భూసేకరణ అధికారి/ రెవిన్యూ డివిజనల్ అధికారి, గుడివాడ వద్ద భూమి విషయములలో, భూమి ఉపయుక్తము మరియు ప్రజహితప్రయోజనములపై అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

ప్రాజెక్టు పేరు : బుడమేరు విస్తరణ మరియు ఆధునీకరణ నిమిత్తము

జిల్లా : కృష్ణా **మండలము: ఉంగుటూరు** **గ్రామము:కొయ్యగురపాడు**

క్రమ సంఖ్య	సర్వే నెం.సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం.	భూమి యొక్క వివరణ మాగాణి/ మెట్ట	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు				చెట్టు మరియు కట్టడముల వివరములు
						ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	
1.	26-1	1.77	1.44	మెట్ట	కొల్లి కనక దుర్గా ప్రసాద్	పిడికిటి ఉషారాణి	బుడమేరు కట్ట	బుడమేరు	బుడమేరు కొల్లి కనక దుర్గా ప్రసాద్	లేవు
2.	27	1.59	1.59	మెట్ట		పాలడుగు ప్రభావతి	బుడమేరు కట్ట	బుడమేరు	బుడమేరు కొల్లి కనక దుర్గా ప్రసాద్	లేవు
3.	41	1.96	1.96	మెట్ట		బెల్లంకి వెంకటేశ్వరరావు	బుడమేరు కట్ట	కొల్లి కనక దుర్గా ప్రసాద్	కొల్లి కనక దుర్గా ప్రసాద్	లేవు
4.	42	1.92	1.92	మెట్ట		కుర్ర లక్ష్మి భవాని	బుడమేరు	కొల్లి కనక దుర్గా ప్రసాద్	బుడమేరు	లేవు
	మొత్తము	7.24	6.91							

సం/- డి.కె.బాలాజీ, ఐ.ఎ.ఎస్.,
కలెక్టర్, కృష్ణాజిల్లా.

ట్రక్కును ఢీకొన్న బస్సు

- 18 మంది యాత్రికులు మృతి

జార్ఖండ్ : జార్ఖండ్‌లోని డియోఘర్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల మేరకు ... కన్వర్ యాత్ర సందర్భంగా ఈరోజు తెల్లవారుజామున 4 గంటల 30 నిముషాలకు మోహన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జమునియా అడవి సమీపంలో యాత్రికులతో వెళుతున్న బస్సు గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 18మంది యాత్రికులు మరణించారు. 20 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి సహాయక బృందాలు చేరుకున్నాయి. గాయపడినవారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో మతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. స్థానికులు ఈ సంఘటన గురించి మోహన్‌పూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి ప్రియరంజన్‌కు సమాచారం అందించారు. ఆ తర్వాత ప్రియరంజన్ కుమార్ ఒక బందంతో సంఘటనా స్థలానికి చేరుకుని, మోహన్‌పూర్ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కు సమాచారం అందించారు. సహాయక చర్యలు ప్రారంభించి గాయపడినవారిని అంబులెన్స్ ద్వారా మోహన్‌పూర్ సిహెచ్‌సికి పంపారు. ఈ ప్రమాదంపై ఎంపీ నిషికాంత్ దూబే విచారం వ్యక్తం చేశారు. " నా లోక్‌సభ నియోజకవర్గమైన దేవఘర్‌లో శ్రావణ మాసంలో కన్వర్ యాత్ర సందర్భంగా వెళుతున్న బస్సు, ట్రక్కును ఢీకొన్న ప్రమాదంలో 18 మంది భక్తులు మరణించారు. బాబా బైద్యనాథ్ వారి కుటుంబాలకు ఈ నష్టాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని కోరుకుంటున్నా " అని తెలిపారు.

మాచర్ల వైసిపి నేత టి కిశోర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాచర్ల మున్సిపల్ కార్పొరేసన్ మాజీ ఛైర్మన్ టి కిశోర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఇక ముందు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని తురకా కిశోర్ రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఏపిలో ప్రభుత్వం మారిన తరువాత ఇప్పటి వరకు తనమీద తొమ్మిది కేసులు నమోదు చేశారని మాచర్చ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడైన కిశోర్ ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను మంగళవారం న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కిశోర్‌పై ఇప్పటికే తొమ్మిది కేసులు నమోదు చేశారని, ఇంకా మరికొన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి సిద్ధమయ్యారని కిశోర్ న్యాయవాది తెలిపారు. అయితే ధర్మాసనం ఈ పిటిషన్ విచారణకు స్వీకరించడానికి నిరాకరిస్తూ డిస్మిస్ చేసింది.

చైనాలో పర్యటిస్తా..! : ట్రంప్

వాషింగ్టన్ : చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌తో తాను శిఖరాగ్ర సదస్సు జరపాలనుకోవడం లేదని అమెరికా అధ్యక్షులు ట్రంప్ మంగళవారం చెప్పారు. అయితే, జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు చైనాలో పర్యటించవచ్చునని వ్యాఖ్యానించారు. లేకపోతే తనకు ఆసక్తి లేదన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఈ ఏడాది చివరిలో ఆసియా దేశాల్లో ట్రంప్ పర్యటించనున్నారు. ఆ సందర్భంగా జిన్‌పింగ్, ట్రంప్‌ల మధ్య సమావేశం జరిగే అవకాశం గురించి ట్రంప్, జిన్‌పింగ్ సహాయకులు చర్చించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, భద్రతా పరమైన ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ట్రంప్ జరిపే పర్యటన ఇరువురు నేతల మధ్య ముఖాముఖి సమావేశానికి వేదిక అవుతుంది. స్టాక్‌హోంలో ఈ వారంలో అమెరికా, చైనా మూడవ దఫా వాణిజ్య చర్చలు జరగనున్నాయి. నేతల భేటీకి ముందు ఈ సమావేశంలో సన్నాహాలు జరిగే అవకాశం వుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఉక్రెయిన్ జైలుపై వైమానిక దాడి

- 17 మంది ఖైదీలు మృతి

కీవ్ : ఉక్రెయిన్‌లోని ఈశాన్య జపోరిజిజియా ప్రాంతంలోని జైలుపై రష్యా జరిపిన వైమానిక దాడిలో 17 మంది ఖైదీలు మరణించారు. 80 మందికి పైగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు మంగళవారం తెలిపారు.

మహారాష్ట్ర ఉల్లి రైతు కన్నీరు

- ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌లోనూ భారీగా ధర పతనం
- క్వింటాల్‌కు రూ.3 వేలు కనీస మద్దతు ధర ఇవ్వాలని
- అన్నదాతల డిమాండ్
- ఆగస్టు 10లోగా చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన సిద్ధం



ముంబయి : మహారాష్ట్రలో ఉల్లి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అప్పుసప్పు చేసి ఆరుగాలం కష్టించి పండించిన పంటకు కనీస మద్దతు ధర దక్కకపోవడంతో సమస్యల వలయంలో చిక్కుకున్నారు. ఆసియాలోనే అతిపెద్ద ఉల్లి మార్కెట్ అయిన మహారాష్ట్రలోని లాసాల్‌గావ్‌లో గత రెండు వారాలుగా ఉల్లి ధరలు దాదాపు 15 శాతం మేర పడిపోయాయి. జులై 16న క్వింటాల్ ఉల్లి ధరలు సగటున రూ.1500 వుండగా, జులై 28 నాటికి అది రూ.1275కి పడిపోయింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.3వేలుగా నిర్ణయించాలన్నది రైతుల ప్రధాన డిమాండ్‌గా వుంది. ప్రస్తుతం సగటు మార్కెట్ ధర క్వింటాల్‌కు రూ.1275గా వుంది. తమ పంటకు మద్దతు ధర ఇవ్వాలని, దీర్ఘకాలిక విధానపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జరిగిన లాసాల్‌గావ్ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఎపిఎంసి) సమావేశంలో మహారాష్ట్ర రాష్ట్ర ఉల్లి రైతుల సమాఖ్య పలు తీర్మానాలను ఆమోదించింది. ఈ సమావేశానికి రైతు ప్రతినిధులు, ఎపిఎంసి సభ్యులు, రాష్ట్రవ్యాప్తంగా సహకారనేతలు హాజరయ్యారు.

10 వరకు వేచిచూస్తాం

రైతులు తమ ఉత్పత్తి వ్యయాని కన్నా చాలా తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోంది. ఆ ఉత్పత్తి వ్యయం క్వింటాల్‌కు రూ.1800 నుండి రూ.2వేలు మధ్యలో వుంటోంది. ఇది కేవలం ఆర్థికపరమైన దోపిడీనే కాదు, ఏడాది కాలమూ కష్టించి పనిచేసే రైతన్న పట్ల అగౌరవమని అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు భరత్ ధిఘోలె విమర్శించారు. ఆగస్టు 10వ తేదీ కల్లా ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించని పక్షంలో రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతారని హెచ్చరించారు. అప్పటివరకైతే వేచి చూస్తామన్నారు.

రైతుల డిమాండ్లు

ఉల్లి ఎగుమతులపై ఏకపక్ష ఆంక్షలను నివారించడానికి 20 ఏళ్ళ దీర్ఘకాలిక ఎగుమతి విధానాన్ని రూపొందించాలి. ప్రతిపాదిత ఎంఎస్‌పితో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉల్లిని సేకరించాలి. ఆనియన్ పండ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి, ఇటీవలి మాసాల్లో ఉత్పత్తి వ్యయానికన్నా అతి తక్కువ ధరకు ఉల్లిని అమ్ముకున్న రైతులకు కింటాల్‌కు వెయ్యి రూపాయిలు ఇవ్వాలి, కీలకమైన జిల్లాల్లో కేంద్రం తోడ్పాటుతో ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలి. రవాణా, ఇంధన రేట్లపై సబ్సిడీ ఇవ్వాలి, 10 శాతం ఎగుమతి సబ్సిడీ ఇవ్వాలి, మార్కెట్ కమిటీల ద్వారా క్వింటాల్‌కు రూ.3 వేలకు తగ్గకుండా పెద్ద మొత్తంలో నిల్వలు సేకరించాలి, అలా కాని పక్షంలో నాఫెడ్, ఎన్‌సిసిఎఫ్‌ల ద్వారా సేకరించడాన్ని ఆపేయాలని కేంద్రాన్ని అసోసియేషన్ కోరింది.

అకాల వర్షాలు, దానికి తోడు ఉల్లిని ఉత్పత్తి చేసే ఇతర రాష్ట్రాలైన రాజస్థాన్, కర్ణాటక, మధ్యప్రదేశ్‌ల నుండి కూడా ఉల్లి రావడంతో సరఫరాలో, ధరల్లో తీవ్రమైన ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ నెల ఆరంభంలో 30 శాతం మార్కెట్‌కు ఉల్లి రావడం తగ్గిపోయింది. ఈ పరిస్థితుల కారణంగా తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని రైతు నితిన్ ఖైర్నర్ ఆందోళన వ్యక్తంచేశారు.

మూకుమ్మడి ఓటర్ల తొలగింపులుంటే తక్షణమే జోక్యం!

- బీహార్‌లో ఎస్ఐఆర్‌పై ఇసికి సుప్రీంకోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ : బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో షెడ్యూలు ప్రకారం ఆగస్టు 1న ప్రచురించే ఓటర్ల జాబితా ముసాయిదాలో పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించినట్లు తేలితే తక్షణమే తాము జోక్యం చేసుకుంటామని సుప్రీంకోర్టు మంగళవారం హెచ్చరించింది. ప్రతిపాదిత ముసాయిదాలో 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారని, వీరిలో కొందరు చనిపోగా, మరికొందరు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయారని చెబుతున్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్‌తో సహా పలు ఎన్‌జిఓలు, ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే ఆందోళన వెలిబుచ్చాయి. దానిపై స్పందిస్తూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బగ్చిలతో కూడిన బెంచ్ పై ప్రకటన చేసింది. 'ముసాయిదా ప్రచురితమయ్యేవరకు వేచిచూద్దాం. ఒక వేళ మూకుమ్మడిగా ఓటర్ల తొలగింపులు ఉంటే కచ్చితంగా ఆ తక్షణమే జోక్యం చేసుకుంటాం' అని ధర్మాసనం పేర్కొంది. ఇప్పటికైతే పిటిషనర్ల భయాందోళనలను ఊహాజనితాలుగానే భావిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ఈ ఏడాది జనవరి 7వ తేదీన గల ఓటర్ల జాబితా ప్రాతిపదికన కొత్త ముసాయిదా సిద్ధమవుతోంది. ఈ జాబితాలో వున్నవారందరూ ముసాయిదాలో వుంటారని ఇసి ఇప్పటికే సుప్రీం కోర్టుకు అందచేసిన అఫిడవిట్‌లో పేర్కొంది. అందువల్ల జనవరి 2025 అనేది ప్రారంభ సూచి.. మీరు చెబుతున్న 65 లక్షల మంది ఓటర్లు ఆ జాబితాలో వుండి ముసాయిదాలో వుండరన్నది మీ భయంగా వుంది. అయితే ఒకవేళ ముసాయిదాలో తమపేరు లేకపోతే దిద్దుబాట్ల కోసం మళ్ళీ దరఖాస్తు చేసుకోవడానికి ఇసి షెడ్యూల్ ఇచ్చిందని ధర్మాసనం పేర్కొంది. ఇసి తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది మాట్లాడుతూ, ముసాయిదాలో పేరు లేనివారు నెల రోజుల్లోగా అంటే సెప్టెంబరు 1లోగా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చునని, సెప్టెంబరు 30న తుది జాబితా ప్రచురిస్తారని తెలిపారు.

ఆపిల్ రైతుల ఆగ్రహం

- హిమాచల్‌ప్రదేశ్ సెక్రెటేరియట్ వద్ద నిరసన

సిమ్లా: ఆపిల్ రైతు రోడ్డెక్కాడు. ఏండ్ల తరబడి ఆపిల్ పంటపై ఆధారపడుతున్న తమను ప్రభుత్వం పట్టించుకోవటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.హిమాచల్ కిసాన్ సభ , ఆపిల్ గ్రోవర్స్ సొసైటీ సభ్యులు మంగళవారం సిమ్లాలోని హిమాచల్ ప్రదేశ్ సెక్రెటేరియట్ వద్ద నిరసన తెలిపారు. ఆపిల్ తోటల యజమానులు, రైతులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు.వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా ప్రదర్శనగా తరలివచ్చారు. హిమాచల్ ప్రదేశ్ సర్కార్ తమ సమస్యలను పరిష్కరించకపోతే..ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి 60 వేల మంది పైగా బలి

- పాలస్తీనియన్లు లక్ష్యంగా గాజాలో కొనసాగుతున్న మారణకాండ
- సహాయార్థులపైనా, సహాయ శిబిరాలపైనా దాడులు



గాజా : అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఇయు) అండదండలతో, కార్పొరేట్ కంపెనీల చేయూతతో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో ఊగిపోతోంది. గత 21 నెలల కిందట మొదలైన ఈ మారణకాండలో ఇప్పటి వరకు 60 వేల మంది పైగా సాధారణ పౌరులు చనిపోయారు. వీరిలో అత్యధికులు చిన్నారులు, మహిళలే. గాజాలో కలుగుల్లో దాగున్న హమస్ తిరుగుబాటుదారులను అణిచేసే పేరుతో మొదలైన ఇజ్రాయిల్ సైనిక దాడులు ..అంతకంతకూ విస్తరించి జాత్యాంహకార దాడులుగా మారిపోయాయి. రక్తం రుచి మరిగిన పులిలా చిన్నారులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా ఊళ్లకు ఊళ్లనే మట్టుపెడుతోంది. నివాస ప్రాంతాలు, పాఠశాలలు, ప్రార్థన మందిరాలు, ఆసుపత్రులు, సహాయక శిబిరాలు అనే తేడా లేకుండా ఎడాపెడా క్షిపణి దాడులు చేస్తూ నిత్యం వందలాది మందిని హత్య చేస్తోంది.

2023 అక్టోబర్‌లో మొదలైన ఈ యుద్ధోన్మాద దాడుల్లో కనీసం 60,034 మంది చనిపోయారని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. ఆకలితో అలమటిస్తూ..దప్పిక తీరే దిక్కులేక సహాయక శిబిరాల వద్ద గుప్పెడు మెతుకుల కోసం, గొంతు తడిపేంత నీటి కోసం కుస్తీలు పడుతున్న నిస్సాయులపై ఇజ్రాయిల్ సైనిక బలగాలు వైమానిక దాడులతో విరుచుకుపడుతూనేవున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఇదే తరహా దాడుల్లో 62 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. వీరిలో 19 మంది సహాయం కోసం ఎదురుచూస్తున్న అభాగ్యులుండటం దయనీయం. వీరి మరణాలతో ఇప్పటి వరకు ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోయినవారి సంఖ్య 60 వేలు దాటింది. ఈ దాడుల్లో మరో 1.45 లక్షల మంది గాయపడ్డారు. మతుల్లో దాదాపు సగం మంది మహిళలు, చిన్నారులేనని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. 662 రోజులుగా సాగించిన ఈ మారణకాండలో గాజా మొత్తం జనాభాలో ప్రతి 36లో ఒకరిని చంపేసినట్లు అయ్యింది. రోజు సగటున 90 మందిని హత్య చేశారు. అంతర్జాతీయ సమాజం అందిస్తున్న మానవ సహాయాన్ని ఇజ్రాయిల్ అడ్డుకొని ఆటంకాలు సృష్టించిన కారణంగా సకాలంలో సహాయాన్ని పొందలేక ఆకలి దప్పికలతో అలమటించి 147 మంది చనిపోయారు. ఇలా చనిపోయినవారిలో 88 మంది చిన్నారులే.

అత్యంత దారుణమైన కరవు..

ఇజ్రాయిల్ దాడుల కారణంగా గాజాలో అత్యంత దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని ప్రపంచ ఆకలి మానిటరింగ్ వ్యవస్థ అయిన ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ పేజ్ క్లాసిఫికేషన్ (ఐపిసి) ఒక నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. ఆహార సంక్షోభంతో కొంతకాలంగా గాజా పౌరుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఆకలి బాధతో జీవన్మరణ పోరాటం చేస్తున్నారని ఐపిసి పేర్కొంది. స్థానికంగా అత్యంత దారుణమైన కరవు పరిస్థితి నెలకొందని, తక్షణమే చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున మరణాలు సంభవించే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి సహకారంతో రూపొందిన ఈ నివేదికలో ఐపిసి ఆందోళన వ్యక్తం చేసింది. 'మే-జులై మధ్యకాలంలో తీవ్ర ఆకలిని ఎదుర్కొంటున్న కుటుంబాల సంఖ్య రెట్టింపు అయ్యింది. గాజా సిటీలో పోషకాహార లోపం రేటు మేలో 4.4 శాతంగా ఉండగా.. జులై నాటికి ఏకంగా 16.5 శాతానికి పెరిగింది. గర్భిణులు, బాలింతల్లో ఐదింట రెండొంతుల మంది జూన్‌లో తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడ్డారు' అని పేర్కొంది.

పౌర హక్కులను అణచివేయడమే

- కేరళ నన్‌లను కలుసుకునేందుకు అనుమతించపోవడం దుర్మార్గం
- సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : కల్పిత ఆరోపణలపై ఛత్తీస్‌గఢ్ జిఆర్‌పి బలగాలు అరెస్టు చేసిన కేరళకు చెందిన నన్‌లను కలుసుకోవడానికి సిపిఎం, సిపిఐ, కెసి(ఎం)ల నేతలతో కూడిన ప్రతినిధి బృందానికి దుర్గ్ జైలు పాలనాయంత్రాంగం అనుమతి నిరాకరించడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఇది పౌర హక్కులను అణచివేయడమేనని తీవ్రంగా ఆక్షేపించింది. పారదర్శకతను, జవాబుదారీతనాన్ని, వ్యక్తుల హక్కులను అణచివేసే ప్రయత్నమిదని, ఇది ఎంత మాత్రమూ సమర్థనీయం కాదని విమర్శించింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

వామపక్షాల ప్రతినిధి బృందంలో సిపిఎం నేత బృందాకరత్, ఎంపీలు కె.రాధాకృష్ణన్, ఎ.ఎ.రహీమ్, సిపిఐ నేత అనీ రాజా, ఎంపి పి.పి.సునీర్, కేరళ కాంగ్రెస్ (ఎం) నేత, ఎంపి జోస్ కె.మణి వున్నారు. అక్రమంగా అరెస్టయిన నన్‌లను కలుసుకోవడానికి ముందుగానే రాతపూర్వకంగా అనుమతి కోరినప్పటికీ పేలవమైన కారణాలతో మంగళవారం ప్రతినిధి బృందానికి అనుమతి నిరాకరించారు. తీవ్రంగా దీనిపై నిరసన తెలియచేయడంతో బుధవారం వారిని కలుసుకోవడానికి అనుమతి మంజూరు చేశారని పొలిట్‌బ్యూరో ప్రకటన పేర్కొంది.

రాజకీయ నేతలు, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు నన్‌లను సందర్శించడానికి, నిర్బంధంలో వున్న వారి పరిస్థితిని అంచనా వేయడానికి తొలుత అనుమతిని నిరాకరించడమనేది, అనుసరించాల్సిన ప్రక్రియ పట్ల, మానవ హక్కుల పట్ల ప్రభుత్వం యొక్క ఆందోళనకరమైన నిర్లక్ష్యాన్ని మరింత నొక్కిచెబుతోందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య సూత్రాలపై ప్రత్యక్షంగా దాడి జరపడమే కాగలదు, అలాగే విచారణను అణచివేయడానికి, అసమ్మతి వాణిని వినిపించే వారి గొంతు నొక్కివేయడానికి ఉద్దేశించినవేనని ఆ ప్రకటన విమర్శించింది. కేంద్ర, రాష్ట్రాల్లోని బిజెపి నేతృత్వంలో గల ప్రభుత్వాల నిరంకుశ స్వభావాన్ని ఈ చర్యలు నొక్కి చెబుతున్నాయని పేర్కొంది.

నన్‌లపై మోపిన అభియోగాలు నిరాధారమైనవని, వారి ప్రాథమిక హక్కులను దారుణంగా ఉల్లంఘిస్తున్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. నన్‌లను అరెస్టు చేయడమనేది ఇక్కడ ఒక్క చోట జరిగిన సంఘటనగానే చూడలేమని, మత స్వేచ్ఛను దెబ్బతీసే, మైనారిటీ కమ్యూనిటీలను వేధించే విస్తృత ధోరణిలో భాగంగా చూడాల్సి వుందని పేర్కొంది. ఈ అరెస్టులో కూడా ఒక ధోరణి కనిపిస్తోందని, బజరంగ్ దళ్ ఆదేశాల మేరకే ఇది జరిగిందని పేర్కొంది. మన రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా స్వేచ్ఛగా, శాంతియుతంగా ప్రతి ఒక్కరూ తమ విశ్వాసాన్ని ఆచరించే హక్కును ఎంతటి వ్యయ ప్రయాసలకోర్చి అయినా పరిరక్షించాలని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది.

ప్రళయ్ పరీక్ష విజయవంతం

భువనేశ్వర్ : భారత రక్షణరంగ పరిశోధన సంస్థ (డిఆర్‌డిఒ) అభివద్ధి చేసిన ప్రళయ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. ఒడిశాలోని అబ్దుల్ కలామ్ ద్వీపంలో ఈ నెల 28, 29 తేదీల్లో 150 కిలోమీటర్ల నుంచి 500 కిలోమీటర్లు రేంజీలో లక్ష్య సాధనతో వరుసగా నిర్వహించిన ఈ పరీక్షలన్నీ విజయవంతమైనట్లు డిఆర్‌డిఒ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ క్షిపణి అత్యధిక, అత్యల్ప రేంజిని అంచనా వేయడానికి యూజర్ ఎవల్యూషన్ ట్రయల్స్‌ను నిర్వహించినట్లు పేర్కొంది. డిఆర్‌డిఒ వెల్లడించిన వివరాల ప్రకారం..ప్రళయ్ అనేది స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి. యుద్ధ రంగాల్లో నేరుగా వినియోగించేందుకు వీలుగా దీనిని తయారుచేశారు. భారత వాయుసేన, సైన్యం అవసరాలకు తగినట్లు దీనిని తీర్చిదిద్దారు. ఇది 150 నుంచి 500 కిలోమీటర్ల లోపు లక్ష్యాలను ఛేదించగలదు. 350 నుంచి 700 కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు.

చైనా ఒక్క అంగుళం కూడా చొరబడలేదు

- పార్లమెంటులో కిరణ్ రిజిజు ప్రకటన



న్యూఢిల్లీ : బిజెపి నాయకులు, వారికి బాజాలూదే మీడియా నిత్యం చైనాపై అభాండాలు మోపుతూవస్తున్న సంగతి తెలిసిందే. అయితే భారత భూభాగంలోకి ఒక్క అంగుళం కూడా చైనా చొరబడింది లేదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పార్లమెంటులో ప్రకటించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని ఆయన స్పష్టం చేశారు. 1962 నుంచి ఇదే పరిస్థితి అని మంగళవారం లోక్‌సభకు వెల్లడించారు. రికార్డులను సరిచేయడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'నా సొంత రాష్ట్రం (అరుణాచల్ ప్రదేశ్) లోకి చైనా ప్రవేశించి, ఆక్రమణలకు పాల్పడిందని సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వడం ముఖ్యమని నేను భావించాను. అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం చైనా అధీనంలో ఉన్న ప్రాంతం 1962 యుద్ధానికి ముందు లేదా ఆ సమయంలో స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత అలాంటి పరిస్థితి ఎన్నడూ తలెత్తలేదు' అని కిరణ్ రిజిజు వెల్లడించారు. 'వాస్తవాధీన రేఖ (ఎల్ఎసి) వెంబడి భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించిందని గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల పేర్లను మార్చడానికి చైనా ప్రయత్నించినట్లు కూడా ప్రచారం సాగించింది. అయితే ఆ కథనాలను ప్రభుత్వం తిరస్కరిస్తూ వచ్చింది. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని.. అది విడదీయరాని భాగమని.. పేర్లు మార్చినంత మాత్రాన ఈ వాస్తవాన్ని మార్చలేరు' అని ఇదివరకే స్పష్టం చేశామని కిరణ్‌రిజిజు అన్నారు. గత ఏడాది నుంచి ఇరు దేశాల మధ్య గస్తీ విషయంలో స్నేహం కుదిరింది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న సంబంధాలు.. ఆ ఒప్పందం తర్వాత మెరుగైన సంగతి తెలిసిందే.

ఖర్గేకు జెపి నడ్డా క్షమాపణలు



న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లోని పెహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ అంశాలపై రాజసభ్యలోనూ మంగళవారం వాడీవేడి చర్చ జరిగింది. ఈ క్రమంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సభాపక్ష నేత, కేంద్ర మంత్రి జెపి నడ్డా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తీవ్ర వాగ్వాదానికి కారణమైంది. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల చప్పుళ్లతో సభ కొద్దిసేపు దద్దరిల్లింది. చివరకు తన వ్యాఖ్యలను నడ్డా వెనక్కి తీసుకొని, క్షమాపణలు చెప్పడంతో సభ సద్దుమణిగింది. ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దాదాపు గంటపాటు ప్రసంగించారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పైనా ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఖర్గే ప్రసంగం ముగిసిన వెంటనే స్పందించిన నడ్డా.. కాంగ్రెస్ అధ్యక్షులు 'మానసిక సమతుల్యత' కోల్పోతున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోడీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నడ్డా తీవ్ర వ్యాఖ్యలపై ప్రతిపక్ష సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖర్గేకు ఆయన క్షమాపణ చెప్పాలంటూ పెద్ద పెట్టున నినదించారు. అనంతరం ఖర్గే కూడా మాట్లాడుతూ.. ఎన్‌డిఎ ప్రభుత్వంలో తాను గౌరవించే మంత్రుల్లో నడ్డా కూడా ఒకరని, అయినప్పటికీ తనపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ప్రతిపక్షాల ఆందోళనతో దిగొచ్చిన నడ్డా స్పందిస్తూ.. ఇప్పటికే తన మాటలు వెనక్కి తీసుకున్నానని చెప్పారు. ఖర్గేకు క్షమాపణ కూడా చెప్పానని అన్నారు.

మహారాష్ట్రలో మళ్లీ రిజర్వేషన్ల పోరు

- ఆగస్టు 29న నిరాహార దీక్ష : మనోజ్ జారంగె

జల్నా : మహారాష్ట్రలో మరోమారు రిజర్వేషన్ల కోసం పోరు సాగనుంది. మరాఠా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మహారాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రిజర్వేషన్ల కోసం పోరు సల్పే కార్యకర్త మనోజ్ జారంగె విమర్శించారు. ఈ డిమాండ్లు అమలు కాకపోతే ఆగస్టు 29న ముంబయిలో తాజాగా నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. అలాగే ముంబయి నగరానికి మార్చ్ చేపడతామన్నారు. జల్నా జిల్లాలోని అంతర్వాలి సర్తి గ్రామంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం మరాఠా కమ్యూనిటీని మోసం చేసిందని విమర్శించారు. మరాఠాలందరినీ కుంబిస్ (ఇతర వెనుకబడిన తరగతుల కేటగిరీ కింద నమోదైన వ్యవసాయ కులం) గా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మనోజ్ గతంలో అనేకసార్లు నిరాహార దీక్షలు చేపట్టారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు, చదువులో కూడా రాజకీయంగా ఆధిపత్యం కలిగిన ఈ కమ్యూనిటీకి రిజర్వేషన్లు వుండాలని కోరారు. మరాఠా కమ్యూనిటీని కుంబీస్‌గా వర్గీకరించిన బాంబే, సతారా, హైదరాబాద్ గెజిట్‌లతో సహా పలు చారిత్రక రికార్డులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. మరాఠాల నాలుగు ప్రధాన డిమాండ్లను అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది, కానీ వాటిని ఇంతవరకు నెరవేర్చలేదని జారంగె విమర్శించారు.

అమెరికా జోక్యంపై అదే సైలెన్స్

(మొదటి పేజీ తరువాయి)

భారత్ 30 నిమిషాల్లోనే లొంగిపోయింది. 20 నిమిషాల్లోనే అంతా అయిపోయింది. అరగంటలోనే కాల్పుల విరమణ ప్రకటించారు' అని రాహుల్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. త్రివిధ దళాలను సమర్థవంతంగా ఉపయోగించేందుకు రాజకీయ సంకల్పం ఉండాలని, 1971 యుద్ధంలో అప్పటి ప్రభుత్వం నిర్ణయాత్మకంగా వ్యవహరించిందని, అప్పటి జనరల్ మాణిక్ షాకు నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని గుర్తు చేశారు.



యుద్ధ విమానాలు కోల్పోయామో చెప్పాలి: అఖిలేశ్

సరిహద్దు వద్ద శాంతి కావాలని, మన భూభాగాన్ని ఎవరూ ఆక్రమించొద్దని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ వేళ ఎన్ని యుద్ధ విమానాలు కోల్పోయామో చెప్పాలని డిమాండ్ చేశారు. 'కాల్పుల విరమణ ప్రకటనకు కారణం ఏమిటి? ప్రభుత్వమే ప్రకటన చేస్తుందని అంతా ఆశించాం. కానీ వాళ్లకున్న ధృడమైన మిత్రత్వం కారణంగా ప్రభుత్వం వాళ్ల మిత్రుడి (ట్రంప్)ని కాల్పుల విరమణ ప్రకటన చేయమని కోరినట్లు ఉంది' అని ఎద్దేవా చేశారు. కాశ్మీర్‌లో 370వ అధికరణ రద్దు చేశాక..అక్కడ పర్యాటకం పెరిగిందని ప్రభుత్వం చెబుతూ వచ్చిందని, అందువల్లే ప్రభుత్వ మాటలు నమ్మి పర్యాటకులు అక్కడకు వెళ్లి ఉగ్రవాద దాడికి బలైపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వినే తీరిక లేనివాళ్లకు పదవులెందుకు.. : ఖర్గే

ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై ఉభయ సభల్లో చర్చ జరుగుతుండగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సభలో లేకపోవడాన్ని రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. తామంతా అఖిల పక్ష సమావేశంలో పాల్గొంటే ఆయన బీహార్‌లో రాజకీయ ర్యాలీలో పాల్గొన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వినేందుకు మీకు ధైర్యం లేకపోతే మీరు ఆ పదవిలో ఉండటానికి కూడా అర్హులు కారు' అని విమర్శించారు. భద్రతా లోపాల కారణంగానే పహల్గాం ఉగ్రగాడి ఘటన జరిగిందని, దీనికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలన్నారు. కాంగ్రెస్ ఆయుధాల ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తే వాళ్లు అబద్ధాల ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఏ నేత కూడా చెప్పలేదు : ప్రధాని మోడీ

ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను మట్టిలో కలిపేశామని, ఈ విజయానికి సంకేతంగా భారత్ విజయోత్సవాలు చోటుసుకుంటోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. 140 కోట్ల మంది భారతీయులు తనపై నమ్మకం ఉంచారని, సిందూర్ శపథాన్ని నెరవేర్చామని గొప్పలు చెప్పుకున్నారు. త్రివిధ దళాలకు సంపూర్ణ స్వేచ్ఛనిచ్చామని అన్నారు. భారత సైన్యం పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టిందని, ఊహలకు కూడా అందని విధంగా ఉగ్రవాదులను శిక్షించామని, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను మట్టిలోనే కలిపేశామన్నారు. ఏప్రిల్ 22న కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశామని, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే ఉగ్రదాడి జరిగిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఆపాలని ప్రపంచంలో ఏ నేత తమకు చెప్పలేదని ఆయన పేర్కొన్నారు. ' జెడి వాన్స్ (అమెరికా ఉపాధ్యక్షులు) మే 9న పెద్ద ఎత్తున దాడి జరపబోతోందని నాకు చెప్పారు. దీనికి నేను పాక్ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని జెడి వాన్స్‌కు తెలిపాను' అని అన్నారు.

దేశం తలవంచదు : రాజ్‌నాథ్ సింగ్

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ పాకిస్థాన్ చేపడుతున్న అణ్వాయుధ బెదిరింపులకు దేశం తలవంచదని చెప్పారు. ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా తిప్పికొడుతుందన్నారు. ప్రతిపక్షాల సభ్యులు ఎంత సేపూ ఎన్ని యుద్ధ విమానాలో కోల్పోయామో చెప్పాలని ప్రశ్నిస్తున్నారే కానీ..పాక్ ఎన్ని యుద్ధ విమానాలు కోల్పోయిందో అడగడం లేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు కేవలం కామా మాత్రమే పెట్టామని, ఫుల్ స్టాప్ పెట్టలేదన్నారు.

ప్రతీకారం తీర్చుకున్నాం : అమిత్ షా

కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నామన్నారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని అంతమొందించామని అన్నారు. అయితే ఆపరేషన్ సిందూర్ నిలిపివేయడానికి ఆయన సామాజిక కోణాన్ని కారణంగా చెప్పుకొచ్చారు. 'పాకిస్థాన్ సైనిక వ్యవహారాల డైరెక్టర్ జనరల్ (డిజిఎంఒ) వాళ్ల వైపు నుంచి దాడుల్ని ఆపేస్తున్నట్లు ఈ ఏడాది మే 10న సాయంత్రం 5 గంటలకు ఫోన్ చేశారు. అయితే అవకాశం ఉన్న సమయంలో ఎందుకు దాడి చేయలేకపోయారని మీరు అడుగుతున్నారు..కానీ ప్రతి యుద్ధానికి ఒక సామాజిక కోణం ఉంటుంది' అని అమిత్ షా అన్నారు. మరోవైపు ఈ సందర్భంగా తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూపైనా, ఇతర కాంగ్రెస్ పాలకులపైనా ఆయన ఆరోపణలు గుప్పించారు.



సరైన భద్రత లేనందునే..: ప్రియాంక గాంధీ

కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ మాట్లాడుతూ పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. పటిష్టమైన భద్రత లేనందునే అక్కడ ఉగ్రవాద దాడి చోటుచేకుందని ఆమె పేర్కొన్నారు. బైసారన్ వ్యాలీలో ఎందుకు భద్రతను ఏర్పాటు చేయలేకపోయారని ఆమె ప్రశ్నించారు. ఈ లోపం వల్లే 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారని ఆమె వాపోయారు. బిజెపి వాళ్లు ఎంతసేపూ గతంలో అది అలా జరిగింది..ఇలా జరిగిందంటూ తప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారే మినహా..ప్రస్తుత పరిస్థితికి బాధ్యత ఎవ్వరిదనే విషయాన్ని మర్చిపోతున్నారంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

జీవన సౌరభం

ఆశావాది తనకు వచ్చిన ఆపదలో అవకాశాలను వెతుక్కుంటే.. నిరాశావాది తనకొచ్చిన అవకాశాల్లో ఆపదలు వెతుక్కుంటాడు.

మీ కోసం

ఫ్రిజ్‌లో మీగడ నిల్వ వుంచేటప్పుడు టీ స్పూన్ పంచదార కలిపితే తాజాగా ఉంటుంది.



కుక్కతోక వంకర



అప్పన్న, సీతాలు భార్యాభర్తలు. వారి ఒక్కగానొక్క కొడుకు రాము. ఆరో తరగతి చదువుతున్నాడు. ఉపాధ్యాయులు పాఠం చెప్పేటప్పుడు వినకుండా పక్కవారితో మాట్లాడటం, బడికి ఆలస్యంగా వెళ్ళడం, హోంవర్క్ చెయ్యకపోవడం రాముకు ఉన్న చెడు అలవాట్లు.

ఉపాధ్యాయులు ఎన్ని సార్లు మందలించినా రాము తన పద్ధతిని మార్చుకోలేదు. ఒకరోజు సత్యం మాస్టారు రాము క్లాసుకి వెళ్ళారు. అందరి హోంవర్కులు చూసారు. పిల్లలందరూ చేసారు. రాము మాత్రమే చెయ్యలేదు.

'కుక్కతోక వంకర' అన్నట్టు నీ బుద్ధి మారలేదు. అని మందలించి రాముని తరగతి గది బయట నిలబెట్టారు. ఆ మాటలు విని "రాము హోంవర్క్ రాయకపోవడానికి 'కుక్కతోక వంకర'కి సంబంధం ఏమిటి మాస్టారు" అని ఆశ్చర్యంగా అడిగాడు రాము స్నేహితుడు రాజు.

అప్పుడు సత్యం మాస్టారు ఒక కథ చెప్పారు. 'పూర్వం ఒక జమీందారుకి కుక్కలంటే చాలా ఇష్టం. వివిధ దేశాల నుండి రకరకాల కుక్కలను తెప్పించి పెంచేవాడు. 'కుక్క తోక వంకరగా ఉండడం అశుభ సూచకమని జమీందారుకు ఎవరో చెప్పారు. దాంతో జమీందారుకు భయం పట్టుకుంది. 'ఎవరైనా కుక్క తోకను తిన్నగా చేయగలిగితే వారికి వెయ్యి రూపాయల బహుమతి ఇస్తాను' అని ప్రకటించాడు.

అంతే! చాలామంది కుక్క తోకకు తాడులు కట్టి, రాళ్లు కట్టి అనేక విధాల ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. తోకను వదిలిన వెంటనే అది మళ్లీ వంకరగానే మారిపోయేది. చివరికి ఓ పండితుడిని పిలిచి పరిష్కారం అడిగాడు జమీందారు. పండితుడు నవ్వుతూ 'మీరెన్ని ప్రయత్నాలు చేసినా, కుక్క తోక వంకరగానే ఉంటుంది. ఎందుకంటే అది దాని సహజ లక్షణం!' అని చెప్పాడు. అసలు విషయం తెలిసిన జమీందారు తన ప్రయత్నాన్ని ఆపుకున్నారు.

అలా ఆనాటి నుంచి ఈ సామెత వాడుకలోకి వచ్చింది. కొందరి చెడు అలవాట్లు కూడా ఎన్ని సార్లు చెప్పినా మారవు. అలాంటి సందర్భాల్లో మనం 'కుక్కతోక వంకర' అనే సామెత వాడుతున్నాము' అని కథ ముగించారు సత్యం మాస్టారు.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

సరి చేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన పదాలలో గీత గీసిన అక్షరం తప్పగా వచ్చింది. సరైన అక్షరం మీరు రాయండి..

దొ సకాయ -	తోటైకూర -
క్రకరకాయ -	మురపకాయ -
బండకాయ -	బంగాలద్రెంప -
బిరకాయ -	చుక్కుడుకాయ -
గోంగ్రర -	మాలక్కాయ -

నేను గీసిన బొమ్మ





ఎస్ ముబషిర తబస్సుమ్,
2వ తరగతి,
సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ స్కూల్,
ఎన్ఆర్ పేట,
కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పుట్టగొడుగుల్లో పోషకాలు పుష్కలం



ఈ సీజన్‌లో సహజసిద్ధంగా లభించే పుట్టగొడుగుల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పుట్టగొడుగుల్లో సెలీనియం, విటమిన్ సి, కోలిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. యాంటీ ఆక్సిడెంట్లతో పాటు, పుట్టగొడుగుల్లో ప్రొటీన్, బి-కాంప్లెక్స్ విటమిన్లు, ఫైబర్ కూడా ఉంటాయి. ఈ పోషకాలన్నీ కలిసి కణం, కణజాల నష్టాన్ని నిరోధించడంలో సహాయ పడతాయి. రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తాయి.

ఇందులో ఉండే విటమిన్ డి ఎముకలు, కీళ్ల సమస్యల పరిష్కారానికి దోహదపడుతుంది. పుట్టగొడుగుల్లో ఎర్గోస్టెరాల్ అనే 'ప్రోవిటమిన్' ఉంటుంది. ఇవి సూర్యరశ్మికి గురైన తర్వాత విటమిన్ డిగా మారుతుంది. విటమిన్ డి సాంద్రతను పెంచడంలో ఇది సహాయపడుతుంది.

పుట్టగొడుగుల్లో యాంటీఆక్సిడెంట్లు, బి-కాంప్లెక్స్ విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి.

బీటా-గ్లూకాన్ అనేది పుట్టగొడుగుల్లో సాధారణంగా కనిపించే ఒక కరిగే ఫైబర్. ఈ కరిగే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

పుట్టగొడుగుల్లో గ్లూటాతియోన్, విటమిన్ సి, సెలీనియం వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మంపై ముడతలు రాకుండా సహాయపడతాయి.

వేళ్ల మధ్య దురద, పగుళ్లు ఇలా పోగొట్టుకోండి..



వర్షాకాలం వచ్చిందంటే చాలు, వాతావరణంలో తేమ పెరిగి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. వీటిలో సాధారణంగా కనిపించే ఒక సమస్య కాలి వేళ్ళ మధ్య ఫంగల్ ఇన్ఫెక్షన్ లేదా పాదం పగుళ్లు. దీనివల్ల చాలాసార్లు కాలి వేళ్ళ మధ్య విపరీతమైన దురద వస్తుంది, చర్మం పగులుతుంది. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే చాలు.

ఆవాల నూనె, వెల్లుల్లి : 2-3 వెల్లుల్లి రెబ్బలను ఆవాల నూనెలో వేసి వేడి చేయాలి. చల్లారిన తర్వాత ఈ నూనెను కాలి వేళ్ళ మధ్య రాయాలి. ఆవాలు, వెల్లుల్లిలో ఉండే యాంటీ-ఫంగల్, యాంటీ-బ్యాక్టీరియల్ గుణాలు పగుళ్లను, ఇన్‌ఫెక్షన్లను వేగంగా నయం చేస్తాయి. ఈ పద్ధతిని సాధారణంగా చాలా మంది ఉపయోగిస్తారు.

రావి చెట్టు బెరడు నీరు : రావి చెట్టు ఎండు బెరడును నీటిలో మరిగించాలి. ఆ గోరువెచ్చని నీటితో రోజుకు రెండుసార్లు 10-15 నిమిషాల పాటు పాదాలను కడగాలి. రావి బెరడులో యాంటీసెప్టిక్ గుణాలు ఉంటాయి, ఇవి గాయాలను, ఇన్‌ఫెక్షన్లను వేగంగా నయం చేస్తాయి.

పసుపు, కొబ్బరి నూనె : 1 చెంచా పసుపులో కొద్దిగా కొబ్బరి నూనె కలిపి పేస్ట్‌గా చేసి, పగుళ్ల లేదా ఇన్‌ఫెక్షన్ ఉన్న చోట రోజుకు రెండుసార్లు రాయాలి. పసుపు ఇన్‌ఫెక్షన్లను తొలగిస్తుంది కొబ్బరి నూనె తేమను అందించి చర్మం పొడిగా మారకుండా చూస్తుంది.

వేప ఆకుల మరిగించిన నీరు : 10-15 వేప ఆకులను నీటిలో మరిగించి, ఆ నీటితో రోజుకు రెండుసార్లు పాదాలను కడగాలి. వేపకు శక్తివంతమైన యాంటీబ్యాక్టీరియల్, యాంటీఫంగల్ గుణాలు ఉన్నాయి, ఇవి చర్మ సమస్యలను దూరం చేయడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి.

చీమలకు చెక్ పెట్టండిలా ...



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మాత్రమే కాదు; అనేక రకాల సమస్యలు ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఈ కాలంలో చీమలు ఇంట్లో ఎక్కువగా కనిపిస్తూ చికాకు పెడతాయి. ఇంట్లో దొరికే వస్తువులతోనే వాటి బెడదను తప్పించుకోవచ్చు.

- ఒక వంతు డిష్ సోప్, రెండు వంతుల నీటితో ద్రావణం తయారుచేసి, సీసాలో పోయాలి. ఇంటి మూలలో లేదా గోడపై చీమలు కనిపించిన చోట ఈ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- స్ప్రే బాటిల్‌లో సగం నీరు, సగం వైట్ వెనిగర్ ద్రావణాన్ని కలిపి కూడా పిచికారీ చేయవచ్చు.
- అలాగే స్ప్రే బాటిల్‌లో వెనిగర్, నిమ్మరసం కలిపిన నీటిని స్ప్రే చేసినా చీమలు పోతాయి.
- చీమలు ఎక్కువగా కనిపించిన చోట బోరిక్ యాసిడ్ చల్లితే చీమలు చనిపోతాయి.
- ఎండు మిరపకాయలు, దాల్చిన చెక్క , నిమ్మ తొక్కలను గది మూలలో ఒక గిన్నెలో ఉంచితే, చీమల బెడద తగ్గుతుంది.
- ఇంటిని తుడిచే నీటిలో కొన్ని చుక్కల నిమ్మరసాన్ని కలిపి శుభ్రపరిస్తే చీమలు తగ్గుతాయి.
- దాల్చిన చెక్క పొడిని చల్లినా చీమల బెడద తగ్గుతుంది.
- పుదీనా నూనెను పిచికారీ చేసినా ఫలితం ఉంటుంది.
- బేబీ పౌడర్‌ని చీమలపై చల్లినా చీమలు రావడం తగ్గుతుంది.
- కాఫీ గింజలు లేదా కాఫీ పొడిని చీమలు ఉన్న ప్రదేశంలో చల్లితే చీమలు రావు.
- చాక్‌పీస్‌లను మెత్తగా నూరి చీమలు వచ్చే ప్రదేశంలో చల్లినా వాటి బెడద తగ్గుతుంది.
- మిరియాల పొడిని నీటిలో కలిపి స్ప్రే చేసినా చీమలు మాయమవుతాయి.
- మొక్కజొన్న పిండిని వాటిపై చల్లితే ఎటూ కదలకుండా ఉండిపోయి చనిపోతాయి.



అల్లాన్ని ఇలా నిల్వ చేసుకోండి

వంటగదిలో అల్లానికి ప్రత్యేక స్థానం ఉంది. అల్లంలో సహజ యాంటీ ఇన్ ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది ముఖ్యంగా జీర్ణక్రియను పెంచుతుంది. కడుపు నొప్పి నుంచి కూడా ఉపశమం ఇస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా.. అధిక బరువును తగ్గిస్తుంది. బ్లడ్ షుగర్‌ను నియంత్రిస్తుంది. కండరాల్లో నొప్పికి, జలుబు, దగ్గులకు ఉపశమనం కలిగిస్తుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్న అల్లాన్ని ఎక్కువ రోజులపాటు ఎలా నిల్వ చేసుకోవాలో చూద్దాం.

చాలా మంది అల్లాన్ని ఫ్రిడ్జలలో స్టోర్ చేస్తారు. అలా చేస్తే అల్లం త్వరగా ఎండిపోతుంది. ఫ్రిడ్జలోనే కాకుండా.. బయట కూడా అల్లాన్ని చక్కగా స్టోర్ చేసుకోవచ్చు.

ఫ్రిడ్జ్‌లో నిల్వ ఇలా :



గాలి చొరబడని ఓ జిప్ కవర్‌లో గానీ, కంటైనర్స్‌లో అయినా స్టోర్ చేసుకోవచ్చు. ఇలా చేస్తే అల్లం ఎండిపోదు.

- కట్ చేసిన అల్లం ముక్కలు నేరుగా ఫ్రిడ్జ్‌లో పెట్టకుండా గాలి చొరబడని డబ్బాలో పెట్టి, నిల్వ చేసుకోవచ్చు.

బయట నిల్వ ఇలా :

- అల్లంని టిష్యూ పేపర్ లేదా నార్మల్ పేపర్‌లో అయినా చుట్టి జిప్ లాక్ బ్యాగ్‌లో పెట్టుకోవచ్చు.
- అల్లాన్ని ఎండలో ఎక్కువగా ఉంచకుండా.. చల్లని పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి.
- నిల్వ చేసేటప్పుడు అల్లం తడిగా ఉండకూడదు. బాగా ఆరిపోవాలి.
- అల్లం తొక్క తీసి, చిన్న ముక్కలుగా కట్ చేసి వెనిగర్, పంచదార నీరు కలిపిన మిశ్రమంలో ఉంచినా త్వరగా పాడవ్వదు.
- ఒక చిన్న మట్టిపాత్రలో ఇసుక వేసి, తేమగా చేసి, అందులో అల్లం నిల్వ చేస్తే ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.

'ఐదుగురు హీరోయిన్లు లేరు ..'



చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం ప్రస్తుతం చివరి షెడ్యూల్ జరుపుకుంటోంది. కొంతకాలంగా ఈ సినిమాలో చిరంజీవి పక్కన ఐదుగురు హీరోయిన్లు నటిస్తున్నారని పలు వార్తలు సోషల్ మీడియాను వైరల్ అవుతున్నాయి. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న చిత్ర దర్శకుడు వశిష్ట ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. 'మా సినిమాలో ఐదుగురు హీరోయిన్స్ ఉన్నారంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా చేస్తున్నారు. అషికా రంగనాథ్ సెకండ్ లీడ్‌గా నటించనున్నారు. మిగతా నటీమణులు కొన్ని ముఖ్య పాత్రలో కనిపిస్తారు' అని చెప్పారు. ఇంకా 'వీఎఫ్ఎక్స్ వర్క్ కారణంగానే చిత్రం విడుదల ఆలస్యమవుతుంద'ని చెప్పారు. అలాగే 'అవతార్' కాపీ అంటూ వచ్చిన వార్తలపై కూడా ఆయన స్పందించారు. 'ఈ చిత్రం 'అవతార్'కి కాపీ కాదని, 1998లో 'చందమామ పుస్తకంలో వచ్చిన 'జ్వాల ద్వీపం' సిరీస్ తనని ఎంతగానో ప్రభావితం చేసిందని, ఆ కథ ఆధారంగానే ఈ చిత్ర కథ రాసుకున్నా'నని చెప్పారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

'ది రాజా సాబ్'లో సంజయ్‌దత్ ఫస్ట్‌లుక్ పోస్టర్

కథానాయకుడు ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్'. నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, మాళవిక మోహన్ కథానాయికలు. డిసెంబర్ 5న థియేటర్లలో ఈ సినిమా విడుదల కానుంది. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. మంగళవారం నాడు సంజయ్‌దత్ 66వ పుట్టినరోజు సందర్భంగా చిత్ర నిర్మాతలు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో సంజయ్‌దత్ లుక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. దక్షిణాది సినిమాలతో సంజయ్‌దత్ బిజీగా ఉన్నారు. బాలీవుడ్‌లోనూ 'బాఘి 4', 'వెల్‌కమ్ టు ది జంగిల్' చిత్రాల్లో నటిస్తున్నారు. ఆయన నటించిన మరో చిత్రం 'సన్ ఆఫ్ సర్దార్- 2' ఆగస్టు 1 న థియేటర్లలోకి రిలీజ్ కానుంది.





'సతీ లీలావతి' టీజర్ విడుదల

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'సతీ లీలావతి'. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాతినేని సత్య దర్శకత్వం వహించారు. తాజాగా ఈ చిత్రం నుండి టీజర్‌ని విడుదలచేశారు. భార్య భర్తల మధ్య జరిగే గొడవలు, వి.కె.నరేష్, వి.టి.వి.గణేష్, సప్తగిరి, జాఫర్, మొట్ట రాజేంద్రన్ వంటి హాస్య పాత్రల ఎంట్రీతో ఈ టీజర్‌ని కట్ చేశారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాను విడుదల చేయటానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా, బినేంద్ర మీనన్ కెమెరామెన్‌గా, సతీష్ సూర్య ఎడిటర్‌గా వ్యవహరించారు.



'అవతార్ 3' ట్రైలర్ వచ్చేసింది

హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన 'అవతార్ 3' సినిమా నుండి తాజాగా ట్రైలర్ విడుదలైంది. 'అవతార్ : ఫైర్ అండ్ యాష్' టైటిల్‌తో అవతార్ సిరీస్‌లో ఈ మూడో భాగం డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజా ట్రైలర్‌లో కొత్త అగ్ని నేవీ తెగలు, పాండోరా మళ్ళీ ఎదుర్కొంటున్న మానవ ముప్పు, కొత్త ఎమోషనల్ కోణాలని చూపించారు. దర్శకుడు జేమ్స్ కామెరూన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ పార్ట్‌లో కొత్త విలన్లు తెరపైకి రానున్నారు. ఇప్పటికే మానవ ప్రపంచంతో జేక్ ఫ్యామిలీ రెండుసార్లు పోరాడింది. ఈసారి 'యాష్ వరల్డ్' లోని తెగలతో తలపడాల్సి వస్తుంది. పాండోరాలోని భిన్న భిన్న జీవన శైలుల మధ్య విభేదాలు, పోరాటాల్ని ఈసారి చూపించనున్నారని దర్శకుడు తెలిపారు. 'అవతార్' మొదటి భాగం భూమితో, రెండో భాగం నీటితో ముడిపడిన కథలుగా సాగాయి. ఈ మూడో భాగం అగ్ని నేపథ్యంగా సాగుతుంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా, భారీ స్థాయిలో 160కి పైగా భాషల్లో విడుదల కానుంది. చిత్ర బృందం వెల్లడించిన వివరాల ప్రకారం, 'అవతార్ 4' ను 2029లో, 'అవతార్ 5' ను 2031 డిసెంబరులో విడుదల చేయనున్నారు. ఈ రెండు భాగాలు కూడా విజువల్ ఎఫెక్ట్స్ పరంగా, కథాపరంగా ప్రేక్షకులను మరోసారి అబ్బురపరిచేలా ఉంటాయని దర్శకుడు తెలిపారు.

భారత చెస్‌కు ఉజ్వల భవిష్యత్తు

- విశ్వనాథన్ ఆనంద్



ఫిడే మహిళల ప్రపంచకప్ టైటిల్‌తో దివ్య దేశ్‌ముఖ్, రన్నరప్ కోనేరు హంపి, టాన్ జోంగీ(చైనా)



చెన్నై: భారత చెస్‌కు రాబోయే రోజుల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందని ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ అన్నారు. 19ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ ఫిడే మహిళల ప్రపంచకప్ టైటిల్ విజేతగా నిలిచిన అనంతరం ట్విటర్ ఎక్స్‌లో ఇలా పేర్కొన్నారు. తాజాగా దివ్య దేశ్‌ముఖ్ ప్రపంచకప్ టైటిల్‌ను సాధించి కొత్త చరిత్ర సృష్టించిందని, ఈ క్రమంలోనే గతంలో కోనేరు హంపి, డి. గుకేశ్‌తో పాటు చెస్ ఒలింపియాడ్‌లో భారతజట్టుకు స్వర్ణ పతకం లభించడం భారత చెస్‌కు స్వర్ణ యుగంలాంటిదని తెలిపారు. ఈ ఏడాది ఫిడే మహిళల ప్రపంచకప్ ఫైనల్‌కు ఇద్దరు భారత గ్రాండ్‌మాస్టర్లు చేరి కొత్త చరిత్ర సృష్టించారని, గత ఏడాది యువ గ్రాండ్‌మాస్టర్లతో కూడిన భారత చెస్ జట్టు ఒలింపియాడ్‌లో బంగారు పతకాన్ని సాధించిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇటీవలే 18ఏళ్ల డి. గుకేశ్ క్యాండిడేట్స్ టైటిల్, ఈ టోర్నీకి ముందు జరిగిన ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కోనేరు హంపి గెలుచుకోవడం, 2925 ఫిడే మహిళల ప్రపంచకప్ విజేత, రన్నరప్ టైటిళ్లు భారత్‌కు దక్కడం ఇందుకు నిదర్శనమని అన్నారు. రాబోయే రోజుల్లో యువ చెస్ గ్రాండ్‌మాస్టర్లు ఆర్. ప్రజ్ఞానంద, ఆర్. వైశాలి కూడా సత్తా చాటడం ఖాయమని తెలిపారు. ఈ టోర్నీకి ముందు ఒక్క జీఎం ప్రమాణం కూడా లేకుండా బరిలోకి దిగిన దివ్య దేశ్‌ముఖ్ ఏకంగా టైటిల్‌ను కైవసం చేసుకొని గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించడం ఆమెకే చెల్లిందని పొగడ్తలతో ముంచెత్తారు. అలాగే భారత్‌నుంచి 88వ గ్రాండ్‌మాస్టర్‌గా దివ్య దేశ్‌ముఖ్ నిలిచిందని రాబోయే టోర్నీల్లో మన చెస్ గ్రాండ్‌మాస్టర్లు మరిన్ని పతకాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ట్విటర్‌లో రాసుకొచ్చారు. విజేతగా నిలిచిన దివ్యకు గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌తోపాటు రూ.43.45లక్షలు ప్రైజ్‌మనీ లభించగా.. కోనేరు హంపికి రన్నరప్ టైటిల్‌తో పాటు రూ.30.41లక్షలు, మూడోస్థానంలో నిలిచిన చైనా గ్రాండ్‌మాస్టర్ టాన్ జోంగీకి 21.72లక్షల ప్రైజ్‌మనీ మంగళవారం అందజేశారు. మూడో స్థానం కోసం జరిగిన పోరులో టాంగ్ చైనాకే చెందిన లీ-టింగ్జీపై విజయం సాధించింది. 1, 2 స్థానాల్లో నిలిచిన దివ్య, హంపి మహిళల క్యాండిడేట్స్ టోర్నీకి కూడా అర్హత సాధించారు.

భారత్‌కు క్లిష్టమైన డ్రా

ఎఎఫ్‌సి మహిళల ఆసియాకప్



టోక్యో: ఎఎఫ్‌సి మహిళల ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నీలో భారత్‌కు క్లిష్టమైన డ్రా లభించింది. గత సీజన్ టోర్నీకి ఆతిథ్యంతోపాటు తమకంటే మెరుగైన ర్యాంక్ జట్టును ఓడించడం ద్వారా భారత మహిళ జట్టు 2026 ఎఎఫ్‌సి మహిళల ఆసియాకప్‌కు చోటు దక్కించుకుంది. సిడ్నీ టౌన్ హాల్‌లో మంగళవారం జరిగిన అధికారిక డ్రాలను విడుదల చేశారు. గ్రూప్-సిలో భారత్‌కు చోటు లభించగా.. ఇదే గ్రూప్‌లో జపాన్, వియత్నాం, చైనీస్ తైపీ జట్లు కూడా ఉన్నాయి. భారత్ వేదికగా జరిగిన అర్హత టోర్నీలో నిరాశపరిచిన భారత మహిళలజట్టు థాయ్‌లాండ్‌పై గెలుపుతో ఈ టోర్నీకి బెర్త్‌ను ఖాయం చేసుకుంది. 2022లో భారత్ వేదికగా జరిగిన టోర్నీలో బంగ్లాదేశ్, చైనీస్ తైపీ, ఉత్తర కొరియా, ఇండియా, ఇరాన్, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్తాన్ మరియు వియత్నాంతో పాటు ఆస్ట్రేలియా జట్లు పాల్గొన్నాయి. టైటిల్ విజేతగా చైనా నిలువగా.. రన్నరప్‌గా కొరియా రిపబ్లిక్, మూడో స్థానంలో జపాన్ నిలిచి ఎఎఫ్‌సి 2026 మహిళల ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించాయి. ఇక ఆతిథ్య హోదాలో ఆస్ట్రేలియా కూడా అర్హత సాధించింది. జులై 23 నుంచి జులై 29వరకు జరిగిన క్వాలిఫయర్ మ్యాచ్‌ల నుంచి మిగతా జట్లు తమ బెర్త్‌లను ఖాయం చేసుకోవడంతో షెడ్యూల్ విడుదలైంది.

గ్రూప్‌లు.. (బ్రాకెట్లలో ర్యాంకింగ్స్)

గ్రూప్-1 : ఆస్ట్రేలియా(15), జపాన్(7), డిపిఆర్ కొరియా(9)

గ్రూప్-2 : చైనా(17), కొరియా రిపబ్లిక్(21), వియత్నాం(37)

గ్రూప్-3 : ఫిలిప్పీన్స్(41), చైనీస్ తైపీ(42), ఉజ్బెకిస్తాన్(51)

గ్రూప్-4 : ఇరాన్(68), ఇండియా(70), బంగ్లాదేశ్(128)

సాత్విక్-చిరాగ్ శుభారంభం

మకావు: మకావు బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల డబుల్స్ తొలిరౌండ్‌లో 2వ సీడ్ సాత్విక్-చిరాగ్ జంట 21-13, 21-15తో మలేషియాకు చెందిన లో హెచ్‌వై-ఎన్‌జి ఎఫ్‌సిలను చిత్తుచేశారు. భారత జంట కేవలం 36 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను ముగించారు. సింగిల్స్ క్వాలిఫయర్‌లో 2వ సీడ్ మైస్నమ్ 15-21, 21-17, 13-21తో అనూహ్యంగా ఓటమిపాలై మెయిన్ డ్రాకు అర్హత సాధించలేకపోయాడు. ఇక మహిళల సింగిల్స్‌లో తస్నీమ్ మీర్ 21-14, 13-21, 21-17తో ఇండోనేషియా ప్లేయర్‌ను చిత్తుచేయగా.. కర్బ్ 21-11, 21-13తో సింగపూర్ ప్లేయర్‌ను చిత్తుచేసి మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.

బిసిసిఐ కార్యాలయంలో ఐపిఎల్ జెర్సీలు చోరీ

ముంబయి : భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) కార్యాలయం నుంచి ఐపిఎల్ జర్సీలు చోరీకి గురయ్యాయి. ముంబయిలోని వాంఖేడే స్టేడియంలో ఉన్న బిసిసిఐ కార్యాలయంలో ఉన్న సుమారు రూ.6.5 లక్షల విలువైన ఐపిఎల్ జెర్సీలు చోరీకి గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్కడ సెక్యూరిటీ గార్డుగా పనిచేసే ఫరూఖ్ అస్లాం ఖాన్ ఆ జెర్సీలను చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఒక్కో జెర్సీ ఖరీదు రూ. 2,500 ఉంటుందని, గత నెల 13న చోరీ జరిగినట్లు తెలిసింది. స్టోర్ రూంలో స్టాక్ ఆడిట్ చేస్తుండడంతో ఈ చోరీ విషయం బయటపడింది. సిసిటివి ఫుటేజీని పరిశీలించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో బిసిసిఐ అధికారులు మెరైన్ డ్రైవ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నిందితుడు జెర్సీలను కొరియర్ ద్వారా ఆన్‌లైన్ డీలర్‌కు పంపినట్లు అంగీకరించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68